

'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే
అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 118

శుక్రవారం 19-7-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'పట్టు' కొనసాగించాలి

ఒలింపిక్స్‌లో 2008 నుంచి నిలకడగా భారత రెజ్లర్ల ప్రదర్శన - 15లో



81 వేలు దాటిన సెన్సెక్స్

24,800కి నిఫ్టీ.. నాలుగో రోజూ రికార్డుల ర్యాలీ - 15లో



పట్టాలు తప్పిన రైలు

యూపీలోని గోండా జిల్లాలో చండీగఢ్‌-దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు మృతిచెందారు.


వివరాలు 6లో ▸



సెంటర్లవారీగా ఫలితాలు

పరీక్ష కేంద్రాలు, నగరాల వారీగా నీట్ యూజీ ఫలితాలను ప్రకటించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని సుప్రీంకోర్టు ఆదేశించింది.


వివరాలు 6లో ▸



బైడెన్‌కు కరోనా

అమెరికా అధ్యక్షుడు బైడెన్ కరోనా బారిన పడ్డారు. దాంతో కీలక దశలో ఎన్నికల ప్రచారానికి ఆయన విరామం ఇవ్వాల్సి వచ్చింది.

వివరాలు 6లో ▸



మళ్లీ తెరచుకున్న రత్న భండార్

పూరీ జగన్నాథస్వామి రత్న భండార్‌ను అధికారులు మళ్లీ తెరిచారు. అందులోని సంపదను స్ట్రాంగ్ రూంలోకి మారుస్తున్నారు.

వివరాలు 6లో ▸



పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి లక్ష్యంగా పోలీసుల సమక్షంలోనే రాళ్లతో దాడి చేస్తున్న టీడీపీ గూండాలు



టీడీపీ మూకలు నిప్పుపెట్టడంతో తగలబడిపోతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప కారు

ఎంపీ మిథున్‌పై దాడి

పుంగనూరులో రోజంతా టీడీపీ గూండాల విధ్వంసకాండ

మారణాయుధాలు, రాళ్లతో పచ్చమూకల స్వైర విహారం

ఎంపీడీఓ కార్యాలయం వద్ద మాటు వేసి మూకుమ్మడిగా దాడి

2లో

- నిలువరించేందుకు యత్నించిన మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై రాళ్ల వర్షం.. రెడ్డెప్ప నివాసాన్ని చుట్టుముట్టి దుర్భాషలతో వీరంగం
- వాహనాలు ధ్వంసం.. మాజీ ఎంపీ కారుకి నిప్పు
- కళ్లెదుటే ఓ ఎంపీపై దాడికి తెగబడ్డా పోలీసుల ప్రేక్షక పాత్ర
- పరిస్థితి చేయి దాటడంతో గాల్లోకి కాల్పులు జరిపిన మిథున్‌రెడ్డి గన్‌మెన్

సొంత నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పర్యటించకుండా అడ్డుకుంటున్న కూటమి ప్రభుత్వం



'నారా'రూప రాక్షసం.. యథేచ్ఛగా నరమేధం!

- వివరాలు 10,11లో

ఏపీలో ఆటవిక పాలన

ప్రధాని మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ లేఖ

2లో

- హత్యలు, దాడులు, అకృత్యాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పాలన
- 31 మంది హత్య.. 300 మందిపై హత్యాయత్నాలు.. టీడీపీ నేతల వేధింపులు తాళలేక 35 మంది ఆత్మహత్య
- 560 చోట్ల ప్రైవేట్ ఆస్తులు.. 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం
- అరాచకాలు భరించలేక ఊళ్లు విడిచివెళ్లిన 2,700 కుటుంబాలు.. ఇవికాకుండా 1,050కి పైగా దౌర్జన్యాలు, దాడులు
- వైఎస్సార్‌సీపీని అణగదొక్కడానికి పథకం ప్రకారం చేసిన దుర్మార్గాలే ఇవన్నీ..
- ఓ మంత్రి రెడ్ బుక్ పేరిట హోర్డింగ్‌లతో దాడులకు పురిగొల్పారు
- అడ్డుకోవద్దని అధికారులకు సంకేతాలు ఇవ్వడంతో టీడీపీ గూండాల స్వైర విహారం
- వినుకొండలో నడిరోడ్డుపై నరమేధం..



- పుంగనూరులో పార్టీ లోక్‌సభ పక్ష నేత పీవీ మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకల దాడి
- ఈ అరాచకాలను అంతమొందించి తక్షణమే శాంతి స్థాపనకు చొరవ చూపండి
- కొత్త ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జరిగిన ఘటనలపై కేంద్ర సంస్థలతో విచారణ జరపాలని విన్నపం
- ఈ దురాగతాలను నివేదించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని వినతి

నేడు వినుకొండకు వైఎస్ జగన్

- టీడీపీ గూండాల చేతిలో హత్యకు గురైన పార్టీ కార్యకర్త రషీద్ కుటుంబానికి పరామర్శ
- వైఎస్సార్‌సీపీ నేతలంతా బాధిత కుటుంబానికి తోడుగా నిలవాలని ఆదేశం
- హింసాత్మక విధానాలను విడనాడాలని 'ఎక్స్' వేదికగా చంద్రబాబుకు గట్టి హెచ్చరిక

2లో

క్లుప్తంగా...

రేపు వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని శనివారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ ఎంపీలకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం సమాచారం అందించింది. బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎంపీలకు జగన్ దిశానిర్దేశం చేయనున్నారు.

ముగ్గురు డిప్యూటీ కమిషనర్‌లకు పదోన్నతి

సాక్షి, అమరావతి: కార్మిక శాఖలో డిప్యూటీ కమిషనర్(డీసీ)లుగా ఉన్న ముగ్గురికి జాయింట్ కమిషనర్(జేసీ)లుగా ప్రమోషన్ ఇవ్వడంతో పాటు, పోస్టింగ్‌లు ఇస్తూ ఆ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ గురువారం ఉత్తర్వులిచ్చారు. ప్రమోషన్ పొందిన గణేశ్‌ను కార్మిక సంక్షేమ బోర్డ్ జేసీగా నియమించారు. తిరుపతి డీసీ బాలునాయక్‌ను కర్నూల్ జే ఎగా, ఒంగోలు డీసీ శ్రీనివాసకుమార్‌ను గుంటూరు జేసీగా నియమించారు. మరోవైపు మదనపల్లె అసిస్టెంట్ కమిషనర్ రంగరాజును తిరుపతి డీసీగా, గుంటూరు డీసీ గాయత్రీ దేవికి ఒంగోలు డీసీగా పూర్తి అదనపు బాధ్యతలిస్తూ కార్మిక శాఖ కమిషనర్ శేషగిరిబాబు గురువారం ఉత్తర్వులిచ్చారు.

తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయత పిల్లల కనీస హక్కు

- స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి: తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయత, సాంగత్యం, రక్షణ పొందడం పిల్లల కనీస మానవ హక్కు అని హైకోర్టు తేల్చి చెప్పింది. తల్లిదండ్రుల మధ్య విభేదాలు పిల్లల సంరక్షణను నిరోధించజాలవని స్పష్టం చేసింది. తన ఏడేళ్ల కుమారుడిని చూసేందుకు తండ్రిని అనుమతించింది. కుమారుడిని చూసే హక్కు నుంచి ఆ తండ్రిని దూరం చేసేందుకు అసాధారణ కారణాలేవీ కనిపించడం లేదంది. ప్రతీ ఆదివారం 2గంటలపాటు తన కుమారుడితో గడిపేందుకు ఆ తండ్రికి వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. తన భార్య సంరక్షణలో ఉన్న ఏడేళ్ల కుమారుడికి తనను సహజ సంరక్షకుడిగా ప్రకటించాలని కోరుతూ వైఎస్సార్ జిల్లాకు చెందిన లతీఫ్ అనంతపురం జిల్లా కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన జిల్లా కోర్టు లతీఫ్ పిటిషన్‌ను కొట్టేసింది. దీనిని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన భార్య తండ్రి వద్ద ఉన్న తన కుమారుడిని కలుసుకునేందుకు వెసులుబాటు కల్పించాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశారు. ఈ అనుబంధ పిటిషన్‌పై జస్టిస్ తిల్హరీ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ భార్య మరొకరిని పెళ్లి చేసుకుని సౌదీలో ఉంటోందన్నారు. కుమారుడిని ఆమె తన తండ్రి వద్దే విడిచిపెట్టి వెళ్లిందన్నారు. ఈ నేపథ్యంలో కుమారుడిని చూసుకునే వెసులుబాటు ఇవ్వాలని కోరారు. కుమారుడి తల్లి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారని, దీంతో అతనితో బంధానికి స్వస్తి పలకాల్సి వచ్చిందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం కదిరి పట్టణంలో ఉన్న తాత (భార్య తండ్రి) ఇంటి వద్ద ఉన్న కుమారుడిని చూసేందుకు తండ్రికి అనుమతి ఇచ్చింది.

300 మంది అనుచరులతో చంద్రగిరి ఎమ్మెల్యే శ్రీవారి దర్శనం

తిరుమల: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ విరామ సమయంలో పాల్గొన్న ఆయన తన కోసం ఎన్నికల్లో పనిచేసిన 300 మందికి పైగా అనుచరులకు శ్రీవారి బ్రేక్ దర్శన భాగ్యం కల్పించారు. దీనికోసం ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు ఎమ్మె ల్యేల సిఫార్సు లేఖలను వినియోగించుకు న్నట్లు సమాచారం. దీనిపై టీటీడీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఒకేసారి ఇంతమంది ఎమ్మెల్యేల లేఖపై ఒక నియోజకవర్గ ఎమ్మెల్యే అనుచరులకు బ్రేక్‌దర్శనం ఎలా కేటాయిస్తారని శ్రీవారి భక్తులు ప్రశ్నిస్తున్నారు.

ఎంపీ మిథున్‌పై దాడి

పుంగనూరులో రోజంతా టీడీపీ గూండాల విధ్వంస కాండ


పుంగనూరులో కుర్చీలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేస్తున్న తెలుగుదేశం కార్యకర్తలు


పుంగనూరులో తెలుగుదేశం గూండాలు ధ్వంసం చేసిన ఎంపీ మిథున్‌రెడ్డి వాహనాలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: వినుకొండలో నడిరోడ్డుపై వైఎస్సార్ సీపీ కార్యకర్తను నరికి చంపిన టీడీపీ గూండాలు 12 గంటలు గడవక ముందే పుంగనూరులో మరో విధ్వంస కాండను సృష్టించారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా జరిగిన దాడుల్లో తీవ్రంగా గాయపడిన వారు, ఆస్తులు, పంటలను కోల్పోయిన బాధితులను పరామర్శించి భరోసా కల్పించేందుకు వచ్చిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అంతమొందించే ప్రణాళికతో పచ్చమూకలు గురువారం రోజంతా మారణాయుధాలతో తిష్ట వేసి దాడులకు దిగాయి.

నాలుగు గంటలు స్వైర విహారం..

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని హతమార్చడమే లక్ష్యంగా అసాంఘిక శక్తులు పుంగనూరులో తీవ్ర ఉద్రిక్తతలు రేకెత్తించాయి. గురువారం ఉదయం 8 గంటల సమయంలో మిథున్‌రెడ్డి పుంగనూరు ఎల్ఐసీ కాలనీలోని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప నివాసంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశమైన విషయం తెలుసుకున్న టీడీపీ మూకలు రెచ్చిపోయాయి. ఎంపీ మిథున్‌రెడ్డిని రాళ్లు, కర్రలతో కొట్టి చంపేందుకు మూకుమ్మడిగా దాడులకు తెగబడ్డాయి. టీడీపీ గూండాలను నిలువరించేందుకు యత్నించిన మాజీ ఎంపీ, దళిత నాయకుడు రెడ్డప్పపైనా టీడీపీ నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. దుర్భాషలాడుతూ రెడ్డప్ప నివాసంలోకి చొరబడ్డారు. ప్రమాదాన్ని పసిగట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు తలుపులు మూసివేయడంతో బద్ధలు కొట్టేందుకు యత్నించారు. రెడ్డప్ప నివాసంలోకి రాళ్లు రువ్వారు. ఇంటి ముందు ఉన్న పలు వాహనాలను ధ్వంసం చేసి రెడ్డప్ప వాహనానికి నిప్పు పెట్టి తగలబెట్టారు. నిలువరించేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైనా దాడులు చేశారు. ఘటన గురించి తెలియడంతో అక్కడికి చేరుకున్న మీడియా ప్రతినిధులపైనా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. 4 గంటలపాటు సాగిన ఈ విధ్వంసంతో పుంగనూరులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏకంగా ఓ ఎంపీనే హత్య చేసేందుకు తెగించినా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయంతోపాటు టీడీపీ శ్రేణులు కూల్చివేసిన ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి ఎంపీ మిథున్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు తెలుసుకున్న అల్లరిమూకలు హింసాకాండకు బుధవారం రాత్రే పక్కా పథకం రూపొందించినట్లు సమాచారం.

బెదిరింపులకు భయపడం: ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలే అజెండాగా పని చేస్తోంది. అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పురిగొల్పడం దారుణం. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. నియోజకవర్గంలో ఇలాంటి హింసాత్మక ఘటనలు గతంలో ఎప్పుడూ చూడలేదు. అభివృద్ధి అంటే వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లను కూల్చడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, పిల్లలు ఆడుకునే బ్యాడ్మింటన్ కోర్టును ధ్వంసం చేయడమా? ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదు. చంద్రబాబు ఆదేశాలతో పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. డీఎస్పీ, సీఐ స్థాయి అధికారుల ఎదుటే దాడులు జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణం. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని మరో బిహార్‌లా మార్చే యత్నం చేస్తున్నారు. ఇలాంటి దాడులకు భయపడే ప్రసక్తేలేదు. ప్రజలకు అండగా ఉంటాం. ప్రజల్లోనే ఉంటూ మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేస్తాం. తిరిగి ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుంది. అమ్మ ఒడి పథకం పేరు మార్చి తల్లికి వందనం అంటూ ఒక్కరికే ఇస్తామని మాట మార్చారు. అభివృద్ధిని విస్మరించి, సంక్షేమ పథకాలను ఆపివేసి ప్రజలను మోసం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి పొందకుండా తమ పెట్టుబడితో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ పరిశ్రమను నెలకొల్పేందుకు ముందుకు వచ్చిన సంస్థను చంద్రబాబు సర్కారు కుటిల యత్నాలతో అడ్డుకోవడం సరికాదు. హింసాత్మక ఘటనలు పునరావృతమైతే టీడీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

మూకుమ్మడిగా చంపాలన్నదే టార్గెట్!

ప్రణాళికలో భాగంగా టీడీపీ మూకలు ఉదయం నుంచి స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో రాళ్లు, కర్రలు, ఇతర ఆయుధాలతో మాటు వేశాయి. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ముగించి మిథున్‌రెడ్డి బయటకు వస్తున్నట్లు గుర్తించి ఒక్కసారిగా విరుచుకుపడ్డాయి. రాళ్లు రువ్వుతూ మాజీ ఎంపీ రెడ్డప్ప నివాసాన్ని చుట్టుముట్టాయి. వారిని అడ్డుకునేందుకు యత్నించిన రెడ్డప్పపైనా దాడికి దిగాయి. 'రేయ్.. బయటకు రారా..' అంటూ దుర్భాషలకు దిగాయి. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ గాయపడగా 25 మందికిపైగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు సాక్షి విలేకరులతోపాటు మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు.

గాల్లోకి కాల్పులు జరిపిన ఎంపీ గన్‌మెన్

ఎంపీ, మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నేతలకు చెందిన 15 వాహనాలను టీడీపీ గూండాలు ధ్వంసం చేశారు. మరో 12 ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్ప వాహనానికి నిప్పుపెట్టి తగలబెట్టారు. రెడ్డెప్ప నివాసం వద్ద పరిస్థితి అదుపు తప్పుతుండటంతో అల్లరి మూకల నుంచి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని రక్షించేందుకు గన్‌మెన్ రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు.

అడుగడుగునా పోలీస్ వైఫల్యం

పుంగనూరులో జరిగిన విధ్వంస కాండలో అడుగడుగునా పోలీసుల నిర్లక్ష్యం కనిపించింది. పోలీసుల సమక్షంలోనే రాళ్లు రువ్వుతూ, కర్రలతో స్వైర విహారం చేస్తున్నా చూస్తుండిపోయారు. భారీగా టీడీపీ మూకలు మోహరించినా వెంటనే స్పందించాల్సిన ఉన్నతాధికారులు తీరిగ్గా కొంత మంది పోలీసులను పంపి చేతులు దులుపుకోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఎంపీ మిథున్‌రెడ్డి అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు.

బాబు ఆదేశాలతో హౌస్ అరెస్టు..

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి గత నెల 15న పుంగనూరులో పర్యటించాల్సి ఉంది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పోలీసులు వారిద్దరినీ తిరుపతిలో హౌస్ అరెస్ట్ చేశారు. తాజాగా పార్టీ కార్యకర్తలను, బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ఎంపీ మిథున్‌రెడ్డిని ఏకంగా హతమార్చేందుకు పచ్చమూకలు పథకం వేశాయి.

రాళ్లతో కొట్టి చంపే యత్నం



రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని రాళ్లతో కొట్టి చంపాలని టీడీపీ రౌడీమూకలు యత్నించాయి. పోలీస్ వ్యవస్థ నిర్వీర్యమైంది. ఎక్కడా లా అండ్ ఆర్డర్ లేదు. రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది. దళిత నాయకుడినైనా నాపైనా దాడి చేశారు. నా ఇంటిని చుట్టుముట్టి రాళ్లు, మారణాయుధాలతో దాడికి తెగబడ్డారు. నా కారుకి నిప్పుపెట్టారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వచ్చాక విధ్వంసకాండకు తెర తీసింది. ప్రశాంతంగా ఉండే పుంగనూరులో 12 సార్లు దాడులు జరిగాయి.

– మాజీ ఎంపీ రెడ్డప్ప

పాలనపై దృష్టి పెట్టండి



చంద్రబాబు దాడులపై కాకుండా పాలనపై దృష్టి సారించాలి. ప్రజా ప్రతినిధులకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థ నిర్వీర్యంగా మారింది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు తగవు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చి వారి మెప్పు పొందాలే కానీ దాడులకు పాల్పడడం సరి కాదు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం నిర్వీర్యం కాకుండా చూసే బాధ్యత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులదే. వారి తీరు చూస్తుంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించే పరిస్థితి కనిపించటం లేదు.

– నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం

హేయమైన చర్య



రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై టీడీపీ గూండాలు దాడి చేయడం అత్యంత హేయం. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఓ ఎంపీకే రక్షణ కల్పించలేని ఈ ప్రభుత్వం సామాన్యులను ఎలా కాపాడుతుంది? ఎంపీపై రాళ్ల దాడి జరుగుతున్నా పోలీసులు చోద్యం చూశారంటే రాష్ట్రంలో ఎలాంటి ఆటవిక పాలన కొనసాగుతుందో తెలుస్తోంది. గతంలో ఎన్నడూ లేని దాడుల సంస్కృతిని టీడీపీ పాలనలో చూస్తున్నాం. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలి. దాడులకు తగిన మూల్యం చెల్లించుకునే రోజు కచ్చితంగా వస్తుంది.

– మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ


గురువారం గన్నవరం విమానాశ్రయం వద్ద స్వాగతం పలకడానికి భారీగా తరలివచ్చిన కార్యకర్తలకు, పార్టీ నేతలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాక్షస పాలనపై ప్రజా పోరాటం చేద్దాం

- రషీద్ కుటుంబానికి అండగా నిలవాలి
- మాజీ ఎమ్మెల్యే బొల్లాకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశం
- తాడేపల్లిలో పార్టీ నేతలతో సమావేశం

సాక్షి, అమరావతి: ఏపీలో సాగుతోన్న రాక్షస పాలనపై ప్రజాపోరాటం చేద్దామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా వినుకొండలో బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీ కార్యకర్త జిలానీ నడిరోడ్డుపై పాశవికంగా హత్య చేసిన విషయం విదితమే. ఈ ఘటన గురించి తెలియగానే బెంగళూరులో ఉన్న వైఎస్ జగన్ వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. రషీద్ కుటుంబానికి అండగా నిలవాలని ఆదేశించారు. గురువారం బెంగళూరు నుంచి తాడేపల్లిలోని నివాసానికి చేరుకున్న వైఎస్ జగన్.. అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పుడు గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో హత్యలు, అత్యాచారాలు, విధ్వంసాలు జరిగిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై అధికారంలోకి వచ్చిన పార్టీ దృష్టి పెట్టాలిగానీ.. వైఎస్సార్‌సీపీని అణగదొక్కాలనే కోణంలో దారుణాలకు పాల్పడటం హేయమన్నారు. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామని అనుకున్నామని.. కానీ అధికారంలోకి వచ్చిన నెలన్నరలోనే హత్యలు, అత్యాచారాలు, విధ్వంసాలకు రాష్ట్రాన్ని చిరునామాగా మార్చేశారని తెలిపారు. వినుకొండలో రషీద్‌ను పాశవికంగా హత్య చేయడం అందుకు పరాకాష్ట అన్నారు. ఈ ఘటన జరిగి 24 గంటలు గడవక ముందే పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పపై టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డాయని మండిపడ్డారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందనడానికి నెలన్నర రోజులుగా సాగుతున్న అరాచకాలే తార్కాణమన్నారు. ప్రజలందరికీ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. కానీ సీఎం సహా బాధ్యతగా వ్యవహరించాల్సిన వ్యక్తులే రాజకీయ దురుద్దేశాలతో వెనకుండి ప్రోత్సహిస్తుండటం వల్లే ఇలాంటి దారుణాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కార్యకర్తలెవరూ అధైర్యపడవద్దని.. అందరికీ అండగా నిలుస్తామని జగన్ భరోసా ఇచ్చారు.

నేడు వినుకొండకు జగన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ శుక్రవారం పల్నాడు జిల్లా వినుకొండ రానున్నారు. టీడీపీ గూండాల చేతిలో బుధవారం రాత్రి వినుకొండలో నడిరోడ్డుపై దారుణంగా హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని వైఎస్ జగన్ పరామర్శిస్తారు. తాడేపల్లిలోని తన నివాసం నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి గుంటూరు, చిలకలూరిపేట, నరసరావుపేట బైపాస్ మీదుగా వైఎస్ జగన్ వినుకొండ చేరుకుంటారు. టీడీపీ మూకల నరమేధం ఘటన గురించి తెలిసిన వెంటనే బెంగళూరులో ఉన్న వైఎస్ జగన్ వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. హత్య ఘటన, వినుకొండలో పరిస్థితిని ఆరా తీశారు. స్థానిక పార్టీ నాయకులంతా వెంటనే రషీద్ కుటుంబ సభ్యులను కలిసి తోడుగా నిలవాలని ఆదేశించారు.

ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేదు..

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో కూటమి సర్కారు ఘోర వైఫల్యం, టీడీపీ నేతల అరాచక పర్వంపై వైఎస్ జగన్ గురువారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, లా అండ్ ఆర్డర్ ఎక్కడా కనిపించడం లేదని, ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. 'వైఎస్సార్ సీపీని అణగదొక్కాలన్న కోణంలో ఈ దారుణాలకు పాల్పడుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన నెలన్నర రోజుల్లోనే ఏపీ అంటే హత్యలు, అత్యాచారాలు, రాజకీయ కక్షపూరిత దాడులు, విధ్వంసాలకు చిరునామాగా మారిపోయింది. నిన్న వినుకొండలో నరమేధం ఘటన దీనికి పరాకాష్ట. నడిరోడ్డుపై జరిగిన ఈ దారుణం ప్రభుత్వానికి సిగ్గుచేటు' అని పేర్కొ న్నారు. సీఎం సహా బాధ్యతతో వ్యవహరించాల్సిన వ్యక్తులు రాజకీయ దురుద్దేశాలతో ఇలాంటి దారుణాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. 'ఎవరి స్థాయిలో వారు రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ పోలీస్ సహా యంత్రాంగాలన్నింటినీ నిర్వీర్యం చేశారు. దీంతో నేరగాళ్లు, హంతకులు చెలరేగి పోతున్నారు' అని పేర్కొన్నారు. అధికారం శాశ్వతం కాదని, హింసాత్మక విధా నాలు వీడాలని సీఎం చంద్రబాబును గట్టిగా హెచ్చరిస్తున్నట్లు చెప్పా రు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై న తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై కేంద్రప్రభుత్వ ఏజెన్సీలతో ప్రత్యేక విచారణ నిర్వహించాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రంలో దిగజారిన శాంతి భద్రతల పరిస్థితులపై దృష్టిపెట్టాలని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాకు విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని, అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. టీడీపీ మూక చేతిలో హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ఈ అరాచకాలకు చంద్రబాబుదే బాధ్యత

పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పలపై టీడీపీ శ్రేణులు దాడి చేయడాన్ని వైఎస్ జగన్ తీవ్రంగా ఖండించారు. వినుకొండలో నరమేధానికి తెగబడి 24 గంటలు గడవక ముందే పుంగనూరులో మిథున్‌రెడ్డి, రెడ్డెప్పపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శాంతి భద్రతల పరిరక్షణలో ఘోరంగా విఫలమైందని చెప్పేందుకు ఈ అరాచకాలే నిదర్శనమని, వీటికి సీఎం చంద్రబాబు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

ఏపీలో ఆటవిక పాలన

ప్రధాని మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ లేఖ

సాక్షి, అమరావతి: వివక్ష లేకుండా ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం వినియోగించాల్సిన అధికార యంత్రాంగాన్ని టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాజకీయమయం చేసిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి నివేదించారు. హత్యలు, దాడులు, అకృత్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో రాజకీయమయం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా దాదాపు 27 మంది ఐఏఎస్‌లు, 24 మంది ఐపీఎస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా చేశారంటే సీఎం చంద్రబాబు లక్ష్యాలు, ఉద్దేశాలు కళ్ల ముందే కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి ప్రధాని మోదీకి వైఎస్ జగన్ లేఖ రాశారు. ''కొత్త ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఏపీలో 31 మంది హత్యకు గురయ్యారు. 300 మందిపై హత్యాయత్నాలు జరిగాయి. టీడీపీ నేతల వేధింపులు భరించలేక 35 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 560 చోట్ల ప్రైవేట్ ఆస్తులు, 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. టీడీపీ నేతల అరాచకాలను భరించలేక దాదాపు 2,700 కుటుంబాలు గ్రామాలను విడిచి వెళ్లిపోయాయి. ఇవికాకుండా 1,050కి పైగా దౌర్జన్యాలు, దాడుల ఘటనలు జరిగాయి'' అని పేర్కొన్నారు. ఇవన్నీ యాధృచ్ఛికంగా జరిగినవి కాదని, వైఎస్సార్ సీపీని అణగదొక్కడమే లక్ష్యంగా ఒక పథకం ప్రకారం దుర్మార్గాలని స్పష్టం చేశారు. రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎవరూ ఉండకూడదన్న ఏకైక లక్ష్యంతో ఇవన్నీ చేస్తున్నారని.. ఆమేరకు ప్రభుత్వంలో ఉన్నవారు కింది స్థాయివరకూ అధికారులకు సంకేతాలు పంపారని తెలిపారు. ఒక మంత్రి రెడ్‌బుక్ పేరిట ఏకంగా హోర్డింగులు పెట్టి నేరుగా దాడులు చేయాలని శ్రేణులకు చెప్పకనే చెప్పారన్నారు. వాటిని అడ్డుకోవద్దని అధికారులకు సంకేతాలు ఇవ్వడంతో టీడీపీ గూండాలు ఎక్కడికక్కడ రెచ్చిపోయి దారుణాలకు పాల్పడుతున్నారని వివరించారు. మొత్తంగా చూస్తే రాష్ట్రంలో శాంతి భద్రతలు కుప్పకూలిపోయాయని, తక్షణం శాంతిస్థాపన జరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత జరిగిన ఘటనలపై కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలతో విచారణ జరపాలని విన్నవించారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సాగించిన దురాగతాలను నివేదించేందుకు వీలైన రోజు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. లేఖలో ప్రధానాంశాలు ఇవీ..

శాంతి భద్రతలు క్షీణించాయి..
వ్యవస్థలు కుప్పకూలాయి..

- ఏపీలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలిపోయాయి. యంత్రాంగం నిస్తేజంగా మారిపోయింది. ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు స్వైరవిహారం చేస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత భయానక వాతావరణం నెలకొంది. అత్యంత అనాగరిక ఘటనలు జరుగుతున్నాయి. అమానవీయ, అమానుషంగా ఘటనలు జరుగుతున్నాయి.
- ఎన్నికల ఫలితాలు వెలువడింది మొదలు తమకు ఓటు వేయని వారిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేయడమే కాకుండా వారి ఆస్తులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారు. అధికారాన్ని అండగా పెట్టుకుని యథేచ్ఛగా చెలరేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఇళ్లపై, నాయకుల ఇళ్లపై, వారి వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. కొన్ని చోట్ల ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లను కూల్చివేశారు. రోడ్డుపక్కనే చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని పొట్ట పోసుకుంటున్న వారిపై ఉపాధిని దెబ్బకొట్టారు. రాజకీయ కారణాలతో వారి దుకాణాలను జేసీబీలతో కూల్చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు కోకొల్లలు.
- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ఆస్తులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటమే కాకుండా ప్రభుత్వ ఆస్తులకు తీవ్ర నష్టం చేకూర్చారు. అధికార వికేంద్రీకరణలో భాగంగా గ్రామస్థాయిలోనే ప్రజలకు అత్యంత చేరువగా సేవలందిస్తున్న గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్‌నూ విడిచిపెట్టలేదు. కేవలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థలను తెచ్చిందనే ఏకైక కారణంతో వాటిని ధ్వంసం చేశారు.
- అన్నిటినీ మించి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది.

గత బుధవారం రోజు పల్నాడు జిల్లా వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను నడిరోడ్డుపై దారుణంగా హత్య చేశారు. అందరూ చూస్తుండగానే ఈ ఘటన జరిగింది. ఈ దారుణ హత్య రాష్ట్ర ప్రజానీకాన్ని తీవ్ర కలవరపాటుకు గురి చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఇలాంటివి పలు ఘటనలు జరిగాయి. అల్లరిమూకలు పట్టపగలే నడిరోడ్డుమీద కత్తులతో స్వైరవిహారం చేస్తూ మనుషుల ప్రాణాలు తీస్తున్న ఘటనలు సర్వ సాధారణం అయిపోయాయి.

ఎంపీకే రక్షణ లేని పరిస్థితి..

వైఎస్సార్‌సీపీ తరఫున పార్లమెంట్‌కు, శాసనసభకు ఎన్నికైన వారు, ఆయా స్థానాల్లో పోటీచేసిన అభ్యర్థులకు రక్షణ లేకుండా పోయింది. తాజాగా గురువారం చిత్తూరు జిల్లా పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డప్ప నివాసానికి వెళ్లిన మా పార్టీ లోక్‌సభపక్ష నాయకుడు, ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకలు హత్యాయత్నానికి పాల్పడ్డాయి. పోలీసుల సమక్షంలోనే ఈ దాడి జరిగింది. ఒక ఎంపీకి కూడా రక్షణ కల్పించలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది.

రెడ్‌బుక్ రాజ్యాంగానికి వదిలేశారు..

- రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వ ఆనవాళ్లు కనిపించడంలేదు. రాజ్యాంగం, చట్టం లేదు. పోలీసు వ్యవస్థ పని చేయడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి రాష్ట్రాన్ని రెడ్‌బుక్ రాజ్యాంగానికి వదిలేశారు. గూండాలకు, ఉన్మాదులకు, మహిళలపై అఘాయిత్యాలు చేసేవారికి, చిన్నారులపై దారుణాలకు ఒడిగట్టేవారికి రాష్ట్రాన్ని అప్పగించేశారు.
- గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ అంటే ఉత్తమ విద్య, నాణ్యమైన వైద్యం, రైతుకు భరోసా, అక్కచెల్లెమ్మలకు సాధికారిత, పటిష్ట లా అండ్ ఆర్డర్, సుస్థిర, సమగ్ర అభివృద్ధికి నిలయమని పేరు పొందితే ఇవాళ ఏపీ అంటే హత్యలు, అత్యాచారాలు, రాజకీయ కక్షపూరిత దాడులు, విధ్వంసాలకు చిరునామాగా మారిపోయింది. రాష్ట్రంలో అరాచకాలు మినహా పరిపాలన కనిపించడం లేదు.

స్కానింగ్‌కు వచ్చిన మహిళపై లైంగిక దాడికి యత్నం


నిందితుడు రాంబాబు

విజయనగరం ఫోర్ట్: ఎంఆర్ఐ స్కాన్ కోసం వెళ్లిన వివాహితపై ఓ యువకుడు లైంగికదాడికి యత్నించాడు. శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరానికి చెందిన ఓ మహిళ కాలునొప్పితో విజయనగరంలోని ఓ ఆస్పత్రికి వెళ్లింది. ఎంఆర్ఐ స్కాన్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో గుమ్చి వద్ద ఉన్న ఓ ప్రైవేటు మెడికల్ ల్యాబ్‌కు వెళ్లగా.. అక్కడ బోయ్‌గా పనిచేస్తున్న పతివాడ రాంబాబు మహిళపై లైంగికి దాడికి యత్నించాడు. దీంతో ఆమె అతని నుంచి తప్పించుకుంది. రాంబాబుపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు మెడికల్ సెంటర్ ఇన్‌చార్జి వై.చక్రధర్ చెప్పారు.

ఇంటర్ విద్యార్థినిపై రౌడీ షీటర్ లైంగిక దాడి

గూడూరు రూరల్ (తిరుపతి జిల్లా): ఇంటర్ విద్యార్థిపై రౌడీషీటర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి గురువారం వెల్లడించిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన రౌడీషీటర్ వినయ్.. ఓ ఇంటర్ విద్యార్థినిపై కన్నేసి రెండు రోజుల కిందట ఆమె చదువుకునే కళాశాల వద్దకు ఆటో వేసుకుని వెళ్లాడు. కళాశాల వదిలాక బయటకు వచ్చిన ఆమెను బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని గూడూరు శివారు ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఆమె ఇంటి వద్ద ఎవరికీ చెప్పుకోలేక విచారంగా ఉండగా.. కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. ఆమె ఏమీ చెప్పకుండా బుధవారం రాత్రి ఇంట్లో ఫ్లోర్ క్లీనర్ తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు ఆత్మహత్య


వెంకటస్వామి (ఫైల్)

దుత్తలూరు: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు జిల్లాలో జరిగింది. దుత్తలూరు మండలం బ్రహ్మేశ్వరం గ్రామానికి చెందిన వెంకటస్వామి (50) తన, కౌలుకు తీసుకున్న పొలంలో మిర్చి, మినుము పంటలు వేశాడు. దిగుబడి సరిగా లేకపోవడంతో అప్పులు పెరిగి ఈ నెల 5న విషపు గుళికలు తిన్నాడు. ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

ముగ్గురు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం

కురబలకోట/మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా ముదివేడు కేజీబీవీ విద్యార్థినులు ముగ్గురు కలకలం రేకెత్తించారు. తొమ్మిదో తరగతి చదువుతున్న హర్షిత, సంజన, రెడ్డి జాహ్నవిలు పారాసిటమాల్ మాత్రలు వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వీరు గురువారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరడంతో ఈ విషయం బయటపడింది. వీరికి తొలినుంచీ స్కూల్ వాతావరణం నచ్చలేదు. ఇటీవల హర్షిత ఇంటికి వచ్చినప్పుడు పారాసిటమాల్ మాత్రలను వెంట తెచ్చుకుంది. వాటిలో పది మాత్రలను హర్షిత, మిగిలిన ఇద్దరు విద్యార్థులు చెరో సగం బుధవారం మింగారు. కాగా, డీవైఈవో శ్రీరాంపురుషోత్తం విద్యార్థినులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

కృష్ణాలో నిలకడగా..

ఆల్మట్టిలోకి 72,286, నారాయణపూర్‌లోకి 68,797 క్యూసెక్కులు

ఖాళీ ప్రదేశాన్ని భర్తీ చేసుకుంటూ వరద దిగువకు విడుదల


ఆల్మట్టి నుంచి విడుదల అవుతున్న నీరు

సాక్షి, అమరావతి/రాయచూరు రూరల్: పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా ప్రధాన పాయలో వరద నిలకడగా కొనసాగుతోంది. గురువారం కర్ణాటకలోని ఆల్మట్టి డ్యామ్‌లోకి 72,286 క్యూసెక్కులు చేరుతోంది. దీంతో 14 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 65,580 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 68,797 క్యూసెక్కులు చేరుతుండగా.. దిగువకు 46,329 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ నుంచి వరద ప్రవాహం వస్తుండటంతో జూరాల ప్రాజెక్టులో తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తూ 25,174 క్యూసెక్కులు దిగువకు వదులుతోంది. ఈ జలాలు శుక్రవారానికి శ్రీశైలానికి చేరుకోనున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ కేంద్రంలో తెలంగాణ సర్కారు విద్యుదుత్పత్తి కొనసాగిస్తోంది. ఇందుకోసం 7,064 క్యూసెక్కులను దిగువకు తరలిస్తుండటంతో శ్రీశైలంలో నీటి నిల్వ 32.37 టీఎంసీలకు తగ్గిపోయింది. శ్రీశైలం నుంచి తరలిస్తున్న జలాలతో నాగార్జున సాగర్‌లోకి 23,851 క్యూసెక్కులు వస్తున్నాయి. దీంతో సాగర్‌లో నీటి నిల్వ 123.34 టీఎంసీలకు చేరుకుంది. ఇక కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్ర బేసిన్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద ఉద్ధృతి పెరిగి తుంగభద్ర డ్యామ్‌లోకి 82,491 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఇక్కడ నీటి నిల్వ 46.80 టీఎంసీలకు చేరుకుంది. శుక్రవారం తుంగభద్ర డ్యామ్‌లోకి లక్ష క్యూసెక్కులకు పైగా ప్రవాహం వస్తుందని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అంచనా వేసింది.

గోదావరిలో పెరుగుతూ..

పోలవరం వద్దకు 2.30 లక్షల క్యూసెక్కుల వరద


వరద తాకిడితో నిలిచిపోయిన బోట్లు

సాక్షి, అమరావతి/ధవళేశ్వరం: పరీవాహక ప్రాంతం (బేసిన్)లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరిలో వరద ప్రవాహం పెరుగుతోంది. గురువారం పోలవరం ప్రాజెక్టులోకి 2.30 లక్షల క్యూసెక్కులు చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 48 గేట్ల ద్వారా వచ్చిన జలాలను వచ్చినట్లు దిగువకు వదిలేస్తున్నారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 2,31,161 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి మట్టం 8.3 అడుగులకు చేరుకుంది. గోదావరి డెల్టా కాలువలకు 7,200 క్యూసెక్కులు వదులుతూ మిగతా 2,23,961 క్యూసెక్కులను బ్యారేజ్ 175 గేట్ల ద్వారా సముద్రంలోకి వదిలేస్తున్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం శుక్రవారం మరింత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన భద్రాచలంలో నీటిమట్టం గురువారం సాయంత్రం 18.20 అడుగులకు చేరింది.

పాపికొండల విహార యాత్రకు బ్రేక్

బుట్టాయగూడెం: పాపికొండల విహార యాత్ర తాత్కాలికంగా నిలిచిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండటం, తుఫాన్ హెచ్చరికలు, గోదావరి నదికి వరద తాకిడి పెరగడం వల్ల యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని విహార యాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్టు పర్యాటక శాఖ అధికారులు ప్రకటించారు. భారీ వర్షాల కారణంగా పోలవరం ప్రాజెక్టు ఎగువన గోదావరి ప్రవాహం భారీగా పెరుగుతోంది. భద్రాచలం వద్ద గురువారం సాయంత్రానికి 22 అడుగుల వరకు పెరిగినట్టు అధికారులు ప్రకటించారు.

సీహెచ్‌వోల విధులకు ఆటంకం కలిగించొద్దు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌వో) విధులకు ఆటంకం కలిగించొద్దని, వారికి పీహెచ్‌సీల విధులను అప్పగించొద్దంటూ అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

పర్యావరణ అనుమతుల్లో జాప్యం చేయొద్దు

కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌కు ఏపీ మంత్రి సత్యకుమార్ వినతి



సాక్షి, న్యూఢిల్లీ: అమరాతితో సహా రాష్ట్రంలో కీలకమైన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతుల్లో జాప్యం లేకుండా చూడాలని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌కు ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ విజ్ఞప్తి చేశారు. విశాఖలోని రుషికొండపై పర్యావరణ ఉల్లంఘన చేశారనీ, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు భూపేంద్ర యాదవ్‌తో పాటు నితిన్ గడ్కరీ, గిరిరాజ్‌సింగ్‌లతో సత్యకుమార్ భేటీ అయ్యారు.

విచారణ జరిపిస్తాం: మంత్రి ఆనం



నెల్లూరు(దర్గామిట్ట): దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతకుమారిపై వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయిలో నివేదికలు తెప్పించుకుని తదుపరి చర్యల కోసం సీఎం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. దేవదాయశాఖ భూములను ఇష్టానుసారంగా కొంతమందికి 33, 66, 99 ఏళ్లకు లీజుకు ఇచ్చారని, వీటన్నింటిపై విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

అసాంఘిక శక్తులను ఉపేక్షించం: హోం మంత్రి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నించే అరాచక శక్తులను ఉపేక్షించేది లేదని హోం మంత్రి వంగలపూడి అనిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాలికలపై అత్యాచార ఘటనలను అధ్యయనం చేస్తున్నామన్నారు. పోలీసు, విద్య, మహిళా–శిశు సంక్షేమ శాఖల అధికారుల సమన్వయం కోసం ఓ కమిటీని నియమిస్తామని మంత్రి తెలిపారు.

చంద్రన్నకు చిడతలు కొట్టే దుస్థితి..

నగరి టీడీపీ సీనియర్ నేత చలపతి

చిత్తూరు రూరల్: టీడీపీ కోసం శ్రమిస్తే.. చివరకు చంద్రబాబుకు చిడతలు(తాళాలు)కొట్టే పరిస్థితి వచ్చిందని నగరి నియోజకవర్గ నేత రామానుజం చలపతి, మాజీ కౌన్సిలర్ లత విమర్శించారు. చిత్తూరులో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. ఎర్రచందనం, గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారినే దొరల్లా చూస్తున్నారని మండిపడ్డారు. దీనిపై గొంతు విప్పినందుకు పార్టీ నుంచి పక్కనపెట్టారని.. ఇలాగైతే చిడతలు కొట్టుకుంటూ.. చంద్రబాబు, లోకేశ్‌కు భజన చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

వ్యాధుల నివారణకు చర్యలు

సాక్షి, అమరావతి: మున్సిపాలిటీల్లోని డ్రైన్లలో పూడికతీత పనులకు ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసినట్టు మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. 10 రోజుల్లో అన్ని డ్రైన్లలో నూరు శాతం పూడికతీత పనులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించామన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు.

తెగిపోయిన పెదవాగు ప్రాజెక్టు ఆనకట్ట

- ఒక్కసారిగా నీట మునిగిన గ్రామాలు
- పరుగులు తీసిన గ్రామాల ప్రజలు
- పొంగిపొర్లుతున్న వేళ్లవాగు, ఎద్దెల వాగు
- కొట్టుకుపోయిన ఎద్దెల వాగు వంతెన అప్రోచ్
- బాహ్య ప్రపంచంతో తెగిపోయిన సంబంధాలు


కొయిదా వెళ్లే రహదారిలో ఎద్దుల వాగు వద్ద కొట్టుకుపోయిన అప్రోచ్

వేలేరుపాడు: కుండపోత వర్షాలు ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలాన్ని ముంచెత్తాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. నీటి ప్రవాహం ఉధృతం కావడంతో పెద వాగు ప్రాజెక్టు గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో తెగిపోయింది. దీంతో మండలంలోని మేడేపల్లి, కమ్మరగూడెం, అల్లూరి నగర్, ఒంటిబండ, రామవరం ఊటగుంపు, ఉదయ్‌నగర్, సొంబే గొల్లగూడెం, గుల్లవాయి, పాత పూచిరాల గ్రామాల్లో ఇళ్లు నీట మునిగాయి. అకస్మాత్తుగా ప్రాజెక్టు నీరు రావడంతో ఆయా గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగు తీశారు. పెదవాగు ప్రాజెక్టుకు చేరువలో ఉన్న మేడేపల్లి, అల్లూరి నగర్, ఒంటి బండ, కమ్మరగూడెం గ్రామాల ప్రజలు ఒక్కసారిగా నీరు రావడంతో సమీపంలోని గుట్టల పైకి, భవనాల పైకి ఎక్కారు. వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. సహాయక చర్యలు అందించేందుకు ఆయా గ్రామాలకు అధికారులు వెళ్లాలన్నా రహదారి సౌకర్యం లేదు. ఆయా గ్రామాల ప్రజలే సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. వేలేరుపాడు మండలం మేడేపల్లి మొదలుకొని అల్లూరి నగర్, కోయ మాధవరం, గుల్లవాయి తదితర ప్రాంతాల్లో రహదారులన్నీ నీట మునిగాయి. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారిలో వేళ్లవాగు, ఎద్దెల వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎద్దెల వాగు వద్ద వంతెన అప్రోచ్ కొట్టుకుపోయింది. వేలేరుపాడు నుంచి రుద్రమ్మకోటకు వెళ్లే రహదారిలో పెదవాగు వంతెన వద్ద రహదారి అంతా నీట మునిగింది.

నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడిందని విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ గురువారం తెలిపారు. ఇది రానున్న రెండుమూడు రోజుల్లో మరింత బలపడి వాయవ్య దిశగా ఒడిశా తీరం వైపు కదిలే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో శుక్రవారం ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అనంతపురం, కర్నూలు, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడొచ్చని తెలిపారు. మధ్య బంగాళాఖాతం, వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది రాబోయే రెండు రోజుల్లో మరింత బలపడి మరో అల్పపీడనంగా ఏర్పడే అవకాశాలున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

'సాక్షి' చొరవ.. 31 మంది సురక్షితం

- పెద్దవాగు బ్రిడ్జిపై వరదలో చిక్కుకున్న ఏపీ, తెలంగాణవాసులు
- కలెక్టర్‌కు సమాచారం ఇచ్చిన సాక్షి సిబ్బంది
- నేవీ హెలికాప్టర్ సాయంతో సురక్షిత ప్రాంతానికి బాధితులు


వరదలో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న నేవీ హెలికాప్టర్

ఏలూరు (మెట్రో): 'సాక్షి' చొరవతో వరద నీటిలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన 31 మంది సురక్షితంగా బయటపడ్డారు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కొయిదా ఏపీ, తెలంగాణ సరిహద్దుల్లో ఉంది. నారాయణపురం, బచ్చువారిగూడెం మధ్య కట్టమైసమ్మ గుడి వద్ద ఉన్న పెద్ద వాగు బ్రిడ్జి మీదుగా కొయిదా ఆసుపత్రికి పలువురు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గురువారమూ పలువురు వైద్య సిబ్బంది, ప్రజలు కొయిదా బయల్దేరారు. వారు పెద్ద వాగు బ్రిడ్జి పైకి చేరుకున్న సమయంలోనే వాగులోకి ఒక్కసారిగా వరద రావడంతో గేట్లు ఎత్తేశారు. దీంతో భారీగా వరద నీరు బ్రిడ్జిమీదుగా ప్రవహించింది. మరోపక్క గోదావరి వరద కూడా పెరగడంతో నది బ్యాక్ వాటర్ కూడా మరోపక్క నుంచి బ్రిడ్జిని చుట్టుముట్టింది. దీంతో కొయిదా ఆస్పత్రి సిబ్బంది సహా 31 మంది బ్రిడ్జిపైన వరద నీటి మధ్యలో చిక్కుకుపోయారు. వారు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. స్థానికులు ఈ విషయాన్ని 'సాక్షి' మీడియాకు తెలిపారు. తక్షణమే స్పందించిన 'సాక్షి' సిబ్బంది జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణికి సమాచారం అందించారు. కలెక్టర్ వెంటనే స్థానిక ఏపీ, తెలంగాణ అధికారులను అప్రమత్తం చేశారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్, పాల్వంచ ఆర్డీవో, అశ్వారావుపేట తహసీల్దార్‌తోనూ మాట్లాడి సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక దళం, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దింపారు. బోట్ల ద్వారా వరద నీటిలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వెంటనే ఎన్డీఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడి, నౌకాదళం హెలికాప్టర్‌ను రప్పించారు. నౌకాదళం సిబ్బంది సాయంత్రం నుంచి రాత్రి 9.30 గంటల వరకు శ్రమించి అందరినీ సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చారు.


సురక్షిత ప్రాంతానికి చేరుకున్న వైద్య సిబ్బంది

> తల్లితండ్రులు, సమీప బంధువులు వదలివెళ్లిన ఆస్తిలో పురుషులకు భాగం ఉంది. అలాగే తల్లితండ్రులు, సమీప బంధువులు వదలివెళ్లిన ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం ఉంది. ఆ ఆస్తి తక్కువైనాసరే, ఎక్కువైనాసరే (అందులో) వాటా మాత్రం నిర్ధారితమై ఉంది.
>
> – ఇస్లాం ధర్మం

ఫోకస్

సాక్షి

శుక్రవారం, 19 జూలై 2024

సొంతగూటి సమస్యలు!

సాగినంత కాలం మనంతటి వాళ్ళు మరొకరు లేరనుకోవడం సహజమే. సాగనప్పుడు కూడా సమైక్యంగా నిలిచి, సవాళ్ళను ఎదుర్కొన్నప్పుడే సత్తా తెలుస్తుంది. రాజకీయంగా, చట్టసభల్లో సంఖ్యాపరంగా కీలకమైన ఉత్తరప్రదేశ్ (యూపీ)లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కొన్నేళ్ళుగా తిరుగు లేకుండా సాగింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగిలేవరకు అత్యంత పటిష్ఠంగా కనిపించిన ఆ పార్టీ రాష్ట్రశాఖలో ఒక్కసారిగా ఇప్పుడు లుకలుకలు బయటకొస్తున్నాయి. ఎదురు లేని నేతగా గుర్తింపు తెచ్చుకున్న యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాటలకు మొదటిసారిగా సొంత పార్టీలోనే అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నాయి. స్వయానా ఉపముఖ్యమంత్రే గొంతు పెంచడం, మంగళవారం ఢిల్లీ వెళ్ళి తమ పార్టీ జాతీయ అధ్యక్షుడితో సమావేశం కావడం, పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కూడా దేశ రాజధానికి చేరి పార్టీ అధ్యక్షుడితో – ప్రధానితో విడివిడిగా భేటీ అవడం... ఈ పరిణామాలన్నీ పార్టీలో అంతా సవ్యంగా లేదని తేటతెల్లం చేస్తున్నాయి. యూపీలో 10 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు త్వరలో రానున్న వేళ పార్టీలో అందరినీ మళ్ళీ ఒక్క తాటి మీదకు తీసుకురావడం ఇప్పుడు అధిష్ఠానానికి తలనొప్పిగా తయారైంది.

లక్నోలో పార్టీ రాష్ట్రశాఖ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆదివారం మాట్లాడుతూ... ఓట్ల బదలీ, మితిమీరిన ఆత్మవిశ్వాసం వల్ల ఎన్నికల్లో యూపీలో బీజేపీ విజయావకాశాలు దెబ్బతిన్నాయని యోగి వ్యాఖ్యానించారు. దాంతో ఇప్పుడీ తేనెతుట్టె కదిలింది. తర్వాత డిప్యూటీ సీఎం కేశవ్‌ప్రసాద్ మౌర్య ప్రసంగిస్తూ, 'ప్రభుత్వం కన్నా పార్టీ పెద్దది. పార్టీ కన్నా ఎవరూ పెద్ద కాదు' అనేశారు. కర్రు కాల్చి వాత పెట్టిన ఈ మాటలతో రచ్చ రాజుకుంది. ఒకప్పుడు మోదీకి శిష్యవారసుడిగా పేరుబడ్డ యోగికి ఇలాంటి పరిస్థితి ఎదురవడం చిత్రమే. అయితే, అది స్వయంకృతమే. ఇటీవలి ఎన్నికల్లో కమలనాథులకు లోక్‌సభలో కావాల్సిన మెజారిటీ రాకపోవడానికి ప్రధాన కారణం – యూపీ నిరాశపరచడమే అన్నది బహిరంగ రహస్యం. 2019లో రాష్ట్రంలోని 80 సీట్లకు గాను 62 గెల్చుకున్న ఆ పార్టీ ఈసారి 33కే పరిమితమైంది. ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ – కాంగ్రెస్ కూటమి 43 గెలిచి దూసుకొచ్చింది. చివరకు రామమందిరం నిర్మించామంటూ ఊరూవాడా గొప్పలు చెప్పుకున్నా, అయోధ్య నెలకొన్న ఫైజాబాద్‌లోనూ బీజేపీ ఓడిపోయింది. మోదీ సైతం వారణాసిలో గతంలో 4.79 లక్షల ఓట్ల మెజారిటీతో నెగ్గితే, ఈసారి 1.52 లక్షల ఓట్ల తేడాతోనే బయటపడ్డారు. ఇవన్నీ యోగి ప్రతిష్ఠను దెబ్బతీసినవే. ఇప్పటి దాకా సాగిన ఆయన ఒంటెద్దుపోకడను ఇరుకునపెట్టినవే.

చివరకు మిత్రపక్షాల గొంతులు సైతం పైకి లేస్తున్నాయి. 'బుల్‌డోజర్లు ప్రయోగిస్తే ఓట్లిలా వస్తాయి? ఉద్యోగ నియామకాల్లో ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీల పట్ల దుర్విచక్షణ చూపడం పెద్ద తప్పు! అసలు మొన్న లోక్‌సభ ఎన్నికల్లో మాకు బీజేపీ నుంచి సహకారం లభించనే లేదు' – ఇలా యూపీలో మిత్రపక్ష నేతలే యోగి సర్కార్‌ను తప్పు పడుతుండడం గమనార్హం. మొత్తం మీద సొంత గూటిలో సమస్యలు పెరుగుతున్నాయనేది వాస్తవం. రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా చేయి దాటక ముందే బీజేపీ కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకొని, కీలక నిర్ణయం తీసుకోవాలంటూ సాక్షాత్తూ ఆ పార్టీ ఎమ్మెల్యేలే బాహాటంగా అంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పదవి నుంచి యోగిని పక్కకు తప్పించవచ్చనే చర్చ సైతం రాజకీయ వర్గాల్లో మొదలైంది. దేశంలోనే అత్యంత పాపులర్ సీఎంగా నిన్న మొన్నటి సర్వేల్లోనూ ఉన్న మనిషిని పక్కనపెట్టడం పార్టీకి అంత తేలిక కాదు. ఏమంత తెలివైన పనీ కాదు. కాకపోతే, ఇది కచ్చితంగా బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం. కీలక మంత్రులతో సహా అంతా గత హయాంకు కొనసాగింపు కేంద్ర సర్కారనే భావన కల్పిస్తున్న ఆ పార్టీ... ఎన్నికల్లో ఎదురుదెబ్బకు కారణాలు లోతుగా అధ్యయనం చేసుకోకపోతే చిక్కే!

పెన్షన్ అంశం, పార్టీ కార్యకర్తల్లో పెరిగిన అసంతృప్తి, గత ఆరేళ్ళలో పదే పదే పేపర్ లీకులు, ప్రభుత్వోద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్ ఉద్యోగాల భర్తీ, అగ్నివీర్ల అంశం, రాజ్‌పుత్‌ల ఆగ్రహం, రాజ్యాంగాన్ని మార్చేస్తామన్న పార్టీ నేతల ప్రకటనలు – ఇలా అనేకం యూపీలో ఎదురుగాలి వీచేలా చేశాయని పార్టీ అంతర్గత నివేదిక. మరోపక్క కరడుగట్టిన బీజేపీ భక్త ఓటరు గణం చెక్కు చెదరకున్నా – దేశాభివృద్ధికి మోదీయే దిక్కని భావించినవారు, లబ్ధిదారులు, మోదీ ఆకర్షితుల్లో తరుగుదల కాషాయధ్వజుల జోరుకు పగ్గాలు వేసినట్టు స్వతంత్ర విశ్లేషకుల మాట. ఎవరి మాట ఏదైనా అంతా సవ్యంగా ఉంది, అసలేమీ జరగలేదన్నట్టుగా ఉష్ట్రపక్షిలా వ్యవహరిస్తే నష్టం బీజేపీకే! ఎన్నికల్లో తలబొప్పి కట్టిందని ముందు గుర్తించాలి. నిత్యం కార్యకర్తలతో చర్చిస్తూ, క్షేత్రస్థాయి స్పందన తీసుకుంటూ, నిరంతరం ఎన్నికల ధోరణిలోనే ఉంటుందని పేరున్న బీజేపీ మళ్ళీ మూలాల్లోకి వెళ్ళాలి. మోదీ నామమే తారకమంత్రమన్న మూర్ఖత్వం మాని, కళ్ళు తెరిచి ప్రజాక్షేత్రంలోని చేదు నిజాలను విశ్లేషించాలి. పార్టీలో పరస్పర నిందారోపణల్ని మించిన మార్గమేదో అన్వేషించాలి.

ముందు రోగం కనిపెడితేనే తర్వాత సరైన మందు కనిపెట్టగలరు. బీజేపీ అధిష్ఠానం తొందర పడాల్సింది అందుకే. ఇటీవల దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో 10 స్థానాల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమే గెలిచింది. అధికారపక్ష వ్యతిరేకత కనిపించడమే కాక, బీజేపీ ఓటు షేర్ తగ్గడం ఆ పార్టీకి ఖబడ్దార్ హెచ్చరికే. యూపీలో తాజా విజయాలతో సమాజ్‌వాదీ – కాంగ్రెస్ కూటమి సమధికోత్సాహంతో అడుగులు వేస్తోంది. ఇప్పుడు గనక బీజేపీ దిద్దుబాటు చర్యలతో, సొంత ఇంటిని చక్కబెట్టుకోకుంటే, ప్రతిపక్షం కీలకమైన యూపీలో మరింత విస్తరిస్తుంది. అప్పుడిక కమలనాథులు ఏం చేసినా చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.త్రయోదశి సా.6.01 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** మూల రా.2.31 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.10.16 నుండి 11.54 వరకు, తదుపరి రా.12.53 నుండి 2.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.12 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.59, నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** రా.8.01 నుండి 9.36 వరకు.

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

గడ్డినే కాదు, జీవులనూ చంపుతుంది!

విశ్లేషణ

డా॥ దొంతి నరసింహా రెడ్డి

ఒక ఉత్పత్తి గురించి అనేక దేశాలు గోస పడుతున్నాయి. అయినా దాని మీద శాశ్వత నిషేధం విధించడం లేదు. కలుపు సంహారక సమ్మేళనం గ్లైఫోసేట్ (గడ్డి మందు) వల్ల పర్యావరణం మీద, వ్యవసాయ కార్మికుల మీద, గ్రామీణ ప్రజల ఆరోగ్యం మీద దుష్ప్రభావాలు పెరుగుతున్నాయి. నేరుగా క్యాన్సర్ కలుగజేసే దీన్ని ఆహార పంటల క్షేత్రాలలో వినియోగించడం చాలా ప్రమాదకరం. దీన్ని పిచికారీ చేసిన పంట వ్యర్థాలను తిని గొర్రెలు, మేకలు, ఇతర పశువులు కూడా చనిపోయాయి. అయినా దీన్ని వినియోగం ఆపడం, ఉత్పత్తిని నిలిపివేయడం, అడ్డుకోవడం సవాలుతో కూడుకున్నదని స్పష్టమవుతోంది. వివిధ దేశాల రాజకీయ సంకల్పం పెద్ద కంపెనీల గణనీయమైన లాబీయింగ్ శక్తి ముందు దిగదుడుపే అని అర్థమవుతోంది.

2015లో గ్లైఫోసేట్ నిషేధాన్ని ఆమోదించి, అమలుచేసిన మొట్టమొదటి దేశం శ్రీలంక. కానీ ఈ నిషేధాన్ని 2018లో పాక్షికంగా మార్చవలసి వచ్చింది. 2022లో పూర్తిగా ఉపసంహరించబడింది. 2014లో ఒక స్థానిక శాస్త్రవేత్త గ్లైఫోసేట్ వలన 'క్రానిక్ కిడ్నీ డిసీజ్ ఆఫ్ అన్నోన్ ఆరిజిన్' వస్తున్నదని పరిశోధించి చెప్పిన దరిమిలా శ్రీలంక నాయకత్వం దీని మీద దృష్టి పెట్టింది. 2015లో ఎన్నికైన మైత్రిపాల సిరిసేన ప్రభుత్వం ఈ నిషేధాన్ని ఆమోదించింది. ఈ నిషేధం అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో బౌద్ధ సన్యాసి రథనా థెరో మద్దతు కొరకు ఇచ్చిన వాగ్దానం. కానీ తర్వాత నిషేధంలో వెనక్కి తగ్గడం, తరువాత పూర్తిగా ఎత్తి వేయడం జరిగింది. ఈ లాబీయింగ్ వెనుక అమెరికా ప్రభుత్వం, బేయర్ కంపెనీ (అప్పట్లో మోన్‌శాంటో) ఉన్నదని అందరికీ తెలుసు.

డిసెంబర్ 2023లో, నెలల తరబడి తర్జనభర్జనల తర్వాత, ఐరోపా కూటమి దేశాలలో కొన్ని నిషేధించాలని కోరినా, దీని లైసెన్స్‌ను పునరుద్ధరించాలని యూరోపియన్ కమిషన్ నిర్ణయించింది. మరో పదేళ్లపాటు వినియోగాన్ని ఆమోదించింది. ఆస్ట్రియా, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, బెల్జియం, లక్సెంబర్గ్, జర్మనీ వంటి కొన్ని యూరప్ దేశాలు కొన్ని ప్రాంతాల్లో, ఇళ్లల్లో దీని వాడకంపై పాక్షిక నిషేధాలనో, పరిమితులనో విధిస్తున్నాయి.

గ్లైఫోసేట్ ఒక రసాయన ఉత్పత్తి. ఇదివరకు మోన్‌శాంటో, తరువాత దానిని కొన్న బేయర్ కంపెనీ అంతర్జాతీయ గుత్తాధిపత్య కంపెనీ. చాలా శక్తిమంతమైన ఐరోపా కూటమి కూడా ఈ కంపెనీ ఒత్తిడికి తలొగ్గి జీవరాశికి, మానవాళికి ప్రమాదకరంగా పరిణమించిన గ్లైఫో సేట్ వాడకం ఆపలేకపోయింది. సాంకేతిక, మార్కెట్, నియంత్రణ వ్యవస్థల మధ్య ఏర్పడిన ఒక సంక్లిష్టమైన పరస్పర అవగాహన వల్ల ఆధునిక వ్యవసాయంలో గ్లైఫోసేట్‌కు ప్రోత్సాహం లభించిందని ఒక అధ్యయనం చెబుతున్నది. ఇందులో 4 కీలక విషయాలు ఇమిడి ఉన్నాయి. (1) జన్యుమార్పు పంటల మీద ఉపయోగం కోసం గ్లైఫోసేట్ వినియోగం; (2) కొత్త వ్యవసాయ వినియోగాలను ప్రోత్సహించడం ద్వారా ప్రపంచవ్యాప్త సాధారణ గ్లైఫోసేట్ మార్కెట్ పెరుగుదల; (3) గ్లైఫోసేట్ వాడకంతో మిళితం చేసే డిజిటల్ వ్యవసాయం, జీనోమ్ ఎడిటింగ్ వంటి కొత్త సాంకేతిక ప్రోత్సాహం; (4) కార్పొరేట్ మార్కెట్ శక్తి పెరుగుదల వల్ల వ్యవసాయ పరిశోధన కార్యక్రమాల్లో ప్రభుత్వ పెట్టుబడి తగ్గి హెర్బిసైడ్ రహిత కలుపు నియంత్రణ మీద పరిశోధనలు ఆగిపోవడం.

మన దేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో ప్రభుత్వాలు ఆ మధ్య వరుసగా ఒక మూడు సంవత్సరాలు దీనిమీద 60 రోజులు పాటు నిషేధం ప్రకటించాయి. ఈ తాత్కాలిక నిషేధం ఉద్దేశ్యం చట్టవిరుద్ధమైన, హెర్బిసైడ్–తట్టుకునే బీటీ పత్తి విత్తనాలను ఉపయోగించకుండా అరికట్టడానికి అని చెప్పారు. ఈ తాత్కాలిక



నిషేధం కూడా కాగితాలకే పరిమితం అయ్యింది. ఆ పరిమిత నిషేధ కాలంలో కూడా బహిరంగంగానే అమ్మకాలు జరిగాయి. పురుగు మందుల నియంత్రణ చట్టం, 1968 ప్రకారం రాష్ట్రాలు విష రసాయనాలను 60 రోజుల వరకు మాత్రమే నిషేధించవచ్చు. కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే శాశ్వతంగా నిషేధించే అధికారం ఉంది. వివిధ రాష్ట్రాలు కోరినా కేంద్రం నిషేధం గురించి స్పందించడం లేదు. కేరళ, సిక్కిం రాష్ట్రాలు మాత్రం కొన్ని అధికరణలను ఉపయోగించి శాశ్వత నిషేధం విధించాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కేంద్రానికి రాసి మిన్నకున్నాయి. ఇతర విషయాలలో అధ్యయనాలకు బృందాలను పంపే రాష్ట్రాలు మరి కేరళ, సిక్కిం ఎట్లా సాధించాయో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

2019–21 మధ్య స్వదేశీ జాగరణ్ మంచ్ అవగాహన కార్యక్రమాలు చేపట్టి, గ్లైఫోసేట్‌ను పూర్తిగా నిషేధించాలని కోరుతూ రెండు లక్షల మంది సంతకాలతో కూడిన మెమోరాండంను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రికి సమర్పించింది. స్వదేశీ జాగరణ్ మంచ్ ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ. అనేక విషయాలలో ఆర్ఎస్ఎస్ అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నదని ఆరోపణ ఎదురుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, గ్లైఫోసేట్ మీద మాత్రం ఆ సంస్థ కోరిన నిషేధం విధించలేకపోతున్నది. రాజకీయ ఒత్తిడులలో ఉండే అధికార క్రమం ఇక్కడ స్పష్టంగా కనపడుతున్నది.

అక్టోబర్ 2020లో, పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ ఇండియా మరియు పాన్ ఆసియా పసిఫిక్ సంయుక్తంగా 'స్టేట్ ఆఫ్ గ్లైఫోసేట్ యూజ్ ఇన్ ఇండియా' నివేదికను విడుదల చేశాయి. దీని వాడకం విచ్చలవిడిగా ఉందని నివేదించాయి. దీని వల్ల పర్యావరణం మీద, వ్యవసాయ కార్మికుల మీద, గ్రామీణ ప్రజల ఆరోగ్యం మీద దుష్ప్రభావాలు పెరుగుతున్నాయని పేర్కొంది. నేరుగా క్యాన్సర్ కలుగజేసే దీన్ని ఆహార పంటల క్షేత్రాలలో వినియోగించడం ప్రమాదకరం.

ప్రజల నుంచి, సంస్థల నుంచి వచ్చిన ఒత్తిడుల నేపథ్యంలో నిషేధించకుండా కేంద్ర ప్రభుత్వం 2020లో కొన్ని ఆంక్షలు ప్రకటించింది. దీని ప్రకారం పెస్ట్ కంట్రోల్ ఆపరేటర్ల ద్వారా తప్ప ఏ వ్యక్తి కూడా దీన్ని పిచికారీ చేయరాదు. అంటే సాధారణ రైతులు ఉపయోగించరాదు. కేవలం రసాయన పిచికారి చేసే సంస్థల ద్వారానే ఉపయోగించాలని కొత్త నిబంధన తెచ్చింది. తదుపరి కంపెనీ నుంచి వచ్చిన ఒత్తిడికి తలొగ్గి ఈ ఆంక్షలను సవరించారు. శిక్షణ పొందిన వారు ఎవరైనా ఉపయోగించవచ్చు అని చెప్పారు. ఆ శిక్షణ ఇవ్వడానికి ఒక కేంద్ర పరిశోధన సంస్థకు అప్పజెప్పితే వారు కొన్ని ఆన్‌లైన్ తరగతులు నిర్వహించి ఒక సర్టిఫికెట్ ఇస్తున్నారు.

రైతులలో పూర్తి అవగాహన లేకపోవడం, పురుగుమందు / విత్తన కంపెనీల మార్కెట్ మాయాజాలం, కొరవడిన ప్రభుత్వ నియంత్రణ వంటి కారణాల వల్ల, రైతులు దీన్ని వాడుతున్నారు. రైతులు తాము కొన్నవి గ్లైఫోసేట్ తట్టుకునే విత్తనాలు అనుకుని, కాయ కాసిన తరుణంలో, గడ్డిని తొలగించటానికి దీన్ని వాడటం వల్ల, మొత్తం పంట మాడిపోయి నష్టపోయిన ఉదంతాలు ఉన్నాయి. దీని వాడకం మీద ఆంక్షలు ఉండడంతో, ప్రభుత్వం నుంచి పరిహారం కోరే అవకాశం కూడా లేకుండా పోయింది. గ్లైఫోసేట్ పిచికారీ చేసిన గడ్డి అని తెలియక దాన్ని నోట్లో పెట్టుకున్న ఒక అమ్మాయి చనిపోయింది. అనేక విధాలుగా గ్రామాలలో అమాయకులు ఈ విష రసాయనాల బారిన పడి అనారోగ్యం పాలవుతున్నారు. పంట ఎండపెట్టడానికి ఓపిక లేని రైతులు పంట కోతకొచ్చే సమయానికి దీన్ని వాడుతున్నారు. దాని వల్ల మొక్క మాడుతుంది, చచ్చిపోతుంది. అట్లాంటి పంట వ్యర్థాలు విషపూరితం అవుతాయి. దీన్ని పిచికారీ చేసిన పంట వ్యర్థాల్నితిని గొర్రెలు, మేకలు, ఇతర పశువులు కూడా చనిపోయాయి.

క్యాన్సర్ ప్రమాదాల గురించి వినియోగదారులను హెచ్చరించడంలో కంపెనీ విఫలమైందని పేర్కొంటూ మోన్‌శాంటో (ఇప్పుడు బేయర్ యాజమాన్యంలో ఉంది)తో సహా గ్లైఫోసేట్‌తో సంబంధం ఉన్న రౌండప్ తయారీదారులపై అమెరికాలో వేలకొద్దీ కోర్టు వ్యాజ్యాలు దాఖలైనాయి. 2019 నాటికి ఇవి 42,700. ఇతర దేశంలో గ్లైఫోసేట్ మీద ఈగ వాలితే అమెరికా ప్రభుత్వం వాలిపోతుంది. అదే అమెరికాలో వేల కొద్దీ వ్యాజ్యాలను ఆ కంపెనీ ఎదుర్కొంటున్నది.

మానవాళికి, జీవకోటికి ప్రమాదకరంగా పరిణమించిన ఈ వ్యాపార వస్తువును నిషేధించలేని పాలనా వ్యవస్థలను, అందులోని లోపాలను అధ్యయనం చేయాలి. ఒక వ్యాపార వస్తువుని నియంత్రించలేని దేశాధినేతల బలహీనతలు ఇక్కడే తేలిపోతున్నవి. ప్రజారోగ్యాన్ని దెబ్బ తీస్తూ, పర్యావరణానికి దీర్ఘకాల హాని చేసే రసాయనాల నియంత్రణ మీద ఒక వైపు అంతర్జాతీయ చర్చలు జరుగుతుంటే మన దేశంలో మాత్రం ఏ చర్చా లేదు. ఇది మారాలి. ఈ పరిస్థితి మారాలంటే మన రాజకీయం మారాలి.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

షూటింగులకు వాడుతున్నారా?

దట్టమైన పర్వత ద్రోణుల్లోంచి కూడా చైనా సైనిక డ్రోన్లు సిమెంట్ సంచులను ముప్పై సెకన్ల లోపే మోసుకెళ్తున్నాయి. మరి ఇండియన్ డ్రోన్లు ఏం చేస్తున్నట్టు?

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

స్వేచ్ఛకు అడ్డంకి

పౌరబడొద్దు. ఒకవేళ ఎన్నికైతే, ట్రంప్ రెండో హయాంలో దారుణమైన ప్రాజెక్ట్ 2025 పథకాన్ని అమలు చేయడంలో జె.డి. వాన్స్ సహకరిస్తారు. ఆ ప్రాజెక్ట్ సంతాన నిరోధకాలను నియంత్రిస్తుంది. జాతీయస్థాయిలో అబార్షన్లను నిషేధిస్తుంది. మేము వారిని ఆపుతాం.

– కమలా హ్యారిస్, అమెరికా ఉపాధ్యక్షురాలు

కన్నడిగులదే కర్ణాటక

కర్ణాటక ఉద్యోగాలు కన్నడిగులకే అనేదానికి నా పూర్తి మద్దతు. బెంగళూరులో ఈ హిందీవాళ్లతో అలసిపోయాను. నా రాష్ట్రంలోనే నేను పరాయివాడిని అనిపిస్తోంది. వ్యాపారం పేరుతో మనం మన సంస్కృతి కోల్పోయాం. ఆటోవాళ్ల నుంచి స్విగ్గీవాళ్ల దాకా అందరూ హిందీలోనే మాట్లాడుతారు. జర్మనీలో ఉద్యోగాలకు జనాలు జర్మన్ పరీక్ష రాస్తున్నప్పుడు, కర్ణాటకలో కూడా దాన్ని అమలుచేస్తే తప్పేమిటి?

– దర్శన్, కన్నడిగ

అందరూ అంతేనా?

నా జీవితంలో పెద్ద నిరాశ ఏమిటంటే, ఆఖరికి సోకాల్డ్ ప్రగతిశీల (లెఫ్టిస్టులు) మనుషులు కూడా అవే అంశాలను విలువైనవిగా పరిగణించడం: ఒక పెద్ద పేరున్న సంస్థలో పనిచేయడం, నెట్‌వర్క్ ఉండటం, మీరు అమ్మాయైతే సంప్రదాయ ప్రమాణాల్లో ఆకర్షణీయంగా ఉండటం.

– భారతి, పరిశోధకురాలు

తుర్కియే దారుణాలు

ఇరాక్ భూభాగాల మీద తుర్కియే ఆకస్మిక దాడులు జరుగుతున్నాయి. ప్రతిరోజూ తుర్కిష్ సైనిక కదలికలు, కుర్దు, అస్సీరియన్ గ్రామాల మీద దాడుల లైవ్ ఫుటేజ్ చూస్తున్నాం. అమాయక పౌరులు తమ ఇళ్ల నుంచి పారిపోవాల్సి వస్తోంది. ఈ కొత్త దాడులు మొదలైనప్పటి నుంచీ 602 గ్రామాలు భయంలో ఉన్నాయి.

– పెనాజ్ ఇబ్రహీమ్ అహ్మద్, ఇరాక్ తొలి మహిళ

కాలుష్య పన్ను

సరిగ్గా అమలుచేస్తే, కార్బన్ డై ఆక్సైడ్ పన్ను అనేది స్థిరంగా గాలిలో పెరుగుతున్న సీఓ2 స్థాయిలను మార్చగలదు. మనం దేనికైనా పన్ను విధిస్తున్నప్పుడు మంచివాటి కంటే చెడ్డవాటి మీద వేయాలి. కూరగాయలు, పళ్ల కంటే మద్యం, సిగరెట్ల మీద విధించినట్టుగా! ఐదు, పదేళ్లలోనే వాతావరణ ఘోర విపత్తు పొంచివున్నదనే వారితో నేను విభేదిస్తాను గానీ దీర్ఘకాలిక నష్టం ఉందని అంగీకరిస్తాను.

– ఎలాన్ మస్క్, పారిశ్రామికవేత్త

అర్హత లేదా?

నాకు 46 ఏళ్లు. ఏ రాష్ట్రంలోనూ 15 కంటే ఎక్కువ ఏళ్లు ఉండలేదు. మా నాన్న ఇండియన్ నేవీలో పని చేశారు. దేశమంతా బదిలీ అయ్యారు. ఆయన పిల్లలు కర్ణాటకలో ఉద్యోగాలకు అర్హులు కారా? నేను కంపెనీలను ఏర్పాటుచేశాను. దేశవ్యాప్తంగా పాతిక వేలకు పైగా ఉద్యోగాలు కల్పించాను. నా పిల్లలు వారి సొంత నగరం (బెంగళూరు)లో ఉద్యోగాలకు అర్హులు కారా? సిగ్గుచేటు!

– సమీర్ నిగమ్, 'ఫోన్ పే' వ్యవస్థాపకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

మీ గెలుపోటములు సరే, మా మాటేమిటి?

అభిప్రాయం

జాన్‌సన్ చోరగుడి

భారత్‌లో 1991లో ఆర్థిక సంస్కరణలు మొదలు కావడంతో కొత్త శకం ప్రారంభమయ్యింది. అప్పటి నుంచి తెలుగునాట– 'పొలిటికల్ ఎగ్జిక్యూటివ్'ల తీరును చూసినప్పుడు... వాళ్ళల్లోనూ, వారిని ఎంపిక చేసుకునే మన వైఖరిలోనూ కాలంతో పాటుగా సహజంగా జరగవలసిన మార్పు పెద్దగా కనిపించదు. ఆర్థిక సంస్కరణల కంటే ముందు 'మండల్' కమిషన్ నివేదిక చట్టమై, దేశమంతా అది అమలులోకి వచ్చింది. ఈ రెండు మార్పులతో మన – 'పొలిటికల్ ఫిలాసఫీ' నవీనీకరణ చెందాల్సి ఉండింది.

'సరళీకరణ' పరిణామక్రమం గురించి ఈ 'సోషల్ మీడియా' కాలంలో కూడా ఒక 'నెరేటివ్'గా కూడా మన విశ్లేషకులు ప్రస్తావన చేయడం ఎక్కడా కనిపించడం లేదు. అలా జరిగినప్పుడు, వర్ధమాన సమాజాలు (ఎమర్జింగ్ కమ్యూనిటీస్) తమ అస్తిత్వ ఘర్షణకు ఒక చారిత్రక క్రమం ఉందనీ, ఆ ప్రాతిపదికగా తాము ఎదగాలనీ, తమదొక 'లీగల్ క్లెయిమ్' అనీ అవి నమ్ముతాయి. కానీ ఉద్దేశ్యపూర్వకంగానే అలా జరగకపోవడం వల్ల, ఇప్పటికీ ఆ శ్రేణులను మనం ఏమిటో, మనకు ఏమి కావాలో మనకే అర్థం కాని స్థితికి పనిమాలా చేర్చినట్టుగా అయింది. ఆ విషయం 2024 ఎన్నికలు స్పష్టం చేశాయి. పర్యవసానంగా తెలుగునాట ఇప్పటికి ముప్పై ఏళ్ల క్రితం 1994 నవంబర్ ఎన్నికల్లో ఎన్టీఆర్ చేతిలో కోట్ల విజయభాస్కర రెడ్డి ఓడిపోయాక, కొద్ది నెలలకు తానే 'పొలిటికల్ ఎగ్జిక్యూటివ్'గా మారిన చంద్రబాబు నాయుడు(సీబీఎన్) పలు విరామాల మధ్య గెలుస్తూ ఓడుతూ... అదే పదవిలో ఇప్పటికీ ఇక్కడ కనిపిస్తుంటారు.

మారుతున్న కాలంతో పాటు చేరే కొత్త తరాల కోసం– 'చేంజ్ మేనేజ్మెంట్' వైపు కొత్తదారులు చూపాలనే సోయి మనకు ఉన్నట్టుగా అనిపించదు. స్వతహాగా మనకది లేకపోవడం వల్ల, మన స్థాయి – 'మీడియోకర్' కావడం వల్ల మనం ఆ పని చేయలేకపోయి ఉండొచ్చు కూడా. అందుకే తరాలు ఎన్ని మారినా ఒకే మూస రాజకీయ నాయకత్వం ఏదో ఒక పద్ధతిలో ఇక్కడ కొనసాగుతున్నది. దాంతో మన



గమనం లేకుండానే, అభిప్రాయ నిర్మాతలుగా మనమూ ఏదో ఒక వైపుకు లాగబడి, అదే ప్రభావంలో శాశ్వతంగా 'సెటిల్' అవుతున్నాం. అదేంటి, పరిపాలన అన్నప్పుడు ఒక 'బుక్' ఉంటుంది కదా, చట్టాలకు లోబడి కదా ప్రభుత్వాలు పనిచేయవలసింది అంటే, అది నిజమే. కానీ సూత్రం మేరకు 'బుక్' అనేది ఈ ముప్పై ఏళ్ళలో 'ఎగ్జిక్యూటివ్'కు మాత్రమే పరిమితమైన అంశంగా మారింది. తెలుగువారికి 1956లో ఒక రాష్ట్రం ఏర్పడిన నలభై ఏళ్ల తర్వాత– 'కోట్ల'కు కొనసాగింపుగా వచ్చిన సీబీఎన్ 2024 తర్వాత కూడా ఇక్కడ చలామణిలో ఉండగా, 2000 తర్వాత ఏర్పడిన రాజకీయ ఖాళీలో పుట్టినవి– టీఆర్ఎస్, వైఎస్ఆర్‌సీపీలు.

ఈ మూడు ప్రాంతీయ పార్టీల్లో సీబీఎన్ ఆర్థిక సంస్కరణల ఆరంభ కాలంలో 'పొలిటికల్ ఎగ్జిక్యూటివ్' అయిన వాడు కావడంతో 'కోట్ల' వరకు వున్న జాబితా నుంచి ఆయన్ని వేరుచేసి చూడాలి. మధ్యలో కాంగ్రెస్ సీఎంగా వైఎస్ లేరా? అంటే ఉన్నారు, అయితే మళ్ళీ ఆ 'స్కూల్' వేరు. ప్రధానిగా పీవీ ఉన్న కాలంలో ఆర్థిక మంత్రిగా సంస్కరణల అమలు బాధ్యతలు చూసిన డా॥ మన్మోహన్ సింగ్ సంస్కరణలు మొదలైన పదేళ్ళకే ప్రధానమంత్రిగా– 'రిఫామ్స్ విత్ హ్యూమన్ ఫేస్' అనాల్సి వచ్చింది. పదేళ్ళకే విషయం అర్థమైంది. దాంతో సంస్కరణల అమలుకు మానవీయ కోణం తప్పలేదు. అందుకే వైఎస్ కాలాన్ని– 'ఏపీ మోడల్' అంటూ సింగ్ ప్రశంసించేవారు. సీబీఎన్‌ను ఓడించి 2004లో సీఎమ్‌గా వైఎస్ 'ఎంట్రీ'కి కొద్ది నెలల ముందు 'వరల్డ్ ఎకనమిక్ ఫోరం' అధ్యక్షుడు క్లాస్ శ్వాబ్ హైదరాబాదులో మాట్లాడుతూ – 'ప్రపంచం ముందున్న ప్రధానమైన సవాలు పేదరిక నిర్మూలన. ఇది ఈ సమాజాన్ని నిరంతరం విభజిస్తూనే ఉంటుంది. సమాజంలో ప్రతి ఒక్కరికీ వికాసం పొందే అవకాశం కల్పిస్తే తప్ప మనకు ఎంత మాత్రం భద్రత ఉండదు' అన్నారు.

అయితే శ్వాబ్ ఏపీలో ఈ మాట అనిన కొన్ని వారాలకు 2004 వేసవిలో సీఎంగా బాబుకు తొలి ఓటమి ఎదురైనా, రాజకీయంగా అయితే ఆయన ఎప్పుడూ ఖాళీగా లేరు. వైఎస్ మరణం తర్వాత ఆయన మరీ 'బిజీ' అయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత ఆ పని రెట్టింపు అయింది. అలాగని ఎందులో... ఎందుకు? వంటి ప్రశ్నలకు మళ్ళీ ప్రజాహితమైన జవాబులు మనకు దొరకవు. రాష్ట్ర విభజన తర్వాత జరగాల్సింది ఏమిటి? ఏ ఒక్క ఓటమి తర్వాతా... గెలిచినప్పుడూ ఒక కొత్త ఆరంభం లేదంటే, దానర్థం మారుతున్న కాలాన్ని దానితోపాటుగా పెరుగుతున్న ఆశావహ శ్రేణుల్ని పట్టించుకోకపోవడమే కదా? 'ఉచితాలు' ఎందుకు అన్నవాళ్ళను, ప్రతి ఎన్నికల ముందు 'మాకేంటి?' అనే వాళ్ళను ఇద్దరినీ పక్కన పెట్టినా, మిగతావారి మాటేంటి? వేలిమీద ఓటు 'ఇంకు' ఉండగానే, గెలిచాక వారికి మా జవాబుదారీతనం ఏముంది అన్నట్టుగా ప్రవర్తిస్తే ఎలా?

ఐదేళ్ళ క్రితం మా ప్రణాళిక ఇది అని మొదటిసారి అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ వికేంద్రీకరణ సూత్రంగా మూడు రాజధానులు అంటూ తమ– 'పొలిటికల్ ఫిలాసఫీ' చెబుతూ, తమ రాజకీయాలు రాష్ట్రానికి పరిమితమని స్పష్టం చేసింది. మరి నలభై ఏళ్ల పార్టీ, సీనియర్ సీఎం అయినప్పుడు, విభజన జరిగిన పదేళ్ళ తర్వాత అయినా ఈ రాష్ట్రం విషయంలో తమ 'ప్రోగ్రాం' ఏమిటో వెల్లడించాలి కదా. ఆ పని అది ఎందుకు చేయలేకపోతున్నది? పదేళ్ళ క్రితం విభజన జరిగాక, శ్రద్ధ రాష్ట్రం మీద కాకుండా తెలంగాణ రాజకీయాల్లోకి తెరవెనుక జోక్యం చేసుకుని విఫలమయింది. మళ్ళీ ఇప్పుడు గెలిచిన నెలలోనే తెలంగాణలో పార్టీ బలోపేతం అంటే, 'పొలిటికల్ ఎగ్జిక్యూటివ్'లు ప్రజలు–ప్రాంతము అనే దృష్టి నుంచి దూరమై వాళ్ళు తమ రాజకీయాలు చూసుకుంటే, ఇక ఈ రాష్ట్ర ప్రయోజనాల మాటేమిటి? 'రాజ్యం' అంటే– 'లెజిస్లేచర్' ఒక్కటే కాదు కదా, కొత్త రాష్ట్రంలో ఈ పదేళ్ళలో ఇప్పుడిప్పుడే ఒక రూపు తీసుకుంటున్న వ్యవస్థల్ని మీ రాజకీయాలతో ఇలా చేష్టలుడిగేలా చేస్తే చివరికి ఓడేది ఎవరు?

వ్యాసకర్త అభివృద్ధి–సామాజిక అంశాల వ్యాఖ్యాత

ధోతీ, తలగుడ్డంటే... రైతే!

డాక్టర్ యలమంచిలి శివాజీ

బెంగళూరులో ఓ మాల్‌లోని మల్టీప్లెక్స్‌లో కుమారుడితో కలిసి సినిమా చూడటానికి ఫకీరప్ప అనే రైతు ధోతీ కట్టుకొని వచ్చాడని, కాపలాదారు లోనికి రానివ్వకుండా, ప్యాంట్ ధరించి వస్తేనే అనుమతిస్తానని అడ్డుకొన్నాడు. ఆ రైతు కుమారుడు ఈ సంభాషణను వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేశాడు. దానిపై రైతు సంఘం నాయకులు వేలాదిమంది ధోతీ ధరించిన రైతులతో, ఆ మాల్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. దానితో మాల్ యాజమాన్యం ఈ సదరు ఫకీరప్పను ఆహ్వానించి, ధోతితో వచ్చిన ఆయనకు స్వాగతం పలికి శాలువా కప్పి సత్కరించి, క్షమాపణలు చెప్పి ఇకపై ఇటువంటి పొరపాటు చేయబోమని చెంప లేసుకుంది.

పత్రికలలో ఈ వార్త చదివినాక, నాడు రాజ్యసభలో జరిగిన ఓ ఆసక్తికరమైన సన్నివేశం గుర్తుకొచ్చింది. 1990లో నాటి ఉపప్రధాని దేవీలాల్ ఓ ప్రశ్నకు సమాధానం చెబుతున్నారు. 5 నక్షత్రాల హోటళ్లలో రైతులకు రెస్టారెంట్లలో చౌక ధరలకు తినుబండారాలు ఇస్తామని ప్రకటించారు. రైతులను ఎలా గుర్తుపడతారని ప్రశ్నించారు. 'ఏముంది – ధోతీ, తలగుడ్డ ఉంటుంది గదా? వాటి ఆధారంగా గుర్తుపడతారు' అన్నారు.

కర్ణాటకకు చెందిన మార్గరెట్ ఆల్వా కాంగ్రెస్ పక్షాన సీనియర్ సభ్యురాలు – పైగా జీవ్ రాజ్ ఆల్వా కుటుంబ నేపథ్యం – చాలా హుందాగా ఉండేది. 'అది సరే చౌదరీసాబ్ – చౌదరిణీల నెలా గుర్తుపట్టడం (మహిళా రైతులను) అని' ప్రశ్నించారు. దానికి దేవీలాల్ 'వారు ఎటూ వారి భర్తల వెంటే ఉంటారు గదా?' అని సమాధానమిచ్చారు. 'మరి వారు ఒంటరిగా వస్తేనో?' అనే సందేహం వెలిబుచ్చారు. దానికి దేవీలాల్ 'మా పల్లెటూరి మహిళలు, బస్తీల దొరసానులలాగా ఒంటరిగా, భర్త లేకుండా 5 నక్షత్రాల హోటళ్లకు వెళ్లరు' అని గడుసుగా శెలవిచ్చారు. మార్గరెట్ ఆల్వా సిగ్గుతో – ఆమె కూడా సభలో వెల్లివిరిసిన నవ్వులతో పాలుపంచుకొన్నారు.

వ్యాసకర్త రాజ్యసభ మాజీ సభ్యులు । 98663 76735




కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆయనకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, జేఈవో వీరబ్రహ్మం ప్రసాదాలను అందజేశారు. అలాగే, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద రావు కూడా స్వామివారిని దర్శించుకున్నారు. - తిరుమల

హైకోర్టు జడ్జికి స్వల్ప అస్వస్థత

తిరుపతి తుడా: శ్రీవారిని దర్శించుకున్న అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గా ప్రసాద్ గురువారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ప్రాథమిక చికిత్స కోసం ఆయన్ను హుటాహుటిన తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించి ప్రత్యేక గదిలో వైద్యం అందిస్తున్నారు.

'శ్రీవాణి' ఆఫ్‌లైన్ టికెట్ల కుదింపు

తిరుమల: శ్రీవారి దర్శనానికి పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా, సామాన్య భక్తులకు మరింత ప్రాధాన్యత పెంచేందుకు వీలుగా జూలై 22 నుంచి శ్రీవాణి దర్శన టికెట్లను టీటీడీ రోజుకు 1,000కి పరిమితం చేసింది. ఇదివరకు ఉన్నట్లే ఆన్‌లైన్‌లో 500, ఆఫ్‌లైన్‌లో 1,000 టికెట్లను జారీ చేయనుంది. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో 900 శ్రీవాణి టికెట్లను మొదట వచ్చిన వారికి మొదట ప్రాతిపదికగా జారీచేస్తారు. శ్రీవాణి దాతలకు విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కౌంటర్‌లో 100 టికెట్లు అందుబాటులో ఉంచారు.

పాత పెన్షన్ విధానమే కావాలి

సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల్లో పాత పెన్షన్ విధానాన్ని మరలా తీసుకురావాలని ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ (ఏఐపీఈఎఫ్) డిమాండ్ చేసింది. పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని విద్యుత్ రంగ ఇంజనీర్ల సంఘం ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏఐపీఈఎఫ్ లేఖ రాసింది.

భారీ వర్షాలకు పొంగిన వాగులు, వంకలు

పలు ప్రాంతాల్లో నీటిలో చిక్కుకున్న ప్రజలు



ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం గుబ్బల మంగమ్మ గుడి వద్ద వాగులో చిక్కుకున్న భక్తులు




తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం హైటెక్ బస్సు షెల్టర్ వద్ద వరద నీటిలో చిక్కుకున్న కారు

- ఏలూరు జిల్లాలో కొట్టుకుపోయిన కారు.. ఐదుగురు సురక్షితం
- కామవరం వద్ద అడవిలో చిక్కుకున్న వారిని బయటకు తెచ్చిన స్థానికులు
- అల్లూరి సీతారామరాజు జిల్లాలో చేపల వేటకు వెళ్లిన వారిని కాపాడిన గ్రామస్తులు

సాక్షి నెట్‌వర్క్: అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలుచోట్ల ఆనకట్టలు దెబ్బ తింటున్నాయి. పలు ప్రాంతాల్లో ప్రజలు వరద నీటిలో చిక్కుకుపోయారు. వారిని స్థానికులు, అధికారులు రక్షించి, సురక్షిత ప్రాంతాలకు తీసుకువస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని కట్టలేరు, వైరా ఏరు, మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గుంటూరు జిల్లాలోనూ మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. తెనాలి మండలంలో 28.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వరి, పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని, నీరు పొలాల్లో నిలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో గురువారం 41.6 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. 2 వేల ఎకరాల్లోని తొలకరి పంట నీట మునిగింది. తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 67.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు ప్రాంతాల్లో వరి నాట్లు, ఆకుకూరలు, కూరగాయల పంటలు నీటిలో మునిగాయి. ఓ వైపు గోదావరి, మరోవైపు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. సహాయక చర్యలకు విద్యుత్ శాఖ, జిల్లా కలెక్టర్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. జిల్లాలోని దేవరాపల్లి వద్ద ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నీరు గుండుగొలను - కొవ్వూరు మధ్య జాతీయ రహదారిపై నుంచి ప్రవహించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలోకి చేరింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 46.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని గండిపోసమ్మ అమ్మవారి ఆలయంలోకి వరద నీరు చేరింది. అధికారులు ఆలయాన్ని మూసివేశారు.

కాలువలో కొట్టుకుపోయిన కారు.. ఐదుగురిని కాపాడిన గిరిజనులు

ఏలూరు జిల్లాలో పెదవాగు గేట్లు ఎత్తేయడంతో వేలేరుపాడు మండలం అల్లూరినగర్ వద్ద కొడిసెల కాలువ పొంగి ప్రవహిస్తోంది. మేడేపల్లి నుంచి రుద్రమకోట వైపు వెళ్తున్న కారును స్థానికులు అడ్డుకొని, వెళ్లవద్దని వారించారు. అయినా వినకుండా కారు వెళ్లడంతో వరద ఉధృతికి కొట్టుకుపోయింది. ఇంతలో కారు డోర్లు తెరుచుకోవడంతో అందులో ఉన్న లింగవరపు జ్యోతి, గడ్డం సాయికుమారి, పిల్లలు కుందన కుమార్, జగదీష్‌కుమార్, డ్రైవర్ రామారావు పెదవాగు ప్రవాహం వైపు కొట్టుకుపోయారు. అదృష్టవశాత్తూ చెట్ల కొమ్మలు దొరకడంతో వాటిని పట్టుకుని అలానే ఉండిపోయారు. వారి అరుపులు విని అల్లూరి నగర్, కోయ మాధవరం గ్రామాల గిరిజనులు వచ్చి, తాళ్ల సహాయంతో వారి వద్దకు చేరుకున్నారు. ఐదు గంటలు శ్రమించి వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అడవి నుంచి 100 మంది సురక్షితంగా బయటకు ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలో కామవరం అటవీ ప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి గురువారం ఉదయం పలువురు భక్తులు కొండ వాగు దాటుకొని వెళ్లారు. అప్పటికి వాగులో సాధారణ ప్రవాహం ఉంది. భారీ వర్షాలకు మధ్యాహ్నం కొండవాగు ఒక్కసారిగా పొంగడంతో సుమారు 100 మంది భక్తులు, వ్యాపారులు గుడి వద్దే చిక్కుకుపోయారు. ఓ పక్క వాగు పొంగడం, మరోపక్క వర్షం కూడా కురుస్తుండటంతో సాయంత్రానికి కూడా వారు బయటకు రాలేకపోయారు. మరోపక్క చీకటి పడుతుండటంతో అడవిలో ప్రాణ భయమూ నెలకొంది. దీంతో స్థానికులు రంగంలోకి దిగారు. వారి సాయంతో గుడి దగ్గర చిక్కుకున్న వారు సుమారు 3 కిలోమీటర్లు నడుచుకుంటూ అతి కష్టం మీద వాగు దాటుకొని రాత్రి 8:30 గంటలకు కామవరం చేరుకున్నారు. వర్షాలు తగ్గే వరకు గుబ్బల మంగమ్మ దర్శనాన్ని నిలిపివేస్తున్నామని ఆలయం ప్రతినిధులు కోర్సా కన్నపరాజు, గుజ్జా రామారావు, కోర్సా సుబ్బు, మడివి బొజ్జి, తెల్లం ప్రసాద్, కుర్సం వెంకటస్వామి తెలిపారు.



అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీ పట్నంలో వరద నీటిలో మునిగిన గండిపోసమ్మ అమ్మవారి విగ్రహం



అల్లూరి సీతారామరాజు జిల్లా దేవరపల్లి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలోకి చేరిన వరద నీరు

చేపల వేటకు వెళ్లి.. వాగులో చిక్కుకుని..

అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్ పురం మండలం గుర్రంపేటకు చెందిన పూనెం నాగమణి, సోడె సంధ్యారాణి, కారం వెంకటేష్, మొట్టుం బాబూరావు, మొట్టుం సురేష్ గురువారం సాయంత్రం పెదవాగు వద్దకు చేపల వేటకు వెళ్లారు. వాగు ప్రవాహం పెరగడంతో ఒక్కసారిగా నీరు చుట్టుముట్టింది. బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో కాపాడాలంటూ పెద్దగా కేకలు పెట్టారు. కొద్ది దూరంలో గొర్రెలు మేపుకొంటున్న సరిహద్దు రాజేశ్వరావు అధికారులకు సమాచారమిచ్చారు. తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ , కూనవరం ఎస్ఐ శ్రీనివాస్, జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ వెంటనే అక్కడికి వచ్చారు. గ్రామంలోని యువకులతో కలసి వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.



ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.రవీంద్రబాబు గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. - ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ)

సతీష్‌రెడ్డికి తెలుగు వైభవ పురస్కారం

మండలి ఫౌండేషన్ చైర్మన్ బుద్ధప్రసాద్ వెల్లడి



అవనిగడ్డ: భారత రక్షణ మంత్రి సలహాదారు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌కుమార్ రెడ్డిని మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారానికి ఎంపిక చేశామని మండలి ఫౌండేషన్ చైర్మన్, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. కృష్ణా జిల్లా అవనిగడ్డలో బుద్ధప్రసాద్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ప్రపంచ మహాసభల ద్వారా ఒకే వేదిక మీదకు తీసుకొచ్చిన దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు పేరు మీద ఏటా ఒక ప్రముఖుడికి ఎంవీకేఆర్ తెలుగు వైభవ పురస్కారాన్ని అందిస్తున్నట్టు బుద్ధప్రసాద్ తెలిపారు. డీఆర్‌డీఓ ద్వారా రక్షణ రంగానికి ఎనలేని సేవలందించిన సతీష్‌రెడ్డి దివంగత రాష్ట్రపతి అబ్దుల్‌కలాం అజాద్ తరువాత ఆ స్థాయిలో మిస్సైల్ మ్యాన్‌గా గుర్తింపు పొందారన్నారు. క్షిపణి వ్యవస్థపై పరిశోధన, రక్షణ రంగ అభివృద్ధిలో సతీష్ రెడ్డి ప్రముఖ పాత్ర పోషించారని వివరించారు. ఆగస్టు నాలుగో తేదీన మండలి వెంకట కృష్ణారావు జయంతిని పురస్కరించుకుని స్థానిక గాంధీక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారం అందించనున్నట్టు చెప్పారు.

ఎంపీడీవో కుటుంబసభ్యులతో మాట్లాడిన సీఎం

బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ

సాక్షి, అమరావతి/ పెనమలూరు: నాలుగు రోజుల నుంచి ఆచూకీ లేకుండా పోయిన నర్సాపురం ఎంపీడీఓ వెంకటరమణారావు కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు గురువారం ఫోన్‌లో మాట్లాడారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులోని వెంకటరమణారావు ఇంటికి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేరుకున్నారు. ఎంపీడీఓ భార్య సునీత, కుటుంబ సభ్యులతో కలెక్టర్ నాగరాణి మాట్లాడారు. ఆ తరువాత సునీతతో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఘటనపై పూర్తి విచారణ చేయిస్తానని తెలిపారు. ఎప్పటికప్పుడు వివరాలు సీఎంఓకు తెలపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ నాగరాణి విలేకరులతో మాట్లాడుతూ.. ఎంపీడీఓ వెంకటరమణారావు రాసిన సూసైడ్ నోట్‌లో విషయాలపై విచారణ జరిపిస్తామన్నారు. కుటుంబ సభ్యులకు ఏ సమాచారం తెలిసినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు, నర్సాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మధునాయుడు, పలువురు టీడీపీ నేతలు ఎంపీడీఓ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇదిలా ఉండగా ఎంపీడీఓ మండవ వెంకటరమణారావు కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏలూరు కాలువలో విస్తృతంగా గాలిస్తోంది. గురువారం రాత్రికి కూడా ఆయన ఆచూకీ తెలియలేదు. శుక్రవారం గాలింపు చర్యలు చేపడుతామని పెనమలూరు సీఐ టి.వి.వి.రామారావు తెలిపారు.



ఏలూరు కాలువలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

నా సొమ్మే ప్రభుత్వం వద్ద ఉంది: ధవేజీ

ఫెర్రీ బకాయి వ్యవహారంలో ఎంపీడీవోపై ఒత్తిడి లేదు

నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీఓ అదృశ్యం వెనుక తన ఫెర్రీ ఫీజు బకాయి వ్యవహారం ఉన్నట్లు తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని రేవు పాట కాంట్రాక్టర్ సీహెచ్ రెడ్డప్ప ధవేజీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫెర్రీ విషయంలో తాను ప్రభుత్వానికి రూ.53 లక్షలు బాకీ పడ్డానంటూ ఈ నెల 15న ఎంపీడీఓ ఫోన్ చేశారని వివరించారు. తాను వారం రోజులు గడువు కోరితే ఎంపీడీఓ అంగీకరించారని తెలిపారు. బకాయికి బదులుగా గతంలోనే తన రూ.50 లక్షల విలువైన పంటును స్వాధీనం చేసుకున్నారని వివరించారు. మార్చితో రేవు నిర్వహణ గడువు ముగిసిందని, ఎన్నికల కారణంగా పాట నిర్వహణ సాధ్యం కాదని, పాట నిర్వహించే వరకు రేవు నిర్వహణ చూడాల్సిందిగా తనను అధికారులు కోరారని వివరించారు. తనకు నష్టం వస్తుందని, కొంతమేర రాయితీ ఇవ్వాలని కూడా కోరానని పేర్కొన్నారు. దానికి అంగీకరించారని, రాయితీ రూపంలో తనకు రూ.13 లక్షలు రావాలని తెలిపారు. తన పంటు, రాయితీ సొమ్ము మినహాయిస్తే తాను పెట్టిన బకాయి పోనూ ఇంకా ప్రభుత్వం నుంచి తనకే కొంత సొమ్ము వస్తుందని వివరించారు. తాను మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అనుచరుడినని, వైఎస్సార్‌సీపీ నేతననే కారణంతో తనను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజుకు ఈ అంశంలో ఎలాంటి సంబంధం లేదన్నారు.

పేదల ఇంటి నిర్మాణ బిల్లులు ఆపేయండి


అధికారులకు కూటమి ఎమ్మెల్యేల హుకుం

గత వారంలో 4,028 ఇళ్లకు రూ. 11.15 కోట్ల చెల్లింపులు నిలుపుదల

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పేదల ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ముందుకు సాగనివ్వడం లేదు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే లేబర్ ఏజెన్సీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ పేదల సొంతింటి కలకు కూటమి పార్టీల నేతలు మోకాలడ్డుతున్నారు. సాధారణంగా ఆప్షన్-3 ఇళ్లకు సంబంధించి నిర్మాణ బిల్లులను తొలుత లబ్ధిదారుల ఖాతాల్లో వేసి వారి ఖాతాల నుంచి లేబర్ ఏజెన్సీలకు బదిలీ చేస్తుంటారు. ఈ క్రమంలో 4,028 ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించిన రూ.11.15 కోట్ల బిల్లులను 234 ఏజెన్సీల ఖాతాల్లోకి బదిలీ చేయాలని గృహ నిర్మాణ సంస్థ బ్యాంక్‌కు లేఖ రాసింది. ఈ క్రమంలో బిల్లులను ప్రాసెస్ చేసి ఏజెన్సీల ఖాతాల్లోకి బదిలీ చేయడానికి బ్యాంక్ సిద్ధం అవుతుండగా ఉన్నట్టుండి చెల్లింపులు నిలిపివేసినట్టు సమాచారం. రాయలసీమ జిల్లాలతో పాటు, నెల్లూరు, గుంటూరు, ఎన్టీఆర్ సహా మరికొన్ని జిల్లాల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులకు ఫోన్‌లు చేసి చెల్లింపులు నిలిపివేయమని చెప్పినట్లు తెలిసింది. మరోవైపు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి బిల్లులు నిలిచిపోవడంతో నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయని.. లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక గృహ నిర్మాణ శాఖ అధికారులు వివరించే పనుల్లో పడ్డారు. మార్చిలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. జూన్‌లో ఫలితాలు వెలువడి కోడ్ కూడా ముగియడంతో వర్షాకాలం రాకముందే ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే సొంతిళ్లలోకి వెళ్లొచ్చని లబ్ధిదారులు భావించారు. ఇదిలా ఉండగా గత ప్రభుత్వంలోనే దాదాపు నిర్మాణం పూర్తయిన 1.28 లక్షల ఇళ్లను తమ ఖాతాలోకి వేసుకోవడానికి వంద రోజుల ప్రణాళికను ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించింది. ఒకవైపు అధికారులు, సిబ్బందికి టార్గెట్‌లు ఇచ్చి నిర్మాణాలు పూర్తి చేయాలని చెబుతూ.. మరోవైపు బిల్లులు నిలిపేయడం ఏంటని అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పేదల కల సాకారమయ్యేనా..?

రాష్ట్రంలో అర్హులైన పేదల సొంతింటి కలను సాకారం చేయడం కోసం వైఎస్ జగన్ పాలనలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద పేదలకు ఉచితంగా స్థలంతో పాటు, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేశారు. స్తోమత లేని వారికి ఇంటిని నిర్మించి ఇవ్వడం కోసం ఆప్షన్-3 విధానాన్ని అమలు చేశారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 3.51 లక్షల మంది లబ్ధిదారులు ఈ ఆప్షన్‌ను ఎంచుకున్నారు. వీరిని కొన్ని గ్రూపులుగా చేసి భవన నిర్మాణ లేబర్ ఏజెన్సీలతో అనుసంధానించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా ప్రభుత్వం పర్యవేక్షించింది. ప్రభుత్వం యూనిట్‌కు రూ.1.80 లక్షలతో పాటు, పావలా వడ్డీకి ఇచ్చే రూ. 35 వేల రుణంతో ఏజెన్సీలు ఇంటిని నిర్మించి లబ్ధిదారుడికి అందజేస్తున్నాయి. ఇప్పటికే 42 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రస్తుతం లేబర్ ఏజెన్సీలపై కూటమి నేతలు అక్కసు వెళ్లగక్కుతుండటంతో పేదల సొంతింటి కల సాకారమయ్యేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



బైడెన్‌కు కరోనా

మిల్వాకీ: ఓవైపు అమెరికా అధ్యక్ష ఎన్నికలు శరవేగంగా సమీపిస్తున్నాయి. ప్రత్యర్థి అసలే డొనాల్డ్ ట్రంప్. ఆదినుంచీ దూకుడుగా దూసుకెళ్తున్నారు. అది చాలదన్నట్టు హత్యా యత్నంతో ఆయన గ్రాఫ్ మరింత పెరిగింది. దాన్ని వీరోచితంగా ఎదుర్కొన్న తీరుతో మరింత ఫేవరెట్‌గా మారారు. అలాంటి ట్రంప్‌ను దీటుగా ఎదుర్కోవాల్సిన డెమొక్రాట్లు మాత్రం ఇంకా కాలూ చెయ్యీ కూడదీసుకునే ప్రయత్నంలోనే ఉన్నారు. వయోభారం, మతిమరుపుతో రోజుకో రకంగా తడబడుతున్న అధ్యక్షుడు జో బైడెన్ ఎలా చూసినా ట్రంప్‌కు పోటీ ఇవ్వలేరని దాదాపుగా తేలిపోయింది. అయినా పోటీ నుంచి తప్పుకునేందుకు, మరొకరికి చాన్సిచ్చేందుకు 81 ఏళ్ల బైడెన్ ససేమిరా అంటున్నారు. ఇవి చాలవన్నట్టు బైడెన్ తాజాగా కరోనా బారిన పడ్డారు! దాంతో కీలక దశలో ఎన్నికల ప్రచారానికి విరామం ఇవ్వాల్సి వచ్చింది. ఈ వరుస పరిణామాలతో డెమొక్రాట్లు తల పట్టుకుంటున్నారు. పోటీకి ముందే ఓటమి ఖాయమయ్యేలా ఉందని వాపోతున్నారు. బైడెన్‌ను ఎలాగోలా బుజ్జగించి తప్పించేందుకు చివరి నిమిషం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. లాస్‌వెగాస్‌లో ప్రచార ఈవెంట్‌లో మాట్లాడాల్సి ఉండగా బైడెన్‌కు కరోనా సోకినట్టు తేలింది. దాంతో డెలావెర్ నివాసంలో ఐసోలేషన్‌లో ఉన్నారు.

ట్రంప్‌ను మీరు ఓడించలేరు: పెలోసీ

బైడెన్ తప్పుకోవాలంటున్న డెమొక్రాట్ల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. పార్టీ కీలక నేత, ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ ఇటీవల బైడెన్‌తో ఫోన్లో మాట్లాడినట్టు సీఎన్ఎన్ వార్తా సంస్థ వెల్లడించింది. ట్రంప్‌ను ఓడించడం ఆయన వల్ల కాదని ఆమె స్పష్టం చేసినట్టు చెప్పుకొచ్చింది. ''పోల్స్ కూడా మీరు గెలవలేరనే చెబుతున్నాయి. కనుక తప్పుకుంటే మంచిది. కాదని మొండికేస్తే మీరు ఓడటమే గాక ప్రతినిధుల సభలో డెమొక్రాట్ల విజయావకాశాలను కూడా చేజేతులా నాశనం చేసిన వారవుతారు'' అంటూ పెలోసీ కుండబద్దలు కొట్టారట.

మా మంచి తాతయ్య!

ట్రంప్‌పై మనవరాలి ప్రశంసల జల్లు



మిల్వాకీ: అది రిపబ్లికన్ల నేషనల్ కన్వెన్షన్. బుధవారం రాత్రి ఓ 17 ఏళ్ల అమ్మాయి వేదికనెక్కింది. తొలి ప్రసంగమే అయినా ఎక్కడా ఆ ఛాయలే లేవు. అనేకానేక అంశాలపై తడుముకోకుండా మాట్లాడి అందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది. దాంతో హాలంతా పదేపదే చప్పట్లతో మార్మోగింది. పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తనను అబ్బురంగా, ఒకింత గర్వంగా చూసుకుంటూ మురిసిపోయారు. ఆ టీనేజర్ కాయ్ మాడిసన్. ట్రంప్ మనవరాలు. ''తాతా! మీరే నాకు స్ఫూర్తి'' అని కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారామె. 10 మంది మనవలూ, మనవరాళ్లలో కాయ్ అందరికంటే పెద్ద. ట్రంప్ పెద్ద కుమారుడు ట్రంప్ జూనియర్, ఆయన మాజీ భార్య వనెసా కూతురు.

నేనూ ట్రంప్‌నే...

తాతయ్య ఎప్పుడూ దేశం మంచినే కోరతారని కాయ్ చెప్పుకొచ్చారు. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చేందుకు పోరాడుతున్నారన్నారు. ఎందరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ధైర్యంగా ఎదుర్కొని నిలిచారంటూ ప్రశంసలతో ముంచెత్తారు. ''ఆయనలో బయటికి ప్రపంచానికి పెద్దగా తెలియని కోణాన్ని మీతో పంచుకోదలిచా. తాతగా ఆయనెంతో ప్రేమాస్పదుడు. మేం చిన్నపిల్లలుగా ఉండగా అందరు తాతల్లాగే మమ్మల్నెంతో గారాబం చేసేవారు. మా పేరెంట్స్ చూడకుండా చాక్లెట్లు, కూల్‌డ్రింకులు ఇప్పించేవారు. మేం ఆనందపడితే చూసి మురిసిపోయేవారు. స్కూల్లో ఎలా చదవుతున్నామో ఎప్పటికప్పుడూ తెలుసుకునేవారు. ఓసారి నాకు బాగా మార్కులొస్తే ఆ ప్రోగ్రెస్ కార్డును ప్రింట్ తీయించి మరీ మిత్రులందరికీ చూపించుకుని సంబరపడ్డారు. నాకు తరచూ కాల్ చేసి గోల్ఫ్ ఎలా ఆడుతున్నానో ఆరా తీసేవారు. తన గోల్ఫ్ కథలన్నీ పంచుకునేవారు. 'స్కూల్లో ఉన్నా తాతయ్యా, మాట్లాడలేను' అని చెప్పాల్సి వచ్చేది. ఇద్దరం కలిసి గోల్ఫ్ ఆడేప్పుడు నన్ను ఓడించడానికి ప్రయత్నించేవారు. కానీ పడనిచ్చేదాన్ని కాదు. నేను కూడా ట్రంప్‌నే తాతయ్యా అనేదాన్ని!'' అంటూ గుర్తు చేసుకున్నారు. 2015లో ట్రంప్ తొలిసారి అధ్యక్ష అభ్యర్థి అయినప్పటి నుంచీ కాయ్ ఆయనతో కలిసి పలు కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ప్రధాన ప్రచార వేదికపై కనిపించడం, మాట్లాడటం ఇదే తొలిసారి. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటారామె. ట్రంప్‌పై కాల్పులు జరిగిన వెంటనే ఆయన పిడికిలెత్తి నినదిస్తున్న ఫొటోను పోస్ట్ చేసి, ''తాతా, ఐ లవ్యూ. పోరాడుతూనే ఉండు!'' అని రాశారు. ఆమెకు సొంత యూట్యూబ్ చానల్ ఉంది.

మా నాన్న సింహసదృశుడు

హత్యా యత్నాన్ని ట్రంప్ గొప్పగా ఎదుర్కొన్నారని ఆయన పెద్ద కుమారుడు ట్రంప్ జూనియర్ (46) అన్నారు. ''రక్తం ధారగా కారుతున్నా రొమ్ము విరిచి నిలబడ్డారు. నేపథ్యంలో జాతీయ పతాకం రెపరెపలాడుతుండగా చెయ్యెత్తి పిడికిలి బిగించి పోరాట నినాదాలు చేశారు. అమెరికా పోరాట స్ఫూర్తికే ప్రతీకగా నిలిచారు. కాబోయే దేశాధ్యక్షుడు సింహసదృశుడని నిరూపించారు'' అంటూ కొనియాడారు. ట్రంప్ భార్య మెలానియా, కూతురు ఇవాంకా, అల్లుడు జరేడ్ కుష్నర్ తదితర కుటుంబ సభ్యులు గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) సదస్సులో పాల్గొంటారు.

ట్రంప్‌పే అమెరికా ఆశాకిరణం

- అమెరికాకు ఆయన అత్యవసరం
- ట్రంప్ గెలిస్తేనే దేశానికి భవిష్యత్తు
- రిపబ్లికన్ల ఉపాధ్యక్ష అభ్యర్థి వాన్స్
- బైడెన్ స్వార్థ నాయకుడంటూ నిప్పులు



మిల్వాకీ: అమెరికా శ్రామిక వర్గం అభ్యున్నతి కోసం చివరి శ్వాస దాకా పాటుపడతానని రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి, ఒహాయో సెనేటర్ జె.డి.వాన్స్ (39) అన్నారు. వారిని అధికార డెమొక్రటిక్ పార్టీ పూర్తిగా విస్మరించిందంటూ మండిపడ్డారు. మిల్వాకీలో జరుగుతున్న రిపబ్లికన్ల నేషనల్ కన్వెన్షన్‌లో వాన్స్‌ను ఉపాధ్యక్ష అభ్యర్థిగా బుధవారం లాంఛనంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాదాసీదా, నిరుపేద మూలాలున్న తాను ఇంత దూరం వస్తానని కల్లో కూడా ఊహించలేదని చెప్పారు. ''జీవితంలో ఒక్క మెట్టూ ఎదుగుతూ వచ్చా. ఒకరకంగా సగటు అమెరికన్ కలగనే జీవితాన్ని ప్రస్తుతం జీవిస్తున్నా. వారంతా భద్రమైన, సురక్షితమైన జీవితం గడిపేలా చేస్తా. ఏ పార్టీవారన్న దానితో నిమిత్తం లేకుండా ప్రతి అమెరికన్‌కూ నా సర్వస్వం ధారపోస్తా. అమెరికా ఎన్నడూ మరిచిపోలేని ఉపాధ్యక్షుడిగా పేరు తెచ్చుకుంటా'' అంటూ ప్రతిజ్ఞ చేశారు.

ట్రంప్‌పై ప్రశంసల వర్షం

రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై వాన్స్ ప్రశంసల వర్షం కురిపించారు. అమెరికా మధ్యతరగతికి, శ్రామిక వర్గానికి ప్రస్తుతం ఆయనే ఏకైక ఆశాకిరణమన్నారు. ''ట్రంప్ రాజకీయాల్లోకి రాకముందే ప్రపంచంలోకెల్లా అత్యంత విజయవంతమైన వ్యాపారవేత్తల్లో ఒకరు. ఎవరైనా జీవితంలో కలలుగనేవన్నీ ఆయనకు అందుబాటులో ఉన్నాయి. అయినా అమెరికన్లకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలని తపించారు. అందుకోసం తిట్లను, వేధింపులను, మరెన్నింటినో సహిస్తున్నారు. నిజానికి ట్రంప్‌కు ఆయనకు రాజకీయాలు అవసరం లేదు. అమెరికా ప్రజలకే ఇప్పుడు ట్రంప్ అత్యవసరం'' అని చెప్పుకొచ్చారు. అధ్యక్షుడు జో బైడెన్ రాజకీయాలను కేవలం కెరీర్‌గా మలచుకున్న స్వార్థపరుడంటూ వాన్స్ దుయ్యబట్టారు. బైడెన్ మతిలేని వాణిజ్య ఒప్పందాలు, విదేశీ యుద్ధాలకు అర్థం లేని మద్దతు తన స్వస్థలం ఒహాయో వంటి నిరుపేద అమెరికా ప్రాంతాలను సర్వనాశనం చేశాయంటూ మండిపడ్డారు. పాలక వర్గ ప్రతినిధిగా బైడెన్ ప్రతి చర్యా అమెరికన్ల ఉద్యోగాలను విదేశాలపరం చేసింది. మన యువతను యుద్ధక్షేత్రాలకు బలిచ్చింది. ఇరాక్ నుంచి అఫ్గానిస్తాన్ దాకా, ఆర్థిక సంక్షోభం నుంచి మాంద్యం, అక్రమ వలసల దాకా ప్రస్తుత పాలక వర్గం అన్ని రంగాల్లోనూ పదేపదే విఫలమవుతూ వస్తోంది. ఈ సమస్యలన్నింటి నుంచి అమెరికాను గట్టెక్కించే చిట్టచివరి, అత్యుత్తమ ఆశాకిరణం ట్రంప్ మాత్రమే. సగటు అమెరికన్‌కు అగ్రతాంబూలమే ఆయన విజన్. ఆయనను పోగొట్టుకుంటే మనకిక భవిష్యత్తుండదు'' అన్నారు. ''దేశానికి తొలి ప్రాధాన్యమిచ్చే ట్రంప్‌నే అమెరికన్లు గెలిపించుకోబోతున్నారు'' అని వాన్స్ జోస్యం చెప్పారు.

దక్షిణాసియా వలసదారులపై వాన్స్ ప్రశంసలు

దక్షిణాసియా నుంచి వచ్చినవారు అమెరికాను సుసంపన్నం చేశారని వాన్స్ అన్నారు. భార్య ఉషా చిలుకూరిపై ప్రశంసల వర్షం కురిపించారు. ''దక్షిణాసియా నుంచి వలస వచ్చినవారి కుమార్తెను నేను పెళ్లాడాను. ఆమెకు పెళ్లి ప్రస్తావన చేసినప్పుడు లా స్కూల్ చదువు కోసం, ఫ్లాట్ కొనుగోలుకు చేసిన 1.2 లక్షల డాలర్ల అప్పులు నా నెత్తిన ఉన్నాయని చెప్పా. అయినా పెళ్లికి అంగీకరించింది'' అని చెప్పారు. తన వ్యక్తిగత, ఆధ్యాత్మిక జీవితంపై భార్య ప్రభావం ఉందన్నారు. తల్లి బెవర్లీని సభకు పరిచయం చేస్తూ ఉద్వేగానికి లోనయ్యారు.

భారతీయ వంటలు నేర్చుకున్నారు: ఉష

వాన్స్ గొప్ప ఉపాధ్యక్షునిగా తనను తాను నిరూపించుకుంటారని భార్య ఉషా చిలుకూరి (38) విశ్వాసం వెలిబుచ్చారు. వాన్స్ ప్రసంగానికి ముందు ఆయనను రిపబ్లికన్ కన్వెన్షన్‌కు ఆమె లాంఛనంగా పరిచయం చేశారు. ''జేడీది నిరుపేద స్థానిక శ్వేతజాతి కుటుంబం. నాదేమో భారతీయ వలసదారుల కుటుంబం. అలాంటి మేం కలుసుకోగలిగామన్నా, ప్రేమలో పడి పెళ్లి చేసుకోగలిగామన్నా కేవలం అమెరికా గొప్పదనమే అందుకు కారణం'' అన్నారు. ''నా భారతీయ జీవన శైలి గురించి జేడీ ఆసక్తిగా అన్ని విషయాలూ తెలుసుకున్నాడు. పక్కా మాంసాహారి అయినా నా శాకాహార జీవనశైలికి అలవాటు పడ్డాడు. మా అమ్మనడిగి భారతీయ వంటకాలు చేయడం నేర్చుకున్నాడు'' అన్నారు.



జస్టిస్ కోటేశ్వర్‌సింగ్, జస్టిస్ మహదేవ్‌తో ప్రమాణం చేయిస్తున్న సీజేఐ

సుప్రీంకోర్టు జడ్జీల ప్రమాణం

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.కొటీశ్వర్ సింగ్ సుప్రీంకోర్టు జడ్జీగా ప్రమాణం చేశారు. దీంతో, సుప్రీంకోర్టులో మణిపూర్ రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మొట్టమొదటి న్యాయమూర్తిగా జస్టిస్ కొటీశ్వర్ సింగ్ రికార్డుల్లోకెక్కారు. మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్. మహదేవన్ కూడా అత్యున్నత న్యాయస్థానంలో జడ్జీగా ప్రమాణం చేశారు. గురువారం సుప్రీంకోర్టు కాంప్లెక్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ వీరితో ప్రమాణం చేయించారు. వీరిద్దరి రాకతో అత్యున్నత న్యాయస్థానం సీజేఐతో కలిపి మొత్తం 34 మంది జడ్జిలతో ఆగస్టు చివరి వరకు పూర్తి స్థాయిలో పనిచేయనుంది.

డిప్యూటీ సీఎంగా ఉదయనిధి!



చెన్నై: తమిళనాట సీఎం స్టాలిన్ వారసుడికి పదోన్నతి లభించనుంది. క్రీడలు, యువజన సంక్షేమ శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను త్వరలోనే ఉప ముఖ్యమంత్రిగా నియమిస్తారని విశ్వసనీయవర్గాల సమాచారం. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కుమారుడైన ఉదయనిధి 2022 డిసెంబరులో మంత్రివర్గంలో చేరారు. చెపాక్–తిరువళ్లికేని నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన ఉదయనిధి.. డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు కూడా. డిప్యూటీ సీఎం పదవి కావాలని ఆయన కొంతకాలంగా బలంగా కోరుతున్నారు. ప్రభుత్వంలో తన పరపతిని మరింత పెంచుకోవడంతో పాటు తండ్రి స్టాలిన్‌కు పాలనా వ్యవహారాల్లో చేదోడువాదోడుగా ఉండటానికి ఈ పదోన్నతి ఉపకరిస్తుందని ఆయన భావిస్తున్నారు.

వంద మంది రండి.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోండి

అఖిలేశ్ యాదవ్ ఆసక్తికర ఆఫర్



లక్నో: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, డిప్యూటీ సీఎం కేశవ్‌ప్రసాద్‌మౌర్యల మధ్య విభేదాలతో రాష్ట్ర బీజేపీ ప్రభుత్వంలో లుకలుకలు మొదలయ్యాయన్న వార్తల నడుమ సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్‌యాదవ్ 'ఎక్స్' ఖాతాలో ఆసక్తికర పోస్ట్‌చేశారు. '' వర్షాకాల ఆఫర్ ప్రకటిస్తున్నా. వంద మంది రండి. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకోండి'' అని గురువారం ట్వీట్‌చేశారు. అంతర్గత కుమ్ములాటలు పాలనపై ప్రతికూల ప్రభావం చూపి రాష్ట్రాభివృద్ధి కుంటుబడుతుందని అఖిలేశ్ ఆరోపించారు. ''ఎస్పీకి 111 మంది ఎమ్మెల్యేలున్నారు. 100 మంది బీజేపీ ఎమ్మెల్యేల మద్దతు లభిస్తే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం తేలిక అవుతుందన్నది అఖిలేశ్ పోస్ట్ సారాంశం' అని ఓ ఎస్పీ నేత విశదీకరించారు.

ఉప ఎన్నికల్లోనూ ఉమ్మడిగానే..

యూపీలో కలిసి పోటీ చేయనున్న ఎస్పీ, కాంగ్రెస్

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో అధికార బీజేపీ ఓ పక్క అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతుండగా..మరికొద్ది రోజుల్లో రాష్ట్రంలోని 10 సీట్లకు జరుగనున్న ఉప ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీ చేయాలని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), కాంగ్రెస్ అంగీకారానికి వచ్చాయి. పోటీ చేసే స్థానాలపై చర్చించేందుకు వచ్చే వారంలో రెండు పార్టీల కీలక నేతలు భేటీ కానున్నారని యూపీ పీసీసీ చీఫ్ అజయ్ రాయ్ తెలిపారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసిన ఎస్పీ 37, కాంగ్రెస్ 6 స్థానాలను గెలుచుకుని, బీజేపీకి షాకిచ్చాయి. దాంతో యూపీలో బీజేపీ 33 సీట్లకే పరిమితమైంది. ఇదే ఫార్ములాను ముందుముందూ కొనసాగించాలని ఎస్పీ, కాంగ్రెస్ నిర్ణయించుకున్నాయి.

హరియాణాలో ఆప్ ఒంటరి పోరు

మొత్తం 90 సీట్లలోనూ పోటీ

చండీగఢ్: ఈ ఏడాది చివర్లో హరియాణా అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నిర్ణయించింది. అసెంబ్లీలోని మొత్తం 90 స్థానాల్లోనూ అభ్యర్థులను బరిలో ఉంచుతామని ప్రకటించింది. పూర్తి వివరాలను ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఈ నెల 20న ప్రకటిస్తారని పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. హరియాణాలో పలుమార్లు సొంతంగానే పోటీ చేసిన ఆప్ ఇప్పటివరకు ఖాతా తెరవలేకపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు చేసుకుంది.

13న నా 'ప్రీమియర్' చూడండి!

ట్రంప్‌పై హత్యాయత్నం మీద దుండగుని పోస్టు

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నానికి దుండగుడు థామస్ మాథ్యూ క్రూక్స్ ముందుగానే పథక రచన చేసుకున్నట్టు తేలింది. తన ప్లాన్ గురించి పాపులర్ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫాం స్టీమ్‌లో ముందుగానే అతను సంకేతాలిచ్చాడు. ''జూలై 13న నా ప్రీమియర్ ఉంది. అదెలా జరగబోతుందో చూస్తుండండి'' అంటూ రాసుకొచ్చాడు. అయితే ఈ పోస్టు నకిలీదని కూడా చెబుతున్నారు. మరోవైపు ట్రంప్‌పై హత్యా యత్నానికి సీక్రెట్ ఏజెంట్ల వైఫల్యమే కారణమని ఎఫ్‌బీఐ విచారణలో ప్రాథమికంగా తేలిందంటున్నారు. క్రూక్స్‌ను సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు 20 నిమిషాల ముందే గమనించారని పేర్కొన్నట్టు సమాచారం.

కుడిచెవికి బ్యాండేజి.. కొత్త ఫ్యాషన్

ట్రంప్ మద్దతుదారుల్లో నయా ట్రెండ్

వాషింగ్టన్: అమెరికాలో నయా ఫ్యాషన్ పుట్టుకొచ్చింది. అదే కుడిచెవికి బ్యాండేజీ! హత్యా యత్నంలో గాయమైన తన కుడిచెవికి రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ బ్యాండేజీ వేసుకున్నారు. మిల్వాకీలో రిపబ్లికన్ జాతీయ కన్వెన్షన్‌కు బ్యాండేజీతోనే హాజరయ్యారు. చావుకు అతిసమీపంగా వెళ్లినా ట్రంప్ ప్రదర్శించిన మొక్కవోని ధైర్యాన్ని ఆయన అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు ఈ బ్యాండేజీ గుర్తు చేస్తోంది. దాంతో మద్దతుదారులు, రిపబ్లికన్ డెలిగేట్లు ట్రంప్‌కు సంఘీభావంగా తమ కుడిచెవికి ఇలా తెల్లని బ్యాండేజీ ధరిస్తున్నారు!



సెంటర్లవారీగా ఫలితాలు

- అభ్యర్థుల వివరాలు గోప్యంగా ఉంచండి
- నీట్–యూజీపై ఎన్టీఏకు సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: పరీక్ష కేంద్రాలు, నగరాలవారీగా నీట్–యూజీ, 2024 ఫలితాలను ప్రకటించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. సమగ్ర ఫలితాలను శనివారం మధ్యాహ్నం 12 గంటలలోపు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని తెలిపింది. నీట్–యూజీ పేపర్ లీక్, నిర్వహణలో అవకతవకలపై దాఖలైన వేర్వేరు పిటిషన్లను గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం విచారించింది. పరీక్షను రద్దుచేసి కొత్తగా నిర్వహించాలని, కోర్టు పర్యవేక్షణలో లీకేజీ ఉదంతంపై దర్యాప్తు జరగాలని వేర్వేరు పిటిషన్లు దాఖలైన విషయం తెల్సిందే. '' పరీక్షలో సెంటర్లవారీగా విద్యార్థులు పొందిన మార్కుల వివరాలను బహిర్గతంచేయండిగానీ అభ్యర్థుల ఐడెంటిటీ కనిపించకూడదు. గోప్యత పాటించండి. డమ్మీ రోల్ నంబర్లు వేసి అభ్యర్థుల మార్కుల వివరాలు ఇవ్వండి. ప్రశ్నాపత్రం సోషల్‌మీడియా ద్వారా ఎక్కువ మందికి షేర్ అయి, విస్తృతస్థాయిలో పరీక్ష పవిత్రత దెబ్బతింటేనే పరీక్షను మరోమారు నిర్వహించేందుకు అనుమతిస్తాం. అంతేగానీ ఒకటి రెండు కేంద్రాలకు మాత్రమే లీకేజీ పరిమితమైతే రీటెస్ట్‌కు ఒప్పుకోం. కేసు సీబీఐ చేతికి వెళ్లకముందు బిహార్ పోలీసులు సేకరించిన ఆధారాలు, సమర్పించిన ఆర్థికనేరాల విభాగ నివేదికను రేపు సాయంత్రం ఐదింటికల్లా మాకు అందజేయండి' అని కోర్టు ఆదేశించింది. తర్వాత కొందరు పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది నరేందర్‌హూడా వాదించారు. '' పరీక్షను రద్దుచేయాల్సిందే. ఎందుకంటే లీకేజీ వ్యవస్థీకృతంగా జరిగింది. హజారీబాగ్‌లో ప్రశ్నపత్రాలు ఆరురోజులపాటు ఒక ప్రైవేట్ కొరియర్ కంపెనీ అధీనంలో ఉండిపోయాయి. ఎగ్జామ్ సెంటర్‌కు ఒక సాధారణ ఈ–రిక్షాలో తరలించారు. ఈ ఉదంతంలో ఆ సెంటర్ ప్రిన్సిపల్‌ను ఇప్పటికే అరెస్ట్‌చేశారు' అని అన్నారు. అయితే ప్రశ్నపత్రం లీక్ కాలేదని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. ' కేవలం 1.08 లక్షల మంది అడ్మిషన్ పొందే ఈ పరీక్ష కోసం 23.33 లక్షల మంది భవిష్యత్తును పణంగా పెట్టలేం. పట్నా, హజారీబాగ్ సెంటర్లలో మాత్రమే లీకేజీ అయినట్లు ప్రాథమిక సాక్ష్యాలను బట్టి తెలుస్తోంది. గుజరాత్‌లోని గోద్రాలోనూ ఇది జరిగి ఉండొచ్చు. అయితే దేశవ్యాప్తంగా పేపర్ లీకేజీ అయిందనే బలమైన ఆధారాలు, సాక్ష్యాలు ఉంటేనే రీ టెస్ట్‌కు ఆదేశాలిస్తాం. అయినా పేపర్ లీకేజీకి, పరీక్ష ప్రారంభానికి మధ్య ఎంత సమయం ఉంది? ఎంత మందికి పేపర్ చేరవేశారు? అనేవి కీలక అంశాలపై స్పష్టత రావాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ 22వ తేదీకి వాయిదా వేసింది.



చైనా మాల్‌లో అగ్ని ప్రమాదం..

16 మంది మృతి

బీజింగ్: చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో బుధవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. జిగోంగ్ నగరంలోని హై–టెక్ జోన్‌లో ఉన్న 14 అంతస్తుల భవనంలో నిర్మాణ పనులు జరుగుతుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. భవనంలో చిక్కుకు పోయిన సుమారు 75 మందిని ఫైర్ సిబ్బంది కాపాడారు. మంటల్లో చిక్కుకుని మరో 16 మంది చనిపోయారని అధికారులు తెలిపారు.

పట్టాలు తప్పిన ఎక్స్‌ప్రెస్

ఇద్దరు మృతి, 34 మందికి గాయాలు

గోండా/న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో చండీగఢ్–దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలో 34 మంది ప్రయాణికులు గాయపడ్డారు. 40 మంది సభ్యుల వైద్య బృందం క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించింది. తీవ్రంగా గాయపడిన వారిని హుటాహుటిన దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని సహాయక కమిషనర్ జీఎస్ నవీన్ చెప్పారు. గాయపడిన వారిని తరలించేందుకు 15 అంబులెన్సులను ఘటనాస్థలిలో సిద్ధంగా ఉంచారు. గురువారం మధ్యాహ్నం 2.37గంటలకు ఈ రైలు ప్రమాదం సంభవించింది. బోగీలు పట్టాలు తప్పడానికి ముందు ఒక పేలిన శబ్దం విన్నానని లోకోపైలట్ చెప్పారు. చండీగఢ్ నుంచి బుధవారం రాత్రి బయల్దేరిన ఈ రైలు అస్సాంలోని దిబ్రూగఢ్‌కు వెళ్తోంది. మార్గమధ్యంలో రైలు లక్నోకు 150 కిలోమీటర్ల దూరంలోని మోతీగంజ్, ఝిలాహీ రైల్వేస్టేషన్ల మధ్య ప్రాంతంలో పట్టాలు తప్పింది. ఎనిమిది బోగీలు పట్టాలు తప్పాయి. '' పై బెర్తులో పడుకున్నా. ఒక్కసారిగా పైకి ఎగిరిపడ్డా. తొలుత కల అనుకున్నా. నిద్ర మత్తు వదిలి గాయాలపాలయ్యా'' అని బిహార్‌కు చెందిన ప్రయాణికుడు దిలీప్ సింగ్ అన్నారు. కొందరు కిటికీ అద్దాలు పగలగొట్టి ఎలాగోలా బయటపడ్డారు. ఇంకొందరు రైలు పట్టాలపైనా సాయం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. ఇంకొందరు ట్రాక్‌కు ఇరువైపులా మోకాలిలోతు బురద దాటి మరీ సాయం కోసం పరుగెత్తారు. సహాయక చర్యలను సీనియర్ రైల్వే, స్థానిక అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. గాయపడిన ప్రయాణికులకు మెరుగైన వైద్యసదుపాయాలు కల్పించాలని అధికారులకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు. ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు రైల్వే మంత్రి ప్రకటించారు. మృతుల కుటుంబాలకు చెరో రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి తలో రూ.2.5 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.50వేలు అందజేస్తారు.



బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల హింస..

మరో 18 మంది మృతి

ఢాకా: ప్రభుత్వ ఉద్యోగాల రిజర్వేషన్ల కోటాలో సంస్కరణలను కోరుతూ బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న ఆందోళనలు మరింత హింసాత్మకంగా మారాయి. గురువారం దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో మరో 18 మంది చనిపోగా 2,500 మంది వరకు గాయపడ్డారు. దీంతో, ఈ ఆందోళనల మృతుల సంఖ్య 25కు చేరింది. గురువారం ఆందోళనకారులు ఢాకాలో ప్రభుత్వ టీవీ కార్యాలయం ముందుభాగాన్ని ధ్వంసం చేశారు. పార్కు చేసిన వాహనాల్ని తగులబెట్టారు. దీంతో, ఉద్యోగులతోపాటు జర్నలిస్టులు లోపలే చిక్కుబడిపోయారు. ఢాకాతోపాటు ఇతర నగరాల్లో ఉన్న వర్సిటీల్లో వారం రోజులుగా జరుగుతున్న ఆందోళనలు గురువారం కూడా కొనసాగాయి. ఆందోళనకారులు భద్రతా సిబ్బంది, అధికార పార్టీ అనుకూలురతో బాహాబాహీగా తలపడ్డారు. ఘర్షణల్లో 18 మంది చనిపోగా 2,500 మందికి పైగా గాయపడినట్లు డెయిలీ స్టార్ పత్రిక తెలిపింది. ఢాకాలోనే 9 మంది చనిపోయినట్లు పేర్కొంది. దాంతో రైళ్లతో పాటు మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపేశారు.

దేవుడు, విశ్వరూపి...

ఆ తర్వాతేమిటి?

ఆశకు హద్దేముంది: ఆరెస్సెస్ చీఫ్ భగవత్

మోదీపై చేసిన విమర్శలే: విపక్షాలు

గుమ్లా (జార్ఖండ్): లోక్‌సభ ఎన్నికల అనంతరం బీజేపీపై తరచూ సునిశిత విమర్శలు గుప్పిస్తున్న ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ గురువారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''జీవుడు వికాస క్రమంలో మనిషి లక్షణాలు సంతరించుకుంటాడు. ఆనక అతీత శక్తులున్న సూపర్‌మ్యాన్ కావాలని ఆశపడతాడు. తర్వాత దేవుడు, భగవంతుడు కావాలనుకుంటాడు. ఆ తర్వాత విశ్వరూపి కావాలని ఆశిస్తాడు. దాన్నీ దాటితే? ఆపైన ఏముందో ఎవరికీ తెలియదు. అంతర్గత, బహిర్గత వికాసానికి అంతన్నదే ఉండదు'' అన్నారు. మానవాళి శ్రేయస్సుకు, ప్రపంచాన్ని అందమైన నివాసయోగ్య ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు పాటుపడటమే మన బాధ్యతన్నారు.

మోదీపై ఆరెస్సెస్ అగ్ని క్షిపణి: కాంగ్రెస్

మోహన్ భగవత్ వ్యాఖ్యలు ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించినవేనని కాంగ్రెస్ పేర్కొంది. ''అవి లోక్ కల్యాణ్ మార్గ్ (ఢిల్లీలోని మోదీ అధికారిక నివాసం)పైకి నాగ్‌పూర్ (ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయం) ప్రయోగించిన అగ్ని క్షిపణి' అంఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అందరిలా తాను తల్లి కడుపు నుంచి పుట్టలేదని చెప్పుకున్న ప్రధానికి ఆరెస్సెస్ తాజా సందేశం విన్పించే ఉంటుందంటూ వాగ్బాణాలు విసిరారు.

భండార్ నుంచి స్ట్రాంగ్ రూంకు

జగన్నాథుని అమూల్య సంపద తరలింపు పూర్తి

పూరీ: పూరీ జగన్నాథుని ఆలయంలోని అమూల్య వస్తువులు, ఆభరణాల తరలింపు గురువారం పూర్తయింది. రత్న భండార్ లోపలి గదిలో ఉన్న అమూల్య సంపదను ఆలయం ఆవరణలోనే ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూంకు తరలించారు. చెక్క, ఇనుప అల్మారాలు, భోషాణాలు తదితర ఏడింటిలో ఉన్న వీటిని స్ట్రాంగ్ రూంకు మార్చేందుకు ఏడు గంటలు పట్టిందని ఆలయ ప్రధాన అధికారి అరబింద చెప్పారు. అనంతరం రత్న భండార్‌తోపాటు స్ట్రాంగ్ రూంకు కూడా నిబంధనలను అనుసరించి తాళం, సీల్ వేసి తాళం చెవులను కలెక్టర్‌కు అందజేశామన్నారు.

రత్న భండార్ లోపలి భాగంలోని అమూల్య సంపదను తాము పరిశీలించామని సూపర్‌వైజరీ కమిటీ చైర్మన్, ఒరిస్సా హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ చెప్పారు. రత్న భండార్‌కు అవసరమైన మరమ్మతులను భారత పురావస్తు శాఖ చేపట్టనుందని, ఆ తర్వాతే స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఆభరణాలు, ఇతర వస్తువుల జాబితా తయారీ ప్రక్రియ మొదలవుతుందని పూరీ రాజవంశీకుడు దిబ్య సింఘ దేబ్ వివరించారు. లోపలి చాంబర్ కింద సొరంగం ఉన్నదీ లేదని సర్వేలోనే తేలుతుందన్నారు.

అమూల్య వస్తువులు, నగల తరలింపు ప్రక్రియను వీడియోలో చిత్రించినట్టు పూరీ కలెక్టర్ సిద్ధార్థ శంకర్ స్వాన్ చెప్పారు. ఆలయం చుట్టుపక్కల భారీ భద్రత ఉంటుందని ఎస్పీ పినాక్ మిశ్రా చెప్పారు. ఎటువంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పాములు పట్టేవాళ్లు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఫైర్ సిబ్బందిని సిద్ధంగా ఉంచుతామన్నారు. రత్నభండార్ లోపల రక్షణగా పాము ఉందన్న వార్తలపై స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు సువేందు మాలిక్ స్పందిస్తూ...అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు.

జాహ్నవిపై అనుచిత వ్యాఖ్యలు..

ఆ పోలీసు తొలగింపు


న్యూయార్క్/సియాటెల్: అమెరికాలోని సియాటెల్‌లో గతేడాది తెలుగు విద్యార్థిని కందుల జాహ్నవి(23) పోలీసు వాహనం ఢీకొట్టడంతో ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే. ఆమెకు పెద్దగా విలువేమీ లేదనేలా డేనియల్ ఆడెరర్ అనే పోలీసు అధికారి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అవి జాహ్నవి కుటుంబానికి ఎంతో వేదన కలిగించి ఉంటాయని దీనిపై విచారణ చేపట్టిన అధికారి స్యూ రాహర్ అన్నారు. అడెరర్ అమానవీయ వైఖరి పోలీసు వృత్తికే కళంకం తెచ్చిపెట్టిందన్నారు. ''ఇలాంటి అధికారిని ఇంకా కొనసాగనీయడం మొత్తం పోలీసు విభాగానికే అవమానకరమవుతుంది. అందుకే ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పేందుకు అతడిని విధుల నుంచి తొలగిస్తున్నాం' అని ప్రకటించారు. కారును వేగంగా నడిపిన మరో అధికారి కెవిన్ డేవ్‌పై నేరారోపణలను నమోదు చేయలేమంటూ కింగ్ కౌంటీ అధికారులు ఈ ఏడాది జనవరిలో స్పష్టం చేశారు. అయితే, ఈ నేరం కింద డేవ్‌కు 5 వేల డాలర్ల జరిమానా విధిస్తూ సియాటెల్ సిటీ అటార్నీ తీర్పు వెలువరించారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శుక్రవారం । 19 । జూలై । 2024



కృష్ణా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ గురువారం బందరు కాలేఖాన్ పేట మున్సిపల్ హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ▶ 8లో



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 505.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి కుడికాలువకు 5,700, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

దుర్గమ్మ సేవలో పాండిచ్చేరి హోం మంత్రి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను పాండిచ్చేరి హోం మంత్రి తిరు ఎ.నమశివాయం దంపతులు గురువారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు విరాళాలను అందజేశారు. విజయవాడ మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్‌కు చెందిన జె.ఎం.కృష్ణారావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు గురువారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. కృష్ణారావు పేరిట నిత్యాన్నదానానికి రూ.1,11,111 విరాళాన్ని, కోట ఉమాదేవి పేరిట రూ.50,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఈవో కె.ఎస్.రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఏఆర్‌టీ కేంద్రం ఏర్పాట్లు పరిశీలించిన డీఎంహెచ్‌వో



గన్నవరంరూరల్: మండలంలోని చిన అవుటపల్లి లో ఉన్న డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలను గురువారం కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి సందర్శించారు. ఏఆర్‌టీ చట్టం ద్వారా సహాయ పునరుత్పత్తి సాంకేతిక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సదుపాయాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతి వైద్యశాల తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని చెప్పారు. అసిస్టెంట్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ ద్వారా ప్రజల్లో ఉన్న వంధత్వాన్ని పరిష్కరించేందుకు ఈ ప్రక్రియ దోహదం చేస్తుందన్నారు. సంతానోత్పత్తి చికిత్స చేయడానికి కావాల్సిన మానవ వనరులు, యంత్ర సామగ్రి, సాంకేతిక పరికరాలను ఆమె పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందజేస్తున్న వైద్య సేవలు సమీక్షించి, ధరల పట్టిక పరిశీలించారు. ఏఆర్‌టీ కేంద్రం ద్వారా అందజేసే సేవలను, యాజమాన్యం నిర్వహించాల్సిన రికార్డులను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అనురాధ, డాక్టర్ వినీల్, అపర్ణ, శైలజా దేవి, మస్తానమ్మ, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా శ్రీనివాసరావు



చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌గా ఆర్.శ్రీనివాసరావును గురువారం ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు వైస్‌చాన్సలర్‌గా విధులు నిర్వహించిన బొల్లా జ్ఞానమణి ఇటీవల రాజీనామా చేశారు. ఈ స్థానంలో కాకినాడ జేఎన్‌టీయూలో ఈఈఈ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆర్.శ్రీనివాసరావును నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి సౌరబ్ గౌర్ జీవో విడుదల చేశారు.

రేపు రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు



విజయవాడస్పోర్ట్స్: ప్రపంచ చదరంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను విజయవాడ గురునానక్ కాలనీలోని ఫన్‌టైమ్స్‌లో ఈ నెల 20వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు ది విజయవాడ చెస్ అసోసియేషన్ కార్యదర్శి మందుల రాజీవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. పోటీల పోస్టర్‌ను అధ్యక్షురాలు అట్లూరి సుధారాణి, ఉపాధ్యక్షురాలు అట్లూరి సుమబిందు, కార్యదర్శి కిలారు వెంకట శివాజీ, కోశాధికారి ముప్పవరపు సతీష్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ పోటీల్లో 26 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. మొదటి 20 స్థానాలు సాధించిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామని, అండర్-7,9,11,13,15 విభాగాల్లో విజేతలందరికీ నగదు బహుమతి, ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.వివరాలకు 9246181858ను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు









ఇంద్రకీలాద్రిపై శుక్రవారం నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఈ ఏడాది రోజుకు 60 నుంచి 70 వేల మంది భక్తులు విచ్చేస్తారని ఆలయ అధికారులు అంచనా వేశారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ఆలయంతో పాటు పరిసరాలను ఆకుకూరలు, కాయగూరల దండలతో అలంకరిస్తున్నారు. అమ్మవారికి, ఆలయ అలంకరణకు ఉపయోగించే కూరగాయలకు గురువారం ఈవో కె.ఎస్.రామరావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

-ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

కృష్ణమ్మ గర్భంలో ఇసుక తోడేళ్లు

కనకదుర్గమ్మ వారధి కూలిపోతే పోనీ... భూగర్భ జలాలు అడుగంటిపోతే పోనీ... మేం మాత్రం కృష్ణమ్మ గర్భాన్ని చీల్చి చెండాడతాం ...ఇసుకను తవ్వేసుకుంటాం...మా జేబులు నింపుకొంటాం... ఇదీ తెలుగుదేశం నాయకుల వైఖరి... పచ్చ నేతల ఇసుక దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. సుప్రీం కోర్టు ఆంక్షలను సైతం బేఖాతరు చేస్తూ రేయింబవళ్లూ నిరాటంకంగా ఇసుకను తోడేస్తున్నారు. ప్రభుత్వం నూతనంగా ఇసుక పాలసీ తెచ్చే నాటికే స్టాక్ యార్డుల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిల్వ చేసిన ఇసుకను చాలావరకు టీడీపీ నేతలు మాయం చేశారు. అక్కడక్కడా మిగిలివున్న ఇసుకను తమ సొంత ఆస్తిలా ఇష్టారాజ్యంగా అమ్మేసుకుంటున్నారు.

ఆంక్షలున్నా.. ఆగని తవ్వకాలు

- ప్రస్తుతం కృష్ణానదిలో అధికారికంగా ఇసుక తవ్వకాల నిలిపివేత
- అయినా తవ్వేసి సొమ్ము చేసుకుంటున్న తెలుగుదేశం నాయకులు
- నిషేధిత ప్రాంతాలైన గురువులగారి ర్యాంపు, యనమలకుదురు నుంచి భారీగా తరలింపు
- ఇక్కడ టీడీపీ నేతల వాహనాలకే అనుమతి
- రొయ్యూరు, మద్దూరుల్లో యథేచ్ఛగా ఇసుక తోలకం
- గతంలో ట్రాక్టరు ఇసుక ధర రూ.3,500.. ప్రస్తుతం రూ.7 వేలు
- చోడవరం స్టాక్‌యార్డులో ఇసుకను మింగేసిన టీడీపీ నేత



తెలుగు తమ్ముళ్లు ఇసుకను మింగేసిన చోడవరం స్టాకు యార్డు ఇదే...



సాక్షి ప్రతినిధి, విజయవాడ: తెలుగుదేశం నాయకులు కృష్ణానదిని చెరబట్టారు. యథేచ్ఛగా ఇసుకను దోపిడీ చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఇసుక అక్రమ తవ్వకాలపై ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో కృష్ణానది వెంబడి ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. అయినా తెలుగుదేశం నేతలు మాత్రం ఇసుక దందాను ఆపటం లేదు. విజయవాడలో కనకదుర్గ వారధికి ముప్పు ఏర్పడుతుందని 20 ఏళ్లుగా గురువులగారి ర్యాంపు, యనమలకుదురు ఘాట్‌లలో ఇసుక తవ్వకాలపై నిషేధం ఉంది. అయినా సరే ప్రస్తుతం ఆ ప్రాంతంలో ట్రాక్టర్ల ద్వారా అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. పెదపులిపాక ఇసుక రేవులో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని కోర్టుకు వెళ్లడంతో అక్కడ ఇసుక తవ్వకాలపై స్టే విధించారు. అయినా అక్కడ కూడా ఇసుక తవ్వేస్తున్నారు. చోడవరంలో ఇసుక దోపిడీ బహిరంగంగానే సాగుతోంది. తెలుగుదేశానికి చెందిన వారి ట్రాక్టర్లను మాత్రమే ఇసుక రీచ్‌లోకి అనుమతి ఉంటుంది. ఇతరులు ఎవరైనా వస్తే అనుమతించరు. పొరపాటున ఇతరుల వాహనంలో ఇసుక లోడ్ అయినా.. దాన్ని అక్కడే అన్‌లోడ్ చేయించి ఖాళీ వాహనాలను తిప్పి పంపుతున్నారు. ఇక్కడ రాత్రి 11 నుంచి ఉదయం 6 గంటల వరకు విచ్చలవిడిగా ఇసుక తరలిపోతోంది. కొన్ని రీచ్‌లలో అయితే పట్టపగలు కూడా యథేచ్ఛగా తరలిస్తున్నారు. నది వెంబడి ఉన్న మద్దూరు, రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, చల్లపల్లి, శ్రీకాకుళం ప్రాంతాల్లో సైతం ఇసుక దందాకు అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది. కొన్నిచోట్ల ఎడ్లబండ్ల ద్వారా ఇసుకను బయటకు తరలించి అక్కడ లారీల్లో లోడ్‌చేసి విజయవాడకు, జిల్లాలోని ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటున్నారు.

అక్రమార్కులకు వరం....

కృష్ణాజిల్లా పరిధిలోని స్టాక్ యార్డుల్లో ప్రస్తుతం ఇసుక నిల్వలు లేవు. దీంతో ఈ జిల్లా వాసులు ఇసుకను ఎన్టీఆర్ జిల్లా స్టాక్ పాయింట్ల నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకుని తెలుగు తమ్ముళ్లు ఇసుక ధరను భారీగా పెంచారు. గతంలో విజయవాడ, తాడిగడప, కంకిపాడు ప్రాంతాల్లో ట్రాక్టరు ఇసుక ధర రూ.3 వేల నుంచి రూ.3,500 మాత్రమే ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ట్రాక్టరు ఇసుక ధర రూ.7 వేలకు చేరింది. ఈ ఇసుక దందా అంతా టీడీపీ నేతల కనుసన్నల్లోనే సాగుతోంది. ఇసుకలో జోక్యం చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పైకి చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఇసుక దందాకు ఆయనే ఊతం ఇస్తున్నారు. విజిలెన్స్ అధికారులు అడపాదడపా నామమాత్రపు దాడులు చేసి, అరకొర ట్రాక్టర్లను పట్టుకుని వదిలేస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారు.

స్టాక్‌యార్డుల్లో నిల్వల్ని మింగేశారు

ఎన్నికలకు ముందు కృష్ణాజిల్లాలో చోడవరం, తోట్లవల్లూరు, మద్దూరు, శ్రీకాకుళం స్టాక్‌యార్డుల్లో ఇసుక నిల్వలున్నాయి. కూటమి అధికారంలోకి రాగానే ఆ నిల్వల్ని టీడీపీ నాయకులు మాయం చేశారు. ఉదాహరణకు పెనమలూరు నియోజకవర్గంలోని చోడవరంలో ఇసుక నిల్వల్ని నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యనేత మింగేశారు. అక్కడ అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఆ ఇసుకను లారీ రూ.16 వేల నుంచి రూ.20 వేల చొప్పున అమ్మేశారు. ప్రస్తుతం స్టాక్‌యార్డుల్లో నిల్వలు లేవని చూపారు. కృష్ణానది వెంబడి జరుగుతున్న ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



విజయవాడ పరిసర ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న ఇసుక

ఎస్ఏఐఎఫ్‌తో ఏపీబీఎఫ్ బృందం చర్చలు



లబ్బీపేట (విజయవాడతూర్పు): షార్జా విమానాశ్రయ అంతర్జాతీయ ఫ్రీ జోన్(ఎస్ఏఐఎఫ్) ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ బిజినెస్ ఫోరం (ఏపీబీఎఫ్) బృందం విజయవాడలోని నోవాటెల్‌లో గురువారం చర్చలు జరిపింది. ఏఐఎఫ్ జోన్ సేల్స్ డెప్యూటీ డైరెక్టర్ అలీఅల్ ముతావా, ఎస్ఏఐఎఫ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ షోయెబ్ ఇబ్రహీంఖతీబ్ షార్జా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించగా ఏపీబీఎఫ్ ప్రతినిధులు తరుణ్ కాకాని, బోడపాటి సాయినవీన్, పమిడి భానుచందర్ చర్చల్లో పాల్గొన్నారు. టూరిజం, వాటర్ స్పోర్ట్స్ సెక్టార్‌లో అవకాశాలను అమరావతి బోటింగ్ క్లబ్ (ఏబీసీ), గ్రానైట్, పప్పుధాన్యాల ఎగుమతి, ఆరోగ్య సంరక్షణ అవకాశాలపై చర్చించారు. షార్జాలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి ఉన్న ఇతర పెట్టుబడిదారులకు మార్గనిర్దేశం చేయడానికి తాము సహకరిస్తామని షార్జా ప్రతినిధులు తెలిపారు.

రెల్లికుల సఫాయి కర్మచారి యూత్ కమిటీ ఎన్నిక

అధ్యక్షుడుగా తుపాకుల వెంకటేష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రెల్లికుల సఫాయి కర్మచారి సంఘం ఎన్టీఆర్ జిల్లా యూత్ కమిటీ ఎన్నికైంది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా యూత్ కమిటీ అధ్యక్షుడిగా తుపాకుల వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా మాడుగుల శరత్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ముత్యాల మారుతీరావు, ఎం. దుర్గాప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాంబ శివరావు, ఉపాధ్యక్షుడిగా ఎ.వేణు ఎన్నికయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు మాడుగుల నాగశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యర్రంశెట్టి దావీదు రాజు పాల్గొని నూతన కమిటీని అభినందించారు.

అక్రమ క్వారీయింగ్‌కు పాల్పడితే చర్యలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



సమావేశంలో మైనింగ్ అధికారులు, క్వారీ నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

సాక్షి ఎఫెక్ట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నిబంధనలకు విరుద్ధంగా అక్రమ క్వారీయింగ్ నిర్వహించినా, జాగ్రత్తలు పాటించకపోయినా సంబంధిత లీజుదారులపై కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. క్వారీల్లో అక్రమ మైనింగ్‌పై 'కంకర.. కరకర' శీర్షికన గురువారం సాక్షి కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన కలెక్టర్ సృజన కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో క్వారీ లీజుదారులు, మైనింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15న పరిటాల శివారు క్వారీలో జరిగిన ఘటనలో ముగ్గురు కార్మికులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. క్వారీ నిర్వాహకులకు నిబంధనలపై అవగాహన ఉన్నప్పటికీ ప్రమాదాలు జరగడం వారి నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోందన్నారు. మనుషులని బలి చేసేంత లాభం కావాలా... పాప పుణ్యాలు ఉండవా? అంటూ క్వారీ లీజుదారులను నిలదీశారు. నిర్వాహకులు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా క్వారీయింగ్ నిర్వహించుకోవాలన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా శిక్ష పడేలా చూడాల్సిన బాధ్యత తమదని, బాధ్యతలో వెనకడుగు వేసే ప్రసక్తే ఉండదన్నారు. అందరినీ మేనేజ్ చేద్దామంటే కుదరదన్నారు. క్వారీయింగ్‌లో ప్రొటోకాల్ ప్రకారం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా మానవ తప్పిదం వల్ల ప్రమాదం జరిగితే కఠినచర్యలు తీసుకుంటామని లీజుదారులను హెచ్చరించారు.

వారం రోజుల్లో నివేదిక సమర్పించాలి

జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 154 క్వారీలు నమోదయ్యాయని, వీటిలో 69 క్వారీలలో రోడ్ మెటల్‌కి సంబంధించిన కార్యకలాపాలు జరుగుతున్నాయని, మిగిలిన 85 క్వారీలలో ఎటువంటి కార్యకలాపాలు జరగడం లేదన్నారు. ప్రతి క్వారీ పరిశీలనకు వీలుగా చివరివరకు రహదారి తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి క్వారీకి సెల్ఫ్ ఆడిట్ తప్పనిసరి అని అన్నారు. ప్రతి నెలా నిర్వహించే మైనింగ్ వివరాలు, అక్కడి ప్రస్తుత నిర్మాణం, ప్రమాదం జరిగే అవకాశం ఉందా.. అనే అంశాలపై కనీస అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మైనింగ్ సేఫ్టీ, పొల్యూషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి కార్యకలాపాలు నిర్వహించే అన్ని క్వారీలలో తనిఖీలు నిర్వహించాలని, సేఫ్టీగా మైనింగ్ నిర్వహించలేని వాటిని తాత్కాలికంగా నిలుపుదల చేయాలన్నారు. క్వారీదారులకు వారం రోజుల సమయం ఇస్తామని, ఈ లోగా సేఫ్టీకి సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదికను గనులు, భూగర్భ శాఖ అధికారులకు అందజేయాలన్నారు. జిల్లాలో 15 రోజుల పాటు కమిటీ తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. క్వారీలలో పనిచేసే కార్మికులు ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి పూర్తి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. మైనింగ్ నిబంధనల ప్రకారం నిర్వహించాల్సిన రిజిస్టర్లు, తీసుకోవలసిన జాగ్రత్తలపై సేఫ్టీ ఆడిట్ తప్పనిసరిగా పాటించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో గనులు, భూగర్భ శాఖ డెప్యూటీ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డైరెక్టర్ కె.వీరాస్వామి, క్వారీ లీజుదారులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు జిల్లా స్థాయి కమిటీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో యువతకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు, సుస్థిర ఉపాధి లభించేలా చేయిపట్టి నడిపించేందుకు ప్రత్యేక కమిటీ కృషి చేస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. కలెక్టరేట్‌లో డీఆర్డీఏ, లీడ్ బ్యాంక్, నైపుణ్యాభివృద్ధి, మెప్మా, పరిశ్రమలు తదితర శాఖల అధికారులతో యువతలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనపై గురువారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందిస్తే సరైన ఉపాధి లభిస్తుంద న్నారు. ఈ దిశగా ప్రత్యేక కమిటీ దృష్టిసారించాలని సూచించారు. మహిళా ఔత్సాహికులకు కూడా అవగాహన కల్పించాలని, ఇందుకోసం ప్రత్యేక వర్క్ షాపులు నిర్వహించాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారిని గుర్తించి వారితో దరఖాస్తు చేయించి బ్యాంకు సబ్సిడీ రుణాలు మంజూరు అయ్యేలా చూడాలన్నారు. స్త్రీ నిధి, ఉన్నతి పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఎల్డీఎం కె.ప్రియాంక, జీఎం-డీఐసీ ఎ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష ఫలితాలు వారం రోజుల్లో అందాలి

డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఢిల్లీరావు



భూసార పరీక్ష కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోగల భూసార పరీక్ష కేంద్రాన్ని డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎస్.ఢిల్లీరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన భూసార పరీక్ష కేంద్రం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు బి.పద్మజ ప్రయోగశాలలో భూసార పరీక్షల గురించి వివరిస్తూ 2024-25 సంవత్సరానికి కేటాయించిన లక్ష్యాలను తెలియజేశారు. జిల్లాలో మొత్తం 11,200 మట్టి నమూనాలను లక్ష్యంగా ఇవ్వగా ఇప్పటికి అన్ని మండలాల్లో వ్యవసాయ అధికారులు మట్టి నమూనాలను సేకరించారని తెలిపారు. మొత్తం పూర్తయిన తరువాత ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పారు. గ్రామ వ్యవసాయ సహాయకులు వారి లాగిన్స్ నుంచి సాయిల్ హెల్త్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకుని రైతులకు అందజేయవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఢిల్లీరావు మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాలు వారం రోజులలోగా రైతులకు అందేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం భూసార పరీక్ష కేంద్రం పనితీరు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. భూసార పరీక్ష కార్డు ఆధారంగా రైతులు పోషకాలు, ఎరువులు ఎంత మోతాదులో వాడాలో అంతే మోతాదులో వాడాలన్నారు. సిబ్బంది కొరత కారణంగా భూసార పరీక్షలకు ఆటంకం కలగకూడదని, ఆ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. పరికరాల మరమ్మతులు, మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ సౌకర్యాలను మెరుగుపరుస్తామని అన్నారు. అక్కడి నుంచి ఆయన ఇబ్రహీంపట్నంలోని జీవ నియంత్రణ ప్రయోగశాలను సందర్శించారు. అధిక ప్రభావంగల పురుగు మందులను విచక్షణా రహితంగా పిచికారీ చేయడం వలన పరాన్న జీవులు, బదనికలు పూర్తిగా నాశనం అవుతున్నాయని తెలిపారు. ప్రతి ఊరిలో ప్రతి రైతు పంట విత్తే ముందు విత్తన శుద్ధి పరాన్న జీవులను ఉపయోగించడం మంచిదన్నారు. జీవ నియంత్రణ పద్ధతులను రసాయన పురుగు మందులను ప్రత్యామ్నాయంగా వాడటం వలన పర్యావరణ సమతుల్యత సాధించవచ్చన్నారు. రైతుల నుంచి పురుగు మందు అవశేషాలు లేని ఉత్పత్తులు పొందవచ్చని తెలిపారు.. జీవ నియంత్రణ ప్రయోగశాల నుంచి ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్, కొర్సాయిరా గుడ్లను కూడా పెంపొందేలా ప్రయోగశాలను మరింత సామర్థ్యంగా తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగ మణెమ్మ, వ్యవసాయ శాఖ 6 డివిజన్ల సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీమా మొత్తాన్ని చెల్లించాలని ఆదేశం

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారుడికి వడ్డీతో సహా బీమా మొత్తాన్ని చెల్లించాలంటూ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీ రాయల బుధవారం ఇండియన్ బ్యాంకును ఆదేశిస్తూ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే..గుడివాడకు చెందిన అట్లూరి మోతీలాల్‌కు జగ్గయ్యపేట ఇండియన్ బ్యాంక్‌లో సేవింగ్స్ అకౌంట్ ఉంది. ఇండియన్ బ్యాంకుకు రూపే పీఎంజెడీవై డెబిట్‌కార్డుకు దరఖాస్తు చేసినప్పుడు కొంత అమౌంట్ చార్జ్ చేసి ఆకార్డుకు పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్, యాక్సిడెంటల్ డెత్, టోటల్ డిజేబులిటీ కవరేజీ లభిస్తుందని మోతీలాల్‌కు చెప్పారు. ఈ నేపథ్యంలో మోతీలాల్ 2021 డిసెంబరు 19వ తేదీన ప్రమాదానికి గురవ్వడంతో అతనికి ఓ కాలిని తొలగించారు. దీంతో మెడికల్ బిల్లు క్లెయిమ్ చెల్లించాలని.. బీమా కంపెనీకి దరఖాస్తు చేసుకోగా బ్యాంకు నుంచి మాకు ఏ విధమైన సమాచారం లేదంటూ బీమా కంపెనీ సిబ్బంది తాత్సారం చేస్తూ వచ్చారు. దీంతో ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించగా పూర్వాపరాలు విచారించిన అనంతరం ఇండియన్ బ్యాంకు వెంటనే ఖాతాదారునికి రూ.50వేలు ఇన్స్యూరెన్స్ క్లయిమ్‌ను 2023 జనవరి 10వ తేదీ నుంచి 9శాతం వడ్డీతో సహా చెల్లించాలంటూ కమిషన్ తీర్పు చెప్పింది. మోతీలాల్‌కు మానసిక వేదన కలిగించినందుకు రూ.10వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5వేలు 30రోజుల్లోగా చెల్లించాలని తన తీర్పులో ఆదేశించింది.

పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

మచిలీపట్నంటౌన్: కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం స్థానిక కాలేఖాన్ పేట మున్సిపల్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల బోధన, ఫలితాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు సంబంధిత రికార్డులు, ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలను కలెక్టర్ పరిశీలించారు. బయోలాజికల్ సైన్స్ లాబరేటరీ ఎక్విప్‌మెంట్‌ను పరిశీలించడంతోపాటు లైబ్రరీలో ఉన్న పుస్తకాల వివరాలపై ఆరా తీశారు. లైబ్రరీ రిజిస్టర్ తనిఖీ చేసి విద్యార్థులు ఎటువంటి పుస్తకాలు చదవడానికి ఆసక్తి చూపుతున్నారని అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి ఇంగ్లిష్ భాషపై వారికి ఉన్న ఆసక్తి, ప్రావీణ్యం పరిశీలనకై పాఠ్యపుస్తకం చదివించి కొన్ని ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. వీడియో పాఠ్యాంశాల బోధనను పరిశీలించారు. విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పొందేందుకు రాసే పరీక్షకు వారిని సిద్ధం చేసేందుకు వినియోగిస్తున్న పుస్తకాల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించారు. అన్నం పలుకుగా ఉందని, ఇంకాస్త ఉడికించాలని సూచించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్, ఎంఈవో-2 గురు ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.శోభారాణి ఉన్నారు.

విద్యార్థులకు జీవన నైపుణ్యాలు అందించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీచింగ్ ప్లాన్ ప్రకారం విద్యార్థులకు విద్యా నైపుణ్యాలు అందించడంతో పాటు సహ పాఠ్య కార్యక్రమాల ద్వారా వారికి జీవన నైపుణ్యాలు అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అధికారులకు సూచించారు. ఇందుకోసం ప్రత్యేక షెడ్యూల్‌ను అనుసరించాలన్నారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గురువారం ఆమె పాఠశాల విద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ శాఖల పరిధిలో ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలు, వాటి పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యుత్తమ బోధనా ప్రణాళిక ద్వారా విద్యను అందించడంతో పాటు కో కరిక్యులర్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషిచేయాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత కెరీర్‌ను సొంతం చేసుకునేందుకు వీలుగా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలు, వాటిని అందుకునేందుకు ఉన్న మార్గాలు, లక్ష్య సాధనకు అనుసరించాల్సిన ప్రణాళిక తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యకర జీవన విధానంపైనా దృష్టిసారించేలా సేంద్రియ వ్యవసాయంపైనా అవగాహన పెంపొందించాలన్నారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకునేలా కిచెన్ గార్డెనింగ్‌లో ఆరో తరగతి, ఆపై తరగతుల విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. వారంలో అరగంట పాటు ఇలాంటి కార్యకలాపాల్లో భాగస్వాములు కావడం వల్ల విత్తన నిర్వహణ, మృత్తికా సంరక్షణ, సేంద్రియ ఎరువులు, ఆరోగ్యవంతమైన పంట ఉత్పత్తులు ఇలా వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకునేందుకు వీలుంటుందన్నారు. వివిధ విభాగాల్లో నిపుణులను ఆహ్వానించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి సృజన

సైకలాజికల్ కౌన్సెలింగ్, మోటివేషనల్ క్లాసులు వంటివి నిర్వహించాలన్నారు.

అంగన్‌వాడీల్లో కిచెన్ గార్డెనింగ్

జిల్లాలోని 1,475 అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న స్థలం ఆధారంగా కిచెన్ గార్డెన్‌ను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. స్థలం అందుబాటులో లేకుంటే గ్రో బ్యాగ్స్ ద్వారా ఆకు కూరలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. హై రిస్క్, రక్తహీనత సమస్య ఉన్న గర్భిణులను గుర్తించి వారిపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలన్నారు. ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. బాల్య వివాహాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ తదితర అంశాలపై షెడ్యూల్ ప్రకారం పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి పాల్గొన్నారు.

పర్యాటకం, క్రీడారంగాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు ఆర్థిక వ్యవస్థకు, ఉపాధికి చోదక శక్తిగా ఉండేలా పర్యాటక, క్రీడా రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషిచేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం ఆమె పర్యాటకం, క్రీడా రంగాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలు, క్రీడా మైదానాలు, శిక్షణ జరుగుతున్న తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పర్యాటకులను మరింత ఆకర్షించేందుకు ఆయా ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. కొండపల్లి కోటపై ట్రెక్కింగ్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొండపల్లి బొమ్మల కళాకారులను ప్రోత్సహించేలా, ఆ కళకు మరింత ఆదరణ లభించేలా ఆ ప్రాంతాన్ని టూరిజం కోణంలో అభివృద్ధి చేయాలని, ఇందుకు సరైన కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో వివిధ క్రీడల్లో అందిస్తున్న శిక్షణ, అందుబాటులో ఉన్న కోచ్‌లు, మౌలిక వసతులపై చర్చించి క్రీడారంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన సామగ్రి, ఇతర అంశాలతో ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. త్వరలోనే ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు. విద్యాధరపురం స్టేడియం అభివృద్ధి ప్రణాళిక, డీఎస్ఏ పరిధిలోని మైదానాల వినియోగం తదితరాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా టూరిజం అభివృద్ధి అధికారి బి.గోపాల్, డివిజనల్ మేనేజర్ (విజయవాడ) కృష్ణ చైతన్య, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) ఎస్ఏ అజీజ్ పాల్గొన్నారు.

ఉద్యమంలా శానిటేషన్ డ్రైవ్

మంత్రి కొల్లు రవీంద్ర

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో శానిటేషన్ డ్రైవ్‌ను ఉద్యమంలా చేపట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మున్సిపల్ అధికారులు, పార్టీ డివిజన్ ఇన్‌చార్జిలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు.నీ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని డ్రెయిన్లలో పూడికలుతీసి మురుగునీరు పారుదల సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టారన్నారు. అయితే వర్షపునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా ఇంజిన్లతో తోడించాలని సిబ్బందికి సూచించారు. అమృత్ పథకం ఫేజ్-1 ద్వారా నాలుగు కిలోమీటర్ల పైప్‌లైన్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కొన్ని చోట్ల డ్రెయినేజీ కల్వర్టులు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణం వేయాల్సిన రోడ్ల నిర్మాణాలను ప్రారంభిస్తామన్నారు. తాగునీటి సరఫరా గురించి ఈనెల 22, 23 తేదీల్లో కేంద్ర అధికారుల బృందం నియోజకవర్గంలో పర్యటించి డ్రెయిన్లు, తాగునీటి సమస్యలు గుర్తిస్తుందన్నారు. అనంతరం తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. వీధి దీపాల



మున్సిపల్ అధికారులు, డివిజన్ ఇన్‌చార్జిలతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

సమస్యల పరిష్కారానికి టెండర్లు పిలవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆయా డివిజన్లలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, మున్సిపల్ ఇంజినీర్ శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ..

మచిలీపట్నంకు త్వరలో రానున్న పరిశ్రమల ద్వారా లక్షమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ బీపీసీఎల్ ఆయిల్‌రిఫైనరీ, విద్యుత్ బ్యాటరీల స్టోరేజ్ పరిశ్రమలు నెలకొల్పడానికి సీఎం చంద్రబాబు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. అమృత్ పథకం ద్వారా మచిలీపట్నంలో రూ.58 కోట్లతో అభివృద్ధిపనులు చేపడతామన్నారు. డ్రైనేజీల్లో పూడిక తొలగించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు.

బాధ్యతల స్వీకారం

ఇబ్రహీంపట్నం: డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన సీహెచ్ వీఎస్ నారాయణ, డిప్యూటేషన్‌పై రెనోవబుల్ ఎనర్జీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో తాడేపల్లిలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నారాయణను కలిసిన ఏపీఎస్ఈబీ ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.



చోరీకి పాల్పడిన వ్యక్తికి మూడేళ్ల జైలు

విజయవాడస్పోర్ట్స్: వృద్ధురాలికి జ్యూస్‌లో మత్తు మందు కలిపి ఇచ్చి ఆమెమెడలో బంగారు గొలుసు, పర్సు అపహరించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి డి.శేషయ్య గురువారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. రెండేళ్ల కిందట తెలంగాణ రాష్ట్రం కోదాడలోని తన కుమారుడి ఇంటికి వెళ్లే నిమిత్తం గుడివాడ నుంచి విజయవాడ బస్టాండ్‌కు చేరుకున్న ఓ వృద్ధురాలిని ఓ వ్యక్తి ట్రాప్ చేశాడు. బ్యాగు మోసేందుకు సాయం చేస్తున్నట్లు నటించి ఆమెతో మాట కలిపాడు. తాను కోదాడ వరకు వస్తానని నమ్మించి, కోదాడ బస్ వరకు ఆమె లగేజీ తెచ్చాడు. బస్సులో ఎక్కిన తరువాత ఆమెతో పాటే అవ్యక్తి టికెట్ తీసుకున్నాడు. బస్సు బయలుదేరడానికి కొన్ని నిమిషాల ముందు మత్తుమందు కలిపిన జ్యూస్‌ను ఆమెకు ఇచ్చాడు. దీంతో వృద్ధురాలు మైకంలోకి చేరుకోగానే ఆమె మెడలోని బంగారు గొలుసు, నగదు ఉన్న పర్సు దొంగిలించి అక్కడ నుంచి పారిపోయాడు. నిద్రమత్తులో ఉన్న వృద్ధురాలు కోదాడ దాటి సూర్యారావుపేటకు చేరుకుంది. వెంటనే తన మెడలోని బంగారు గొలుసు, పర్సు దొంగిలించబడినట్లు గుర్తించింది. తన కుమారుడిని వెంటబెట్టుకుని వచ్చి కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో 2022 ఫిబ్రవరి రెండో తేదీన ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాల ఆధారంగా చోరీకి పాల్పడిన వ్యక్తి తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి జిల్లా కొత్తగూడేనికి చెందిన సమయమంతుల వెంకటేశ్వరరావుగా గుర్తించి అతన్ని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచారు. బాధితురాలి తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. పుల్లారెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. 11మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువుకావడంతో నిందితుడు వెంకటేశ్వరరావుకు మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సాంకేతికత సాయంతో సుస్థిరమైన అభివృద్ధి

షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్

పెనమలూరు: పర్యావరణ పరిరక్షణ ద్వారా భూమిని కాపాడుకుంటూ అన్ని రంగాల్లో సాంకేతికతను వినియోగించుకుని సుస్థిరమైన అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్) డైరెక్టర్ ఎ.రాజరాజన్ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ (ఐఈఈఈ) సహకారంతో కృష్ణా జిల్లా కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో 'గ్రీన్ అండ్ సస్టెయినబుల్ టెక్నాలజీస్' అంశంపై రెండురోజులు నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ మాట్లాడుతూ ప్రస్తుతం భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగి ఆక్సిజన్ తగ్గడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఈ సమస్యలను అధిగమించాలంటే స్థిరమైన సాంకేతికతతో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ద్వారా దేశ ప్రగతిపై దృష్టి సారించాలని సూచించారు. చంద్రుడు, అంగారకుడిపై 2040 నాటికి కాలు మోపేందుకు ఇస్రో ప్రయత్నిస్తోందని, ఈ మేరకు పరిశోధనలు ముమ్మరంగా చేస్తున్నట్లు తెలిపారు. అంతరిక్ష పరిశోధనలతోపాటు వ్యవసాయం, మెడికల్, ఇంజనీరింగ్ రంగాల్లో కూడా అభివృద్ధి సాధించటానికి పరిశోధనలు చేస్తున్నట్లు వివరించారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అడవులు పెంచటం, నీటివనరులను కాపాడటం, ఉష్ణోగ్రతలు తగ్గించే విధంగా గ్రీన్ ఎనర్జీని వినియోగించటం వంటివి చేపట్టాలని పేర్కొన్నారు. ఈసదస్సులో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు చదలవాడ నాగేశ్వరరావు, కాలేజీ కన్వీనర్ ఎం.రాజయ్య, ఉపకులపతి ఏవీ రత్నప్రసాద్, పలువురు పరిశోధకులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



సదస్సులో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎ.రాజరాజన్ తదితరులు

తల్లిదండ్రులకు బాలికల అప్పగింత

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రభుత్వ హాస్టల్ నుంచి వెళ్లిపోతున్న ముగ్గురు బాలికలను ఓ సెక్యూరిటీగార్డు సహకారంతో పోలీసులు వారిని తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన గురువారం నున్న పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈఘటనకు సంబంధించిన వివరాలను విజయవాడ నగర పశ్చిమ డిప్యూటీ పోలీసు కమిషనర్ టి.హరికృష్ణ విలేకరులకు వెల్లడించారు. డీసీపీ కథనం మేరకు..ఆగిరిపల్లిలోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో 5,6 తరగతులు చదువుతున్న ముగ్గురు బాలికలు గురువారం ఉదయం ఐదు గంటలకు హాస్టల్ నుంచి బయటకు వచ్చి నడుస్తూ రోడ్డు పైకి వచ్చారు. వీరి రాకను గమనించిన నున్న రిలయన్స్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఆగిరిపల్లికి చెందిన కూరపాటి రాజేష్ వారి దగ్గరకు వెళ్లి ఎక్కడికి వెళ్తున్నారని అడుగగా, విజయవాడలో ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్నామని చెప్పడంతో ఆసెక్యూరిటీగార్డు వారిని ఆర్టీసీ బస్సు ఎక్కించి నున్న పోలీసుస్టేషన్‌లో అప్పగించాలని కండక్టర్‌కు చెప్పడంతో నున్న పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. బాలికల సమాచారాన్ని పోలీసులు వెంటనే ఆగిరిపల్లిలోని ప్రభుత్వ హాస్టల్ వార్డెన్ మాణిక్యమ్మతోపాటు జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, సింగ్‌నగర్, హనుమాన్‌పేటలకు చెందిన బాలికల తల్లిదండ్రులకు తెలియజేశారు. బాలికల తల్లులు రాగానే డీసీపీ హరికృష్ణ, సీఐ ఎస్.దుర్గాప్రసాద్ బాలికలను వారికి అప్పగించారు. సకాలంలో స్పందించి ముగ్గురు బాలికలను కాపాడటంలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన సెక్యూరిటీగార్డు కూరపాటి రాజేష్‌కు విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు డీసీపీ హరికృష్ణ నగదు బహుమతిని అందజేసి ఘనంగా సత్కరించారు.



సెక్యూరిటీ గార్డు రాజేష్‌కు బహుమతిని అందజేస్తున్న డీసీపీ హరికృష్ణ, సీఐ దుర్గాప్రసాద్

కామాంధుడిని కడతేర్చిన తల్లి

- తాడంకి హత్యకేసులో మలుపు
- 24గంటల్లో హత్య కేసును చేధించిన పోలీసులు

పమిడిముక్కల: తాగిన మత్తులో తనపట్ల అసభ్యంగా ప్రవర్తించిన కొడుకును కన్నతల్లే కడతేర్చిన ఘటన తాడంకిలో చోటుచేసుకుంది. గ్రామంలో గండికోట రాంబాబు(33) అనే యువకుడు హత్యకు గురైన విషయం పాఠకులకు విదితమే. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ శ్రీనివాస్ కలిసి ఈ హత్యకేసు వివరాలను వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ రాంబాబు హత్య కేసును లోతుగా విచారణ జరపగా ఆశ్చర్యకరమైన విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. హతుడు రాంబాబు ఈనెల 16వతేదీ మంగళవారం రాత్రి 11గంటల సమయంలో మద్యం సేవించి తనపట్ల అసభ్యంగా ప్రవర్తించాడని.. లైంగిక దాడికి పాల్పడ్డాడని..చాలా రోజులుగా ఇలాగే చేస్తుండటంతో విసిగిపోయి ఎలాగైనా హత్యచేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తల్లి పద్మావతి విచారణలో తెలియజేసినట్లు చెప్పారు. కుమారుడి వేధింపులు తాళలేక నిద్రిస్తున్న క్రమంలో అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో పచ్చడి బండతో తలపై మోది హత్య చేసినట్లు ఆమె తెలిపిందన్నారు. హత్యా నేరం నుంచి తప్పించుకునేందుకు గుర్తుతెలియని వ్యక్తులు తనకాళ్లు, చేతులు కట్టేసి కుమారుడిని హత్య చేశారని ఆమె ఓ కట్టుకథ అల్లినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు నిందితురాలిని అరెస్ట్ చేసి కోర్టుకు పంపించామన్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో 24 గంటల్లోనే హత్య కేసును చేధించినట్లు సీఐ కిషోర్ బాబు తెలిపారు.



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ శ్రీనివాస్

ఇద్దరు నిందితులకు రిమాండ్

గుడివాడరూరల్: ప్రేమపేరుతో యువతి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడటంతోపాటు పోలీసుస్టేషన్‌లో బీభత్సం సృష్టించిన ఓ ప్రేమోన్మాదిని, అతనికి సహకరించిన మరో యువకుడిపై గుడివాడ టూటౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక గుడ్‌మన్‌పేట(కోతిబొమ్మసెంటర్)కు చెందిన వేమూరి జాన్‌హెన్రీ ప్రేమపేరుతో గుడివాడ మండలం బిళ్లపాడుకు చెందిన ఓ యువతి వెంటపడి వేధించేవాడు. ఈ విషయాన్ని ఏడాది కిందట యువతి తనతల్లిదండ్రులకు తెలియజేయడంతో సదరు యువకుడిని తీవ్రంగా మందలించారు. ఈనేపథ్యంలో యువతి తల్లిదండ్రులు, సోదరుడు బుధవారం సాయంత్రం ఏకాదశి సందర్భంగా గీతాభవన్‌రోడ్డులోని ఓ దేవాలయానికి రాగా, విషయం తెలుసుకున్న జాన్‌హెన్రీ, అతని స్నేహితుడు ధనియాలపేటకు చెందిన బంటుమిల్లి చైతన్యరఘుచరణ్ కలిసి వారిపై దాడికి యత్నించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని వారిద్దరినీ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మద్యంమత్తులో ఉన్న నిందితులిద్దరూ పోలీస్ స్టేషన్ వద్ద వీరంగం సృష్టించి స్టేషన్‌లోని సామాగ్రిని ధ్వంసం చేయడంతో పాటు అడ్డువచ్చిన ముగ్గురు పోలీసులపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు టూటౌన్ సీఐ ఎం. దుర్గారావు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. అనంతరం జాన్‌హెన్రీ, చైతన్యరఘుచరణ్‌లను మచిలీపట్నం సబ్‌జైలుకు తరలించినట్లు సీఐ వివరించారు. సమావేశంలో టూటౌన్ ఎస్ఐ పి.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితులను మీడియాకు చూపుతున్న గుడివాడ టూటౌన్ సీఐ దుర్గారావు, ఎస్ఐ నాగరాజు

క్లీనింగ్ వాహనం ఢీకొని కార్మికుడి మృతి

రామ్‌కో కర్మాగారంలో ఘటన

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట మండలం ధర్మవరప్పాడు తండ గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో క్లీనింగ్ వాహనం ఢీకొని ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మండలంలోని జయంతిపురం గ్రామానికి చెందిన మాడావత్ నాగులు (40) రామ్‌కో సిమెంట్స్ కర్మాగారం ఫ్లోర్ మిల్లులో పదేళ్లుగా కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ఫ్లోర్‌మిల్లు శుభ్రం చేస్తుండగా క్లీనింగ్ వాహనం వెనుకగా ఢీకొట్టింది. దీంతో నాగులు డివైడర్‌పై పడటంతో తలకు తీవ్ర గాయమైంది. కర్మాగారంలోని ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడలోని ఓ వైద్యశాలకు తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడు నాగులుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తమకు యాజమాన్యం న్యాయం చేయాలని కోరుతూ నాగులు కుటుంబసభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందని వారు ఆరోపించారు. మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులతో కర్మాగారం యాజమాన్యం చర్చలు జరిపింది. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని కర్మాగారం యాజమాన్యం హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



మృతిచెందిన నాగులు (ఫైల్)



కర్మాగారం వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబసభ్యులు, గ్రామస్తులు

రిక్షా కార్మికుడి తొడలో దూసుకెళ్లిన ఇనుపరాడ్డు



దుర్గా ప్రసాద్ తొడలోకి దూసుకుపోయిన ఇనుపరాడ్



లంకపల్లి జాతీయ రహదారిపై రిక్షాను ఢీ కొట్టిన కంటైనర్

ఘంటసాల (అవనిగడ్డ): రిక్షా బండిపై తిరుగుతూ రోడ్ల వెంబడి చెత్త సేకరిస్తూ జీవనం సాగించే ఓ వ్యక్తి తొడ భాగంలోకి ఇనుపరాడ్డు దూసుకెళ్లింది. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం లంకపల్లి గ్రామం వద్ద విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై రిక్షాను కంటైనర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చల్లపల్లి కోమలానగర్‌కు చెందిన ఆరిగి దుర్గాప్రసాద్ చెత్త సేకరిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం లంకపల్లి గ్రామంలో చెత్త సేకరించి రిక్షాపై చల్లపల్లి వైపు వస్తున్నాడు. మచిలీపట్నం నుంచి చల్లపల్లి వైపు వస్తున్న కంటైనర్ బలంగా ఢీకొనడంతో రిక్షా విరిగిపోయి కంటైనర్ చక్రాల్లో ఇరుక్కుపోగా, ఇనుపరాడ్డు దుర్గా ప్రసాద్ కుడికాలు తొడలో దూసుకెళ్లింది. ఈ సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. 108 ఈఎంటీ దుర్గా నాగేశ్వరరావు, పైలెట్ ఆంజనేయులు గాయపడిన రిక్షా కార్మికుడిని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించినట్లు తెలిపారు. దుర్గా ప్రసాద్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కంటైనర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గురువారం కొన్నిచోట్ల ఓ మోస్తరుగా, మరికొన్ని చోట్ల భారీగా వర్షం కురిసింది. రెండురోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వర్షాలకు ఎన్టీఆర్ జిల్లాలోని కట్టలేరు, వైరాయేరు, మున్నేర్లకు వరద నీరు వచ్చి చేరుతోంది. వర్షానికి గంపలగూడెం మండలం తోటమూల వద్ద కట్టలేరుపై కల్వర్టు దెబ్బతింది. దీంతో తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు కొనసాగిస్తున్నారు.

9.51మిల్లీమీటర్ల సగటు వర్షపాతం..

జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం 8.00 గంటల మధ్య 9.51 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చందర్లపాడు మండలంలో 32 మి.మీ వర్షపాతం నమోదైంది. కంచికచర్ల మండలంలో 22మి.మీ., ఇబ్రహీంపట్నంలో 21.6, వీరులపాడులో 15.6, విజయవాడ తూర్పులో 13.8, సెంట్రల్‌లో 13.0 , పశ్చిమలో 13.0, నార్త్‌లో 12.8, విజయవాడ రూరల్‌లో 12.4, నందిగామలో 11.8, తిరువూరులో 5.6, జి.కొండూరులో 3.8, పెనుగంచిప్రోలు, మైలవరంలో 3.4చొప్పున, జగ్గయ్యపేటలో 2.4, రెడ్డిగూడెంలో 2.0, విసన్నపేటలో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎన్‌బీ వాటర్ ట్యాంక్ ఫీడర్ పరిధిలో శ్రీనగర్ కాలనీ, నోవాటెల్ హోటల్ వెనుక రోడ్డు, సమోసా కంపెనీ ఏరియా, అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్, చందమామ హాస్పిటల్ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. శ్రీనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో న్యూ పీఅండ్ టీ కాలనీ, శ్రీనగర్ కాలనీ, విద్యుత్ కాలనీ, సాయిబాబా గుడి ఏరియా, ఎస్‌బీహెచ్ కాలనీలో, బెంజ్‌సర్కిల్ ఫీడర్ పరిధిలో పటమట ఎన్టీఆర్ సర్కిల్, భద్రయ్యనగర్, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, కేపీ నగర్, సాయిబాబా గుడి ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

కానిస్టేబుల్ కుటుంబానికి బీమా చెక్కు అందజేత



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేసిన మారెపోగు మోహనరావు ఈ ఏడాది మార్చి 28వ తేదీన రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీని నిమిత్తం యాక్సిస్ బ్యాంక్ నుంచి మంజూరైన రూ.64 లక్షల బీమా చెక్కును పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు మృతుడి కుటుంబ సభ్యులకు కమిషనరేట్ కార్యాలయంలో గురువారం అందజేశారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, కార్యాలయ ఏవో రంగారావు, ఏఆర్ ఏసీపీ కృష్ణంరాజు, పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగిని, యాక్సిస్ బ్యాంక్ సిబ్బంది మురళి, ప్రదీప్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

హిందూ వాహిని సంఘటన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అంజిబాబు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యర్రంశెట్టి అంజిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘటన్ జాతీయ అధ్యక్షుడు రమేష్ చంద్ర ద్వివేది నియామకపత్రం పంపారని అంజిబాబు గురువారం మీడియాకు తెలిపారు. తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు రమేష్ చంద్ర ద్వివేది, అయోధ్య ట్రస్ట్ చంపక్ రాయి రాష్ట్ర అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసులుకు కృతజ్ఞతలు చెప్పారు.

3న క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై వర్క్‌షాప్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన వచ్చే నెల 3వ తేదీన బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యాలయంలో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక జిల్లా – ఒక ఉత్పత్తి – ఒక క్లస్టర్ కార్యక్రమంలో భాగంగా ఒక్కో జిల్లా నుంచి కనీసం 20 మంది, గరిష్టంగా 100 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఒక క్లస్టర్ ను స్థాపిస్తామన్నారు. తద్వారా కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేసి, వారికి కావలసిన నైపుణ్యత, సాంకేతిక, మార్కెటింగ్ సహకారం అందిస్తామని చెప్పారు. ఈ క్లస్టర్‌కు రూ.5 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు బ్యాంకు రుణంతో సంబంధం లేకుండా నేరుగా కేంద్ర ప్రభుత్వం ద్వారా సహకారం అందిస్తామన్నారు. ఈ ప్రోగ్రామ్‌కు పొదుపు సంఘాలు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలతో పాటు స్టార్టప్ కంపెనీలు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో స్వయంగా కానీ 79959 15450, 63059 41717 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సదవకాశాన్ని రాష్ట్ర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

చెట్టు కొమ్మల తొలగింపు



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, పాలపర్తి వారి వీధిలో విరిగిపడిన చెట్టు కొమ్మను నగరపాలక సంస్థ ఉద్యానవన విభాగం సిబ్బంది గురువారం ఉదయం తొలగించారు. నగరంలో బుధవారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఒక్కసారిగా చెట్టు కొమ్మ విరిగిపోయి రోడ్డు మీద పడింది. కొమ్మ విద్యుత్ తీగల మీద పడడంతో స్థానిక గృహాల సర్వీస్ వైర్లు తెగిపోయి విద్యుత్ నిలిచిపోయింది. చెట్టు కొమ్మ రోడ్డు మీద అడ్డంగా పడడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడ్డారు. సమాచారం అందుకున్న ఉద్యానవన విభాగం సిబ్బంది అక్కడకు చేరుకుని చెట్టు కొమ్మను తొలగించారు.













శాకంబరీదేవి ఉత్సవాలకు సర్వం సిద్ధం

ఇంద్రకీలాద్రిపై శాకంబరీదేవి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. ఆలయ పరిసరాలను ఆకుకూరలు, కూరగాయల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. రైతులు, వ్యాపారుల నుంచి సేకరించిన కూరగాయలను ఆలయ, సేవా సిబ్బంది దండలు కట్టి, అలంకరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ఆరోగ్య కార్యదర్శులు డివిజన్లలో ఇంటింటికీ తిరిగి సీజనల్‌గా వచ్చేవ్యాధుల పట్ల నగరవాసులకు అవగాహన కల్పించాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఏ మహేష్ తెలిపారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం శ్రీనివాస నగర్, 16, 17, 18వ డివిజన్లు, రాణిగారితోట, 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు ప్రాంతాలలో పర్యటించి నగరంలో జరిగే పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. శ్రీనివాస నగర్ కాలనీలో పర్యటిస్తున్న సందర్భంలో ఆయనకు స్థానికంగా వర్షం, ఈదురుగాలుకు చెట్లు పడటం ద్వారా రాకపోకలకు అసౌకర్యం ఉండటంతో వెంటనే వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. రాణిగారితోట ప్రాంతంలో పర్యటించి అక్కడ రోడ్ల పైన నిలిచి ఉన్న వర్షపు నీటి నిల్వలను వెంటనే తొలగించాలన్నారు., వర్షం నీరు సైడు డ్రెయిన్లలో పారేలా చర్యలు తీసుకోవాలని, డ్రెయిన్లు లేని ప్రాంతాల్లో కచ్చ డ్రెయిన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో



డ్రెయిన్‌లో మురుగునీటి పారుదలను పరిశీలిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

స్థానికంగా రోడ్లపై తిరుగుతున్న ఆవులను చూసి వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని అజిత్‌సింగ్‌నగర్‌లో ఉన్న వీఎంసీ క్యాటిల్ షెడ్‌కు తరలించి, యజమానులకు జరిమానా విధించాలన్నారు. అనంతరం ఆయన 51వ డివిజన్ గొల్లపాలెం గట్టు ప్రాంత పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వీఎంసీ అకౌంట్స్ అధికారికి సన్మానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన కె.నరసింహమూర్తి స్టేట్ ఆడిట్ విభాగానికి బదిలీ అవ్వటంతో ఆయన గురువారం రిలీవ్ అయ్యారు. ఈసందర్భంగా వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయనకు సిబ్బంది సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఏ మహేష్, అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి నరసింహమూర్తి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వీఎంసీకి నూతనంగా వచ్చిన అకౌంట్స్ అధికారి బి.సత్యనారాయణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రామ్మోహనరావు, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు



నరసింహమూర్తిని సన్మానిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు అండగా ఉంటాం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో సంఘం అన్నివేళలా అండగా ఉంటుందని ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్ నందు గురువారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ సభ్యత్వం కల్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన ఎన్జీవో సంఘంలో వార్డు సచివాలయ ఉద్యోగులు నేటి నుంచి సభ్యులుగా కొనసాగడం సంతోషంగా ఉందన్నారు. తమ సంఘంలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరూ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కుటుంబంలో సభ్యులుగానే తాము భావిస్తున్నామని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఇకపై తాము కూడా పోరాటం చేస్తామన్నారు.



గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సభ్యత్వం ఇస్తున్న విద్యాసాగర్, నాయకులు

వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రాజుబాబు, నగర శాఖ అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్, నాయకులు నజీరుద్దీన్, రాజశేఖర్, వి.వి. ప్రసాద్, శ్రీనివాసరావు, శివలీల, శ్రీనివాస్, షేక్ ఖాసిం, కె.శివశంకర్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కె.గోపయ్య, మెహబూబ్, వి.సుజాత, సూర్యప్రభ, ఉద్యోగులు పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామివారి ఆలయం వద్ద దక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తికి పంచామృతాలతో అభిషేకాల అనంతరం విశేష అలంకరణ, పూజలను ఆలయ అర్చకులు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అర్చకులు మల్లేశ్వర శాస్త్రి, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞ నారాయణమూర్తి పాల్గొన్నారు.




పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న అర్చకులు

21న సిద్ధార్థలో గురు పౌర్ణమి వేడుకలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నగరంలోని పీబీ సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో ఈ నెల 21వ తేదీ ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ప్రతినిధి ఏ.కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ది బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా, విశిష్ట, ఆత్మీయ అతిథులుగా మాంటిస్సోరి కళాశాల సైకాలజీ అధ్యాపకుడు కోట కామేశ్వరరావు, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ తెలుగు పండింట్ డాక్టర్ చెరువు రాజరాజేశ్వరి పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి కె.ఎల్.యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పైడిపాటి ఉమానాథశర్మ అధ్యక్షత వహిస్తారని చెప్పారు.

గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా జరిగే సభలో ఆధ్యాత్మిక విశ్వగురువు, ది సైంటిఫిక్ సెయింట్ గురు విశ్వస్ఫూర్తి వారి ప్రవచనాలను తెలియజేస్తారని కిషోర్ చెప్పారు.



గురు పౌర్ణమి వేడుకలకు ముస్తాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీ (పాతది)లోగల సంకల్పసిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరం ద్వారకామయిని తలపిస్తుంది. ఈ నెల 21న గురు పౌర్ణమి సందర్భంగా నేటి నుంచి బాబా మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వేడుకలకు విద్యుత్ కాంతులతో ముస్తాబైంది. శుక్రవారం తెల్లవారు జామున 6 గంటల నుంచి ప్రారంభమయ్యే పూజా కార్యక్రమాల్లో భాగంగా నూతనంగా తయారు చేయించిన స్వర్ణ కిరీటాన్ని బాబా విగ్రహానికి అలంకరించనున్నారు. అలాగే 'ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి' అనే అఖండ సాయి నామ సంకీర్తన ప్రారంభమవుతుంది. ప్రతి రోజూ బాబాకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించనున్నారు. కాగా ప్రతి సాయిబాబా మందిరంలో అర్చకులు పూజాధికాలు చేస్తుండగా ఇక్కడ నేరుగా భక్తులే అభిషేకాలు చేయటం విశేషం. చివరి రోజు దాదాపు 10వేల మందికి అన్నప్రసాద వితరణ జరుగుతుంది.

రాణిగారితోటలో ఆక్రమణల తొలగింపు



కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోట 17వ డివిజన్‌లో ఆక్రమణలపై టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం కొరడా ఝుళిపించారు. డివిజన్‌లో వైట్ హౌస్ సెంటర్ నుంచి బాలాజీనగర్ డొంకరోడ్డు వరకు సిద్దెం కృష్ణారెడ్డి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో రోడ్డు కుంచించుకుపోయి నడిచేందుకు కూడా వీలు లేకుండా పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై వీఎంసీ అధికారులకు వరుస ఫిర్యాదులు వెళ్లడంతో ఆక్రమణ దళంతో అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఎవరైనా రోడ్డును ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. అదేవిధంగా సైడు కాలువల్లో మట్టి పేరుకుపోయి మురుగునీరు ముందుకు ప్రవహించకపోవడంతో పారిశుద్ధ్య సిబ్బంది సిల్టును తొలగించారు.

మహోన్నత నట శిఖరం ఎస్వీఆర్



విజయవాడ కల్చరల్: మహోన్నత నట శిఖరం ఎస్వీ రంగారావు అని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోనరావు కల్చరల్ ఆర్గనైజేషన్, ఎస్వీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద గురువారం సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు ఎస్వీఆర్ 50వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ.. ఎస్వీఆర్ నట జీవితంలో అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించినట్లు తెలిపారు. వరూధిని చిత్రంతో సినిమా రంగ ప్రవేశం చేసిన ఎస్వీఆర్ విభిన్నమైన పాత్రలను పోషించారన్నారు. ఎస్వీఆర్ నట జీవిత విశేషాలను కళామంజరి వ్యవస్థాపకుడు పీవీఎల్ నృసింహం వివరించారు. కార్యక్రమంలో చివుకుల హరగోపాల్, వివిధ రంగాలకు చెందిన మల్లెమూడి పిచ్చయ్య, కోలపల్లి గణేష్, ముత్యాల రామారావు, ఎస్.శ్రీనివాసరావు, మాంతి రమణారావు, గమిడి సాంబశివరావు, ప్రభుల శ్రీనివాసరావు పాల్గొన్నారు. నిర్వాహకులు ఎస్వీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పెద్ద సంఖ్యలో ఎస్వీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో నటుడు వరుణ్‌సందేశ్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను నటుడు వరుణ్‌సందేశ్ గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నటుడు వరుణ్‌సందేశ్‌ను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో కె.ఎస్.రామరావు అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఆటో ఢీ కొని బాలునికి గాయాలు

పాయకాపురం(విజయవాడరూరల్): ఆటో ఢీ కొని బాలునికి గాయమైన ఘటనపై గురువారం నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగంశెట్టి లక్ష్మీతులసి నున్నలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తోంది. ఈ నెల 17వ తేదీ రాత్రి లక్ష్మీ తులసి, ఆమె కుమారుడు షణ్ముఖ తారక్‌రామ్(3) అమెరికన్ ఆస్పత్రి వద్ద రోడ్డు దాటుతుండగా నూజివీడు వైపు నుంచి వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలుని తలకు గాయం కావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

పటమట(విజయవాడతూర్పు): చదువుకునే వయస్సులోనే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య అన్నారు. పటమట పోస్టల్ కాలనీలోని పాఠశాల ఆవరణలో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకరోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తోటి విద్యార్థులతో సమన్వయంగా వ్యవహరించటం, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవటానికి నిరంతరం సాధన చేయలన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలు నేర్చుకోవడంతో పాటు క్రమశిక్షణతో మెలగడానికి విద్యార్థి క్లబ్‌లు దోహదం చేస్తాయని చెప్పారు. విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థి నాయకుడు అంషాజ్ ఖాన్, విద్యార్థినుల నాయకురాలు రాధన సంస్కృతితో ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందు విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపాల్ తుషార, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థి నాయకులతో పాఠశాల ఉపాధ్యాయులు

రథ్ ఫెస్ట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇస్కాన్ ఆధ్వర్యంలో నగరంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జగన్నాథ్ రథ్ ఫెస్టివల్‌లో నిర్వహించిన పలు పోటీల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. ఉత్సవాల్లో భగవద్గీత శ్లోకాలు, సంగీత, సాహిత్య, నృత్య, క్విజ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్, ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టయిల్ పోటీలు నిర్వహించగా నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన వెయ్యి మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కాగా ఆ పోటీల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థులు వోకల్ మ్యూజిక్ జూనియర్, సీనియర్ విభాగాలతో పాటు, మ్యూజిక్ బ్యాండ్‌లలో మొదటి బహుమతులు పొందారన్నారు. సోలో డ్రామా, ఫ్యాన్సీ డ్రెస్ జూనియర్, సీనియర్ విభాగాల్లో, స్టోరీ రైటింగ్, క్విజ్, ఆర్ట్ విభాగాల్లో సైతం మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. క్లాసికల్ డ్యాన్స్ సోలో, స్టోరీ రైటింగ్, క్విజ్, సోలో సింగింగ్ విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలను ఆమె అభినందించారు. నలంద విద్యార్థుల ఆల్‌రౌండ్ ప్రతిభకు ఇది నిదర్శంగా పేర్కొన్నారు.



రథ్ ఫెస్ట్‌లో విజేతలుగా నిలిచిన నలంద విద్యార్థులు

జాబ్ ఫెస్ట్‌లో 39 మంది ఉద్యోగాలకు ఎంపిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్ ఫెస్ట్‌లో 39 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దివీస్ ల్యాబ్స్ కంపెనీ వారు ఇంటర్వ్యూలు నిర్వహించి, విద్యార్థులను ఎంపిక చేశారు. మొత్తం 200 మంది విద్యార్థులు జాబ్‌ఫెస్ట్‌కు హాజరయ్యారు. వీరిలో ఎంపికైన 39 మంది విద్యార్థులకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ నియామక పత్రాలు అందజేశారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్య పూర్తి చేసిన ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జేకేసీ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కో ఆర్డినేటర్ జి.విజయ్ దీప్, కళాశాల అధ్యాపకులు కె.వి.ఎస్ ప్రసాద్, షేక్ బీబీ, పి.సురేష్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జాబ్ ఫెస్ట్‌లో ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న న్యాయవాదులు


విజయవాడస్పోర్ట్స్: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి ఎ.సత్యానందం సూచించారు. బెజవాడ బార్ అసోసియేషన్, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యాన హెల్మెట్ ఆవశ్యకతపై విజయవాడలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి సత్యానందం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అత్యధికంగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకుండా బైక్‌లను నడిపే వారే ఎక్కువ సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. హెల్మెట్ ధరించడం చిన్న విషయం అని చాలా మంది విస్మరిస్తున్నారన్నారు. ఊహించని రీతిలో ప్రమాదాలు జరిగినపుడు హెల్మెట్ ప్రాణాలను రక్షిస్తుందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని హితవు పలికారు.

వన్ కే రన్ నిర్వహణ..

బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి మాట్లాడుతూ.. హెల్మెట్ ఆవశ్యకతపై పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని కోరారు. అనంతరం బెజవాడ బార్ అసోసియేషన్ నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం వరకు వన్ కే రన్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శేషయ్య, రాజశేఖర్, అఖిల భారత న్యాయవాదుల యూనియన్ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, బెజవాడ బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.శివరామప్రసాద్(రాజా), కోశాధికారి సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు పాల్గొన్నారు.

21న ఉచిత వైద్యశిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రకాష్ నగర్ సెంటర్ లహరి విద్యామందిర్‌లో ప్రజారోగ్య వేదిక, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఈనెల 21వ తేదీ ఆదివారం ఉచిత హెల్తీ రెగ్యులర్ మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు హెల్తీ విజయవాడ మెడికల్ క్యాంప్ కో ఆర్డినేటర్ జి.విజయ్ ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నేడు వరుసగా మూడుసార్లు ఎంపీగా ఎన్నికైన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని గురువారం ఆయన సొంత నియోజకవర్గంలోనే హత్య చేసేందుకు టీడీపీ గూండాలు బరితెగించారు. పక్కా పన్నాగంతో కత్తులు, రాళ్లు చేత బట్టి మాటు వేశారు. మూకుమ్మడిగా దాడిచేశారు. టీడీపీ రౌడీమూకలను వారించబోయిన మాజీ ఎంపీ రెడ్డప్పను బూతులు తిడుతూ దాడికి తెగబడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓ ఎంపీ ప్రాణాలకే రక్షణలేని పరిస్థితి.

మధ్య యుగాల్లో గజినీలు, ఘోరీలు దండెత్తి సృష్టించిన మారణహోమాన్ని రాష్ట్రంలో చంద్రబాబు రాక్షసపాలన గుర్తుకు తెస్తోంది. ఆధునిక కాలంలో యూదు జాతి మొత్తాన్ని తుదముట్టించాలని జర్మన్ నాజీ నియంత హిట్లర్ చేసిన ఘోరకలిని తలపిస్తూ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో పచ్చమూక మరణమృదంగం మోగిస్తోంది. 'నారా'సుర పాలన విశృంఖలత్వం సృష్టిస్తోంది. అధికారబలం ఉన్నవాడిదే అరాచకం... అన్న అడవినీతిని తలపిస్తూ యథేచ్ఛగా నరమేధం సాగిస్తోంది. హత్యలతో రాష్ట్రం అట్టుడికిపోతోంది. ప్రజాప్రతినిధుల నుంచి సామాన్యుల ప్రాణాలకు రక్షణ లేకుండాపోయింది. ప్రభుత్వ ఆస్తుల విధ్వంసకాండ కొనసాగుతోంది. ప్రైవేటు ఆస్తుల ధ్వంస రచన అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. పచ్చ మూకలు సభ్యులు రాష్ట్రంపై తెగబడి ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. ఇళ్లను ముట్టడిస్తున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను నేలమట్టం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయాలపై దండెత్తుతున్నారు. సచివాలయాలు, ఆర్బీకేలు, తాగునీటి ట్యాంకులు వంటి ప్రభుత్వ ఆస్తులను కూలగొడుతున్నారు. టీడీపీ అధికార మదానికి పోలీసు శాఖ దాసోహమైంది. ప్రభుత్వ ప్రేరేపిత దాడులు కావడంతో చేష్టలుడిగి చూస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలుతున్నాయి. గోడు వెళ్లబోసుకునేందుకు ఏ వ్యవస్థా అందుబాటులో లేకుండా పోయింది. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో రాజ్యాంగ ధర్మాన్ని కాలరాస్తోంది. టీడీపీ రెడ్‌బుక్ రాజ్యాంగ అరాచకమే రాజ్యమేలుతోంది. - సాక్షి, అమరావతి



నిన్న పల్నాడు జిల్లా వినుకొండలో నడిరోడ్డుపై వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌పై టీడీపీ గూండా జిలానీ కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. రెండు చేతులు తెగనరికాడు. అనంతరం కత్తితో మెడ నరికి పాశవికంగా హత్య చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఓ సామాన్యుడికి ప్రాణాలకు ఏమాత్రం రక్షణ లేదనడానికి తాజా తార్కాణం ఈ దురాగతం.

నారా రూప రాక్షసం

యథేచ్ఛగా నరమేధం

నాజీలను మరిపిస్తూ పచ్చమూకల పైశాచికం

40 రోజులుగా అడ్డూ అదుపులేని ఉన్మాదం



వినుకొండలో హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్

- గజినీలు, ఘోరీలను తలదన్నేరీతిలో దురాగతాలు
- వరుస హత్యలు... దాడులు...దౌర్జన్యాలు
- ఏకంగా 31 మంది హతం...
- 300 మందిపై హత్యాయత్నాలు.. 1,050 దాడులు...
- టీడీపీ రౌడీమూకల వేధింపులతో 35 మంది ఆత్మహత్య
- ప్రాణభయంతో స్వస్థలాలు వదిలివెళ్లిపోయిన 2,700 కుటుంబాలు
- ప్రజాప్రతినిధుల నుంచి సామాన్యుల వరకు రక్షణ కరువు
- యథేచ్ఛగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల విధ్వంసకాండ
- మీడియా స్వేచ్ఛకూ విఘాతం.. శాంతిభద్రతలు మృగ్యం

రెడ్‌బుక్ రాజ్యాంగానికి పోలీసుల గులాం



మంగళగిరి నియోజకవర్గంలో పాలేటి రాజ్‌కుమార్‌ను అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చోబెట్టి లోకేశ్ ఫ్లెక్సీకి క్షమాపణ చెప్పిస్తున్న టీడీపీ నాయకులు

హత్యలు **31**

హత్యాయత్నాలు **300**

కక్ష కట్టి కత్తివేటు...

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 40 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 31 మంది దారుణ హత్యకు గురయ్యారు. కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాథహళ్లిలో మాల గుండమ్మ అనే దళిత మహిళను ఆమె పొలంలోనే టీడీపీ నేత రాఘవేంద్రారెడ్డి, ఆయన కుమారుడు శ్రీధర్‌రెడ్డి దారుణంగా ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొప్పుగొండువానిపాలెంలో సురేష్ అనే ఉన్మాది 9వ తరగతి చదువుతున్న బాలికను కత్తితో పొడిచి హత్యచేశాడు. అదేవిధంగా హిందూపురం నియోజకవర్గం గోళపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత సతీష్... విజయనగరం జిల్లా సీతానగరం మండలం పెద్ద భోగిలే హడ్కో కాలనీలో గుజ్జల హేమంత్... శ్రీకాకుళం రెల్లివీధికి చెందిన నల్లపిల్లి గౌరీశంకర్.. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం కొర్లాం జాతీయ రహదారి సమీపంలోని ఓ దాబాలో రాంబాబు అనే వ్యక్తి... అనంతపురం జిల్లా కోమటికుంట్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎరికలయ్య.. విశాఖపట్నంలోని అగనంపూడిలో కిరణ్ అనే యువకుడు... బాపట్ల జిల్లా చీరాలలో ఓ వ్యాపారి... ఒంగోలులో ఓ యువకుడు... పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం మిట్టపల్లెలో హనిమిరెడ్డి, దాచేపల్లిలో గుమ్మడి నాగిరెడ్డి... ఇలా 40 రోజుల్లో 31 మంది హత్యకు గురయ్యారు. శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా ఐదు హత్యలు జరిగాయి. మరో 300 మందిపై హత్యాయత్నాలు జరిగాయి.



హోంమంత్రి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని కోట ఊరట్ల గ్రామంలో మహిళలపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు



వేమూరు నియోజకవర్గంలో టీడీపీ మూకలు తగలబెట్టిన వైఎస్సార్ విగ్రహం



కర్నూలు జిల్లా నాగనాథనహళ్లిలో టీడీపీ నేత రాఘవేంద్రారెడ్డి ట్రాక్టర్‌తో తొక్కించడంతో మృతిచెందిన మాల గుండమ్మ



మాల గుండమ్మకు మద్దతుగా వచ్చిన పురుషోత్తంరెడ్డిపై దాడి చేస్తున్న రాఘవేంద్రారెడ్డి



గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన రాజును తీవ్రంగా కొడుతున్న టీడీపీ శ్రేణులు



పులివెందులలో టీడీపీ గూండాల దాడిలో గాయపడిన వేంపల్లె అజయ్‌కుమార్‌రెడ్డి

భరించలేక.. బలవన్మరణాలు

ఆత్మహత్యలు **35**

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై మాత్రమే కాదు... చిరు వ్యాపారులు, చిన్నాచితక ఉద్యోగులు, సామాన్యులపై సైతం టీడీపీ నేతలు తమ ప్రతాపం చూపుతున్నారు. 'ఇక మా ప్రభుత్వం వచ్చింది.. మీరు తప్పుకోండి..' అంటూ బెదిరిస్తున్నారు. తమకు ఎదురు చెబితే తప్పుడు కేసులు పెట్టి కుళ్లబొడిపిస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో ఉపాధి కోల్పోతామని... పరువు పోతుందనే భయంతో తీవ్ర ఆవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. టీడీపీ నేతలు ఉద్యోగానికి రాజీనామా చేయాలని బెదిరించడంతో చిలకలూరిపేట నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ జడ ఆనంద్ పురుగులమందు తాగి చనిపోయాడు. పోలీసుల వేధింపులతో పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్ల ఉప సర్పంచ్ కోరుకుంట్ల నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్నారు. ఇలా 40 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 35మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. టీడీపీ నేతల వేధింపుల కారణంగా అత్యధికంగా వైఎస్సార్ జిల్లాలో 16 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇక శ్రీకాకుళం జిల్లాలో 11 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు.



పోలీసుల ఒత్తిళ్లతో ఆత్మహత్య చేసుకున్న పల్నాడు జిల్లా రెంటపాళ్ల ఉప సర్పంచ్ కోరుకుంట్ల నాగమల్లేశ్వరరావు

చిన్నారులనే కనికరం లేకుండా..

లైంగిక దాడులు **20**

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో లైంగికదాడులు ఘోరంగా జరుగుతున్నాయి. చిన్నారులు అనే కనికరం కూడా లేకుండా ఉన్మాదులు చెలరేగిపోతున్నారు. కేవలం 40 రోజుల్లోనే 20 మందిపై లైంగికదాడులు జరిగాయి. వారిలో నలుగురిని దుండగులు చంపేశారు. చీరాలలో జూన్ 21వ తేదీన ఓ చేనేత కుటుంబానికి చెందిన యువతి బహిర్భూమికి వెళ్లగా, ఆమెపై దుండగులు అత్యాచారం చేసి హతమార్చారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో పది రోజుల కిందట ఎనిమిదేళ్ల గిరిజన బాలికను దుండగులు అపహరించి అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ బాలిక ఆచూకీ ఇంతవరకు తెలియలేదు. అనంతపురం జిల్లా అరకటివేములలో టీడీపీ కార్యకర్త రవితేజ ఓ బాలికను జూన్ 24న అపహరించి తాడిపత్రి మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న వాహనంలోకి తీసుకువెళ్లి తన స్నేహితుడు నాగేంద్రతో కలిసి లైంగికదాడికి పాల్పడ్డారు. ఇలా వయసుతో సంబంధం లేకుండా 20 మందిపై లైంగిక దాడులు జరిగాయి. అదేవిధంగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం నవభారత్ జంక్షన్‌లో జూన్ 17న ఓ మహిళపై దాడి చేసి ఒళ్లంతా కారం చల్లి ఆటోలోకి బలవంతంగా ఎక్కించి శ్రీకాకుళం పట్టణంలోకి తీసుకువెళ్లి నడివీధిలో వివస్త్రను చేసి ఊరేగించారు. అనకాపల్లి జిల్లా దర్మసాగరంలో టీడీపీ వర్గీయులు కుమారి అనే మహిళ ఇంటికి వెళ్లి ఆమెను వివస్త్రను చేసి కొట్టారు. ఇవన్నీ అధికారిక లెక్కలు. కానీ ఫిర్యాదులు చేసేందుకు పలువురు బాధితులు వెనుకంజ వేస్తున్నారు. బాధితులు అందరూ ఫిర్యాదులు చేస్తే కేసుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.



బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ముచ్చుమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు



నూజివీడులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గిరీష్‌ని కత్తితో పొడుస్తున్న టీడీపీ కార్యకర్త నూకల సాయి అరుణ్



టీడీపీ శ్రేణుల దాడిలో తీవ్రంగా గాయపడిన ఎన్టీ ఆర్ జిల్లా అనిగండ్లపాడుకు చెందిన మౌనిక

పల్నాడు జిల్లా మంచికల్లు గ్రామంలో టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నందా అరుణ్‌కుమార్

అడ్డూ అదుపు లేకుండా దాడులు

టీడీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అడ్డూ అదుపు లేకుండా దాడులు కొనసాగుతున్నాయి. టీడీపీ అరాచకాలకు మంత్రి లోకేశ్ నియోజకవర్గం మంగళగిరి కేంద్ర బిందువుగా మారింది. పెదవడ్లపూడికి చెందిన పాలేటి రాజ్‌కుమార్‌ను లోకేశ్ అనుచరులు కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేశారు. మోకాళ్లపై కూర్చుని లోకేశ్ చిత్రపటానికి దండం పెడుతూ క్షమాపణలు చెప్పకపోతే హతమారుస్తామని హెచ్చరించారు. ప్రాణభయంతో రాజ్‌కుమార్ వారు చెప్పినట్టు చేశారు. దీన్ని టీడీపీ నేతలు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. లోకేశ్ నియోజకవర్గాన్ని ఆయన సొంత జిల్లా చిత్తూరు టీడీపీ నేతలు ఆదర్శంగా తీసుకున్నారు. చిత్తూరులో రాజు అనే యువకుడిని కిడ్నాప్ చేసి గుర్తుతెలియని ప్రాంతానికి తీసుకువెళ్లి కర్రలు, రాడ్లతో తీవ్రంగా దాడి చేశారు. ఆ దాడిని వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. వారికి తామేమీ తక్కువ కాదన్నట్లు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ అనుచరులు సైతం ఇటీవల ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి దారుణంగా కొట్టారు. విజయవాడలో టీడీపీ గూండాలు ఏకంగా కోర్టు ప్రాంగణంలోకి ప్రవేశించి మరీ మద్దెల పవన్ అనే వ్యక్తిపై బీరు సీసాలతో దాడి చేశారు. పల్నాడు జిల్లా శ్యామలాపురం మండలం వేల్చూరులోని ఎస్సీ కాలనీపై 50మందికి పైగా టీడీపీ గుండాలు దాడి చేశారు. ఇలా 40 రోజుల్లో 1,050 వరకు దాడులు, దౌర్జన్యాలు జరిగాయి.

దాడులు, దౌర్జన్యాలు 1,050









1. టీడీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడిన కాళిదాసు సత్యం(తెనాలి)
2. ఆళ్లగడ్డలో భూమా అఖిలప్రియ అనుచరులు కిడ్నాప్ చేసి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చాకలి శ్రీను
3. ఒంగోలులో వైఎస్సార్‌సీపీ బి. మురళిపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

అన్నమయ్య జిల్లా తిమ్మాపురంలో టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడిన యువకుడు విశ్వనాథ

ఇళ్లు నేలమట్టం.. కార్యాలయాలు ధ్వంసం

వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారనే అక్కసుతో పేదల ఇళ్లను నేలమట్టం చేస్తున్నారు. తిరుపతి జిల్లా రేణిగుంటలో 40మంది పేదల ఇళ్లను కూల్చివేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 16 జిల్లాల్లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాలపై దాడులకు తెగబడ్డారు. అనంతపురం జిల్లాలో చీనీ తోటలను నరికేస్తున్నారు. వైఎస్సార్, చిత్తూరు, తిరుపతి, అనంతరపురం, కర్నూలు, పల్నాడు జిల్లాల్లో టీడీపీ గుండాల దాడులతో స్వైర విహారం చేస్తున్నారు. ప్రధానంగా సర్పంచిలు, స్థానిక సంస్థల ప్రతినిధులను, వారి ఆస్తులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు. వాహనాలను దహనం చేస్తున్నారు. ఇలా 560 వరకు ప్రయివేట్ ఆస్తులను ధ్వంసం చేశారు. వీటిలో ఒక్క చిత్తూరు జిల్లాలో 100 ఘటనలు జరిగాయి.

ప్రైవేట్ ఆస్తుల ధ్వంసం 560



టీడీపీ నేతల ఒత్తిడితో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న అధికారులు

భయంతో బతకలేక.. వలసబాట

టీడీపీ రౌడీమూకలు దండెత్తుతుండటంతో సామాన్యులు ప్రాణభయంతో కన్నతల్లి వంటి సొంత ఊరును వదిలి వలసవెళ్లిపోతున్నారు. పొరుగు రాష్ట్రంతోపాటు అటవీ ప్రాంతాల్లో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. ఒక్క పల్నాడు జిల్లాలోనే 1,500 కుటుంబాలు తెలంగాణకు వెళ్లి తలదాచుకోవడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. చిత్తూరు జిల్లాలో దాదాపు 500 కుటుంబాలు, అనంతపురం జిల్లాలో 350 కుటుంబాలు, శ్రీసత్యసాయి జిల్లాల్లో 100, అన్నమయ్య జిల్లాలో 120 కుటుంబాలు, కర్నూలు జిల్లాలో 135 కుటుంబాలు తమ గ్రామాలను వదిలి వలసవెళ్లాయి. వలస వెళ్లిన కుటుంబాల పంటలను, ఆస్తులను సైతం టీడీపీ మూకలు ధ్వంసం చేస్తూ పైశాచికంగా ప్రవర్తిస్తున్నాయి. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు దాదాపు 2,700కుపైగా కుటుంబాలు ప్రాణభయంతో వలస వెళ్లాయి.

ఊరు వదిలి వెళ్లిన కుటుంబాలు 2,700 పైనే



చిత్తూరు జిల్లా కమ్మపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబం ఆకస్మికంగా ఊరు వదిలి వెళ్లడంతో వారి పొలంలోనే ఉండిపోయిన టమాటాలు

విగ్రహాలపైనా అక్కసు

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలపైనా టీడీపీ మూకలు తమ అక్కసు వెళ్లగక్కుతున్నాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో తమకు జరిగిన మేలును తలచుకుంటూ అన్ని అనుమతులతో ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటుచేసుకున్న విగ్రహాలను సైతం అడ్డగోలుగా కూల్చివేస్తున్నారు. పెట్రోల్ పోసి నిప్పు పెడుతున్నారు. వైఎస్సార్ విగ్రహాల చేతులు, కాళ్లు, తల, ముక్కు.. ఇలా ఒక్కో భాగాన్ని ముక్కలుముక్కలుగా చేసి తాలిబన్ల తరహాలో పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఇప్పటి వరకు అన్ని జిల్లాల్లో కలిపి 468 విగ్రహాల వరకు వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేశారు.

వైఎస్సార్ విగ్రహాలు ధ్వంసం 468



ఏలూరు జిల్లా కైకలూరు మండలం వడ్లకూటితిప్ప గ్రామంలో టీడీపీ శ్రేణులు కూల్చివేసిన వైఎస్సార్ విగ్రహం



చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలంలో వాటర్ ట్యాంక్‌ను జేసీబీతో కూల్చివేస్తున్న టీడీపీ నేతలు

ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం

ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం కొనసాగుతోంది. ప్రతి జిల్లాలో జూన్ 4వ తేదీ తర్వాత నిత్యం గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకేలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలపై పచ్చమురాలు దాడులు చేసి ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తద్వారా ఇక తమకు గ్రామాల్లో ఎదురు లేదని చాటుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అయినా పోలీసులు పట్టించుకోకపోవడంతో టీడీపీ నేతలు కేవలం 40 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 490 ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. తిరుపతి జిల్లాలో అత్యధికంగా 52 ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు.

ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం 490

జగన్ జాడ ఉండకూడదని..

దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా 2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే రాష్ట్రంలో 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటుచేశారు. వాటిలో 1,35,819 మంది ఉద్యోగులను, 2.66లక్షల మంది వలంటీర్లను నియమించారు. అన్ని ప్రభుత్వ సేవలను ప్రజలకు తమ ఇంటి వద్దకే చేర్చారు. ఆర్బీకేల ద్వారా రైతులకు విత్తు నుంచి పంట విక్రయం వరకు అన్ని సేవలను చేరువచేశారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రజలకు స్పెషాలిటీ వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చారు. నాడు–నేడు ద్వారా పాడుబడిన పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇలా పాలనలో సమూల మార్పులు తీసుకువచ్చి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించారు. ఈ క్రమంలో వైఎస్ జగన్ పాలన గురుతులను చెరిపివేసేందుకు టీడీపీ నేతలు, కార్యకర్తలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వంటి భవనాల వద్ద ఉన్న శిలాఫలకాలు, నవరత్నాలు బోర్డులను ఘోరంగా ధ్వంసం చేస్తున్నారు. రోడ్ల అభివృద్ధి శిలాఫలకాలను సైతం కూల్చేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 2,260 వరకు శిలాఫలకాలను నేలమట్టం చేశారు.

శిలాఫలకాలు ధ్వంసం 2,260



అనంతపురం జిల్లా కురువళ్లి గ్రామ సచివాలయంలో శిలాఫలకాన్ని గడ్డపారతో ధ్వంసం చేస్తున్న టీడీపీ శ్రేణులు

పత్రికా స్వేచ్ఛపైనా దాడి

టీడీపీ అరాచకాలతో రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ కూడా ప్రమాదంలో పడింది. ఎన్నికల హామీని టీడీపీ తుంగలో తొక్కి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు చంద్రబాబు ప్రభుత్వం మద్దతు ఇస్తున్న విషయాన్ని ప్రచురించిన డెక్కన్ క్రానికల్ పత్రిక కార్యాలయంపై టీడీపీ గూండాలు దాడికి తెగబడ్డారు. విశాఖపట్నంలోని డెక్కన్‌క్రానికల్ కార్యాలయం బోర్డులు తగలబెట్టి బీభత్సం సృష్టించారు. ఇక నుంచి ఎవరైనా తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే ఇలానే ఉంటుందనే తరహాలో హెచ్చరికలు జారీచేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లోనే ఆంధ్రప్రదేశ్‌లో పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో పడిందని జాతీయస్థాయిలో మీడియా సంస్థలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.



విశాఖపట్నంలో డెక్కన్ క్రానికల్ పత్రిక కార్యాలయంపై దాడి చేసి బోర్డును తగలబెడుతున్న టీడీపీ శ్రేణులు

రాణా.. తందానా!

బీఆర్ అంబేడ్కర్ అందించిన భారత రాజ్యాంగాన్ని పాటించాల్సిన పోలీసు శాఖ... లోకేశ్ విరచిత రెడ్‌బుక్ రాజ్యాంగానికి దాసోహమైంది. రెడ్‌బుక్ పేరిట రాష్ట్రంలో హోర్డింగులు పెట్టి మరీ దౌర్జన్యాలకు పాల్పడుతున్నా పోలీసు శాఖ కళ్లుండీ కబోదిగా వ్యవహరిస్తోంది. రెడ్‌బుక్ రాజ్యాంగానికి సెల్యూట్ చేస్తూ టీడీపీ అరాచకాలకు గొడుగుపడుతోంది. రాష్ట్రస్థాయిలో లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగం పేరిట అరాచకానికి తెరతీస్తే... నియోజకవర్గ స్థాయిలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు తలో రెడ్‌బుక్‌ను తెరపైకి తెచ్చి దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. తమ దౌర్జన్యాలకు అడ్డువస్తే పోలీసుల సంగతి తేలుస్తామని టీడీపీ ప్రభుత్వ పెద్దలు బహిరంగంగానే ప్రకటిస్తుండటం విభ్రాంతి కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఇప్పటికే పూర్తిగా అదుపు తప్పిన శాంతిభద్రతలు మున్ముందు మరింతగా దిగజారుతాయని మేధావులు, ప్రజాస్వామికవాదులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

గుడివాడలో కొడాలి నాని ఇంటిపై టీడీపీ కార్యకర్తలు కోడిగుడ్లు విసురుతుంటే చూస్తూ నిలుచున్న పోలీసులు





రాష్ట్రంలో అరాచక పాలన

చంద్రబాబు వల్లే ఏపీలో ఘోరాలు

- టీడీపీ గూండాలు చెలరేగిపోతున్నారు
- వైఎస్సార్‌సీపీ నాయకుల మండిపాటు
- వినుకొండలో రషీద్‌కు ఘన నివాళులు


మృతుడి కుటుంబసభ్యులను ఓదారుస్తున్న మర్రి రాజశేఖర్, కాసు మహేష్‌రెడ్డి తదితరులు


రషీద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మేయర్ తదితరులు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రోత్సాహం వల్లే టీడీపీ గూండాలు చెలరేగిపోయి..రాష్ట్రమంతటా రక్తపాతం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. శాంతిభద్రతలు క్షీణించి.. ప్రజలకు రక్షణ కరువైందన్నారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. పల్నాడు జిల్లా వినుకొండలో టీడీపీ గూండా చేతిలో ప్రాణాలు కోల్పోయిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌కు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు గురువారం నివాళులర్పించారు. రషీద్ కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నిందితుడు టీడీపీకి చెందిన వాడైనప్పటికీ సోషల్ మీడియాలో తమ పార్టీవాడు కాదంటూ టీడీపీ చేస్తోన్న అసత్య ప్రచారాన్ని వారు ఖండించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఇతర టీడీపీ నాయకులతో నిందితుడు సన్నిహితంగా దిగిన ఫొటోలను మీడియాకు చూపించారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు.

టీడీపీ నేతల అండతోనే రషీద్ హత్య: మర్రి రాజశేఖర్

వినుకొండ నడిబొడ్డున వందలాదిమంది చూస్తూండగా వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీ గూండా జిలానీ అత్యంత కిరాతకంగా కత్తితో నరికాడంటే రాష్ట్రంలోని పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ నేరాలన్నింటికీ చంద్రబాబే బాధ్యత వహించాలి. టీడీపీ ఎమ్మెల్యేల చెప్పినట్లుగా జిల్లా ఎస్పీని మార్చిన వెంటనే పల్నాడులో హత్యలు మొదలయ్యాయి. టీడీపీ నాయకుల అండదండలతోనే ఈ హత్య జరిగింది. పోలీసులు పక్షపాతం లేకుండా వ్యవహరించి బాధ్యులందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి.

హత్యా రాజకీయాలు మానుకోవాలి: గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

కూటమి పార్టీలు గెలిచినప్పటి నుంచి కేవలం నెల రోజుల్లోనే 31 హత్యలు జరిగాయి. పల్నాడు ప్రాంతంలో 1,500కు పైగా కుటుంబాలు గ్రామాలు విడిచి పెట్టి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వలస వెళ్లారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తుపెట్టుకోవాలి. హత్యారాజకీయాలను వెంటనే మానుకోవాలి. ఇప్పటికైనా హామీల అమలు మొదలుపెట్టి..ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు న్యాయం చేయాలి.

3 రేప్‌లు, 30 హత్యలుగా పాలన: కాసు మహేశ్‌రెడ్డి

ఏపీలో టీడీపీ ప్రభుత్వ పాలన 3 రేప్‌లు, 30 హత్యలుగా కొనసాగుతోంది. ప్రశాంతంగా ఉన్న వినుకొండలో మొహర్రం రోజున రషీద్ అనే యువకుడిని టీడీపీ గూండా హత్య చేశాడంటే..టీడీపీ పాలన ఎలా ఉందో ప్రజలకూ అర్థమవుతోంది. పట్టణంలో నడిరోడ్డు మీద అందరూ చూస్తుండగా రషీద్‌ను అత్యంత పాశవికంగా నరికి చంపడం దారుణం. కూటమి ప్రభుత్వం తమ మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడవేసి..రెడ్‌బుక్ పాలన కొనసాగిస్తోంది. మా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు రషీద్ కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పాం.

హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి: బొల్లా బ్రహ్మనాయుడు

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రోద్బలంతోనే జిలానీ అనే టీడీపీ గూండా నడిరోడ్డుపై వినుకొండలో అత్యంత దారుణంగా రషీద్‌ను హత్య చేశాడు. మృతుని కుటుంబానికి అండగా ఉంటాం.15 నుంచి 20 మంది యువకులు ముందుగానే రషీద్‌ను హత్య చేసేందుకు పథకం వేశారు. కేవలం ఒక యువకుడే వెంబడించి రషీద్‌ను రాక్షసత్వంగా చంపేశాడు. పోలీస్ శాఖ ఈ హత్యకు బాధ్యత వహించాలి. మృతుని కుటుంబానికి పార్టీ పరంగా ఆర్థికంగా భరోసా అందిస్తాం.

రావణకాష్టంలా.. రాష్ట్రం

- చంద్రబాబు రాజ్యంలో రెడ్‌బుక్ పాలన
- పవన్‌కళ్యాణ్ మౌనం వీడాలి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సాలూరు: హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలతో రాష్ట్రం రావణకాష్టంలా మారిందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆవేదన వ్యక్తంచేశారు. ఆటవిక అప్రజాస్వామిక 'రెడ్ బుక్' పాలనతో ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారని ధ్వజమెత్తారు. గిరిజన, దళిత మహిళలపై జరుగుతున్న రెడ్‌బుక్ దాడులు, హత్యాచారాలపై ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించక పోవడం శోచనీయమన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. దళితుడైన మాజీ ఎంపీ రెడ్డప్పరెడ్డిపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడుతున్నారని తెలిసి, అక్కడ ఏం జరుగుతుందోనని తెలుసుకునేందుకు వెళ్లిన సీనియర్ ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడికి ప్రయత్నించడం కూటమి పాలన దాష్టీకానికి నిదర్శనమని మండిపడ్డారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు, దాడులతో రాష్ట్రాన్ని మరో పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లా మారుస్తారన్న భయం ప్రజలను వెంటాడుతున్నదన్నారు. కర్నూలు జిల్లా ముచ్చుమర్రిలో గిరిజన బాలికను అత్యాచారం చేసి ఆపై హత్య చేశారని, నేటికీ మృతదేహం ఆచూకీ దొరకకపోవడం చంద్రబాబు అసమర్థ పాలనకు నిదర్శనమని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు రాష్ట్రపతి, గవర్నర్, ప్రధాన మంత్రి స్పందించాలని కోరారు. కూటమి ప్రభుత్వ దమనకాండ పై ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించాలని సూచించారు.

క్లుప్తంగా...

పల్నాట ఆగని టీడీపీ దౌర్జన్యకాండ

- కత్రలు, రాడ్లతో దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల బైక్‌లు ధ్వంసం


తల పగిలి గాయపడిన షేక్ మహ్మద్ రఫీ


గాయాలపాలైన పఠాన్ జిన్నా

నాదెండ్ల : టీడీపీ కార్యకర్తల దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. బాధితుడు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం అప్పాపురంలో బుధవారం టీడీపీ వర్గీయులు డీజేలు ఏర్పాటు చేశారు. రాత్రి 11 గంటల సమయంలో తీవ్రమైన డీజే శబ్దంతో హంగామా సృష్టించారు. రైస్‌మిల్లు బజారులోని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్ల వద్ద పెద్ద సౌండ్‌తో పాటలు పెట్టి, కొందరి ఇళ్ల తలుపులు, గేట్లను తన్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు షేక్ మహ్మద్ రఫీ ఇంటి ముందున్న వాహనాన్ని ధ్వంసం చేశారు. శబ్దానికి ఇంట్లో నిద్రిస్తున్న రఫీ బయటకు రావడంతో అతనిపై కత్రలు, రాడ్లతో దాడి చేశారు. రఫీ తల పగిలి తీవ్ర గాయమైంది. రఫీ ఇంటికి పక్కనే నివాసం ఉండే అతని బావ పఠాన్ జిన్నా.. దాడికి పాల్పడుతున్న వారిని అడ్డుకునేందుకు యత్నించగా, అతనిపైనా దాడికి తెగబడ్డారు. ఇద్దరినీ నరసరావుపేటలోని ఆస్పత్రికి తరలించారు. గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్‌నబీ, సుభానీ, మస్తాన్, రహమాన్‌లతో పాటు మరికొందరు కొందరు దాడికి పాల్పడ్డారని పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

కూటమి హయాంలో హత్యా రాజకీయాలు

- మాజీ ఎంపీ భరత్‌రామ్ ధ్వజం


మాట్లాడుతున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హత్యా రాజకీయాలు మొదలయ్యాయని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి తన సొంత నియోజకవర్గంలో పర్యటించేందుకు వెళితే టీడీపీ మూకలు దాడులకు పాల్పడటం దారుణమన్నారు. వినుకొండలో టీడీపీ కార్యకర్త వైఎస్సార్‌సీపీకి చెందిన ముస్లిం యువకుడిని నడిరోడ్డుపై కిరాతకంగా చంపటంతో రాష్ట్ర ప్రజలు ఉలిక్కిపడ్డారన్నారు. విశాఖలో జైలుకెళ్లిన ప్రేమోన్మాది బయటకు వచ్చి బాధితురాలు తల్లిపై దాడి చేశాడన్నారు. గడచిన 40 రోజుల్లో జరిగిన దాడులపై చంద్రబాబు శ్వేతపత్రం ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. వరుసల ఘటనలపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభమైన దృష్ట్యా నితీష్‌కుమార్ బిహార్‌కు ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తున్నారని, చంద్రబాబు ఎందుకు అడగటం లేదని నిలదీశారు. రాజమహేంద్రవరంలోని కంబాల చెరువు పార్కుకు టికెట్ తీసేస్తామని సిటీ ఎమ్మెల్యే గతంలో చెప్పారని, ఇప్పుడు ఆ విషయం పట్టించుకోవడం లేదన్నారు. ఉచిత ఇసుక పేరుతో టీడీపీ నాయకులు అక్రమార్జనకు పాల్పడుతున్నారని భరత్‌రామ్ ఆరోపించారు.

కూటమి ప్రభుత్వం వచ్చాకే దాడులు పెరిగాయి

ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగుల్‌మీరా ఆందోళన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, లైంగిక దాడులు పెరిగాయని ఆంధ్రప్రదేశ్ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై అఘాయిత్యాలు, సామాన్య ప్రజలపై దాడులు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇన్ని ఘోరాలు జరుగుతున్నా.. కనీసం బాధితులను పరామర్శించేందుకు, శాంతిభద్రతలపై సమీక్షించేందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనితకు మనసురావడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్షంలో ఉండగా సుగాలి ప్రీతి, హాజీరా, అబ్దుల్ సలాం... అని గొంతెత్తిన లోకేశ్, పవన్‌కల్యాణ్‌లు ఇప్పుడు ఎందుకు స్పందించడంలేదని ఆయన ప్రశ్నించారు. రషీద్‌ను హతమార్చిన నిందితులను తక్షణం అరెస్టు చేసి శిక్షించాలని, ఆ హత్య వెనుక ఎవరున్నారో విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

వినుకొండలో ఉద్రిక్తత


ఆస్పత్రి వద్ద మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

- ఆస్పత్రి వద్ద హైడ్రామా
- భారీగా మోహరించిన పోలీసులు
- మృతుడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ
- జిలానీతో పాటు మరో ఆరుగురిపై ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ దారుణ హత్యతో పల్నాడు జిల్లా వినుకొండలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హత్య గురించి తెలియగానే వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ బృందం వినుకొండ చేరుకుని రషీద్ కుటుంబ సభ్యులను ఓదార్చింది. వైఎస్ జగన్ గురువారం ఉదయం వినుకొండ రానున్నారు. రోడ్డు మార్గంలోంచి వినుకొండ చేరుకుని రషీద్ కుటుంబ సభ్యులను ఓదారుస్తారు. రషీద్ హత్య ఒక పథకం ప్రకారమే జరిగిందని అతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సుమారు 15 మంది వరకు రషీద్‌ను చంపడానికి పథకం వేశారు. రషీద్ ఎప్పుడు బయటకు వస్తాడు, ఎటు నుంచి వెళ్తాడన్న విషయాలు తెలుసుకుని ముండ్లమూరు సెంటర్‌లో నిఘా వేశారు. షాపు నుంచి వచ్చాక జిలానీ దారుణంగా కత్తితో నరికి చంపాడు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో పాటు ఈ హత్యలో నరసరావుపేటకు చెందిన సిద్దు, ఇమ్రాన్, జానీ, రఫీ, షఫీ, సాయిబాబాతో పాటు మరికొందరికి సంబంధం ఉందని రషీద్ బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రషీద్ కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా రషీద్ తల్లిదండ్రులు పడేషా, బడీబీలు తమ కుమారుడిని టీడీపీ నాయకులే పొట్టన పెట్టుకున్నారని, చంపొద్దని వేడుకున్నా.. దారుణంగా చంపేశారని నాయకుల వద్ద బోరున విలపించారు.

రషీద్ మృతదేహాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు

హత్యకు గురైన రషీద్ మృతదేహాన్ని సందర్శించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకోగానే భారీ సంఖ్యలో ఆస్పత్రి వద్ద పోలీసులు మోహరించారు. సుమారు 200 మందికి పైగా పోలీసులు ఆస్పత్రి చుట్టు పక్కల మోహరించారు. మృతదేహాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో వారిని చెదరగొట్టేందుకు వాటర్ క్యానన్‌లు ప్రయోగించేందుకు సిద్ధమయ్యారు. రషీద్ బంధువులు వంద మందికి పైగా మహిళలు రోడ్డుపై ఆందోళన చేసేందుకు వస్తుండగా.. పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు తమను లాఠీలతో కొట్టారంటూ ముస్లిం మహిళలు ఆందోళన చేపట్టారు. పట్టణంలో 144 సెక్షన్ ఉందని, ఎలాంటి బంద్‌లు, నిరసనలకు అనుమతి లేదనే పోలీసుల సూచనల మేరకు వారు ఆందోళన విరమించారు. మరోవైపు టీడీపీ నాయకులు ఈ హత్యను ఖండించకుండా జిలానీ కూడా వైఎస్సార్‌సీపీ వాడేనంటూ ప్రచారం మొదలెట్టారు. వాస్తవానికి జిలానీ ఏడాది క్రితమే తెలుగుదేశంలో చేరాడు. అతని సోదరుడు వినుకొండ పట్టణ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. గతంలో ఎప్పుడో జరిగిన వివాదాన్ని ఇప్పుడు హత్యకు సాకుగా తెలుగుదేశం నాయకులు, పోలీసులు చూపిస్తున్నారు. కాగా, రషీద్ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం పోలీసుల బందోబస్తు నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

వినుకొండ ఘటనను తప్పదారి పట్టించే కుట్ర

- చంద్రబాబు మార్కు కుతంత్రమిది
- హంతకుడు జిలానీ వైఎస్సార్‌సీపీ వర్గీయుడని దుష్ప్రచారం
- జిలానీ టీడీపీ నాయకుడేనన్న విషయం బట్టబయలు
- బెడిసికొట్టిన టీడీపీ పన్నాగం



టీడీపీ విజయోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు భార్యకు కేక్ తినిపిస్తున్న నిందితుడు జిలానీ, పక్కన టీడీపీ నేతలతో పసుపు కండువాతో జిలానీ

సాక్షి, అమరావతి: టీడీపీ నేతల అరాచకాలను ఇతరులపైకి నెట్టేసేందుకు సీఎం చంద్రబాబు ఎంతకైనా తెగిస్తారని మరోసారి వెల్లడైంది. పల్నాడు జిల్లా వినుకొండలో వైఎస్సార్‌సీపీ నేత షేక్ అబ్దుల్ రషీద్‌ను టీడీపీ నేత జిలానీ నడిరోడ్డుపై అత్యంత కిరాతకంగా హతమార్చిన ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన వెల్లువెత్తుతోంది. ప్రభుత్వ అండతో టీడీపీ నేతలు సాగిస్తున్న హత్యాకాండ జాతీయ స్థాయిలో దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజల్ని పక్కదారి పట్టించేందుకు చంద్రబాబు తనదైన శైలిలో కుతంత్రానికి తెరతీశారు. హంతకుడు జిలానీ అసలు టీడీపీ నాయకుడు కాదని.. వైఎస్సార్‌సీపీ వర్గీయుడనే దుష్ప్రచారాన్ని తెరపైకి తెచ్చారు. టీడీపీ సోషల్ మీడియా విభాగం ఐ–టీడీపీ వెంటనే రంగంలోకి దిగి మార్ఫింగ్ ఫొటోలను వైరల్ చేసింది. వైఎస్సార్‌సీపీ నేతలతో అతను ఉన్నట్టు ఫొటోలను మార్ఫింగ్ చేసి టీడీపీ ట్వీట్ చేసింది. కానీ.. టీడీపీ పన్నాగం బెడిసికొట్టింది. వినుకొండ నియోజకవర్గంలో టీడీపీ కార్యక్రమాల్లో జిలానీ క్రియాశీలంగా పాల్గొన్న ఫొటోలు, వీడియోలో వెలుగులోకి వచ్చాయి. టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తరఫున జిలానీ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాడు. టీడీపీ ప్రచార రథాన్ని అతనే నడిపాడు. టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు భార్య, కుటుంబ సభ్యులతోపాటు టీడీపీ విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. వాటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు వెలుగులోకి వచ్చాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిలానీ ఆగడాలకు అంతే లేకుండాపోయింది. పలువురిని బెదిరిస్తూ దందాలకు అతడు తెరతీశాడు. తనకు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మద్దతు ఉందని.. తనను ఎవరూ ఏమీ చేయలేరని చెబుతూ బెదిరింపులకు కూడా పాల్పడ్డాడు. దాంతో జిలానీ అసలు టీడీపీ వర్గీయుడే కాదంటూ ఆ పార్టీ నేతలు చేసిన దుష్ప్రచారం బెడిసికొట్టింది. హంతకుడు జిలానీ టీడీపీలో క్రియాశీల నేత అన్నది స్పష్టమైంది.

పాత గొడవలే రషీద్ హత్యకు కారణం

ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి


మీడియాతో మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు

వినుకొండ (నూజెండ్ల): పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన రషీద్ హత్యకు వ్యక్తిగత గొడవలే కారణమని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. గురువారం వినుకొండ పోలీసుస్టేషన్‌లో ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. హత్యకు గురైన రషీద్‌పై రెండు కేసులు, హత్య చేసిన జిలానీపై గతంలో మూడు కేసులు నమోదయ్యాయన్నారు. పాత గొడవల నేపథ్యంలోనే రషీద్‌పై జిలానీ కక్ష పెంచుకున్నాడని చెప్పారు. ఈ కారణంతోనే జిలానీ హత్య చేశాడన్నారు. పల్నాడు జిల్లాలో శాంతిభద్రతలను నెలకొల్పడమే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తోందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఎంతటివారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు

- మాజీ ఎంపీ చింతా అనురాధ ధ్వజం



అల్లవరం: కూటమి పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, ప్రజల భద్రతను గాలికి వదిలేసి.. వైఎస్సార్‌సీపీ కేడర్‌పై అరాచకాలు చేయడంపైనే దృష్టి సారించిందని అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ ధ్వజమెత్తారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్లమూరులోని తన నివాసంలో గురువారం ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే వందల సంఖ్యలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, హత్యలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. మహిళలపై అత్యాచారాలు చేస్తే అదే చివరి రోజు అవుతుందని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు, సాక్షాత్తూ మహిళ అయిన హోం మంత్రి అనిత, ఆడపడుచులకు సోదరుడినని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అనకాపల్లి, నంద్యాల, విజయనగరం, అనంతపురం, చిత్తూరు ఇలా ఎక్కడ చూసినా చిన్న పిల్లలు, మహిళలపై జరిగిన అత్యాచారాలపై ఏం చర్యలు తీసుకున్నారని సూటిగా ప్రశ్నించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా రాక్షసత్వం ప్రదర్శిస్తున్నారని, నిన్నటి పల్నాడు ఘటన వరకూ వైఎస్సార్ సీపీ క్యాడర్‌నే లక్ష్యంగా చేసుకుని పాశవిక దాడులు, హత్యలకు తెగబడుతున్న టీడీపీ గూండాలను కూటమి నేతలు ఎందుకు ఆపలేకపోతున్నారని నిలదీశారు.

మణిపూర్‌లా మండుతోంది



రెడ్ బుక్ అమలుతో ఆంధ్రప్రదేశ్ మరో మణిపూర్‌గా మండుతోంది. శాంతి భద్రతల్ని కాపాడేందుకు గవర్నర్ వెంటనే జోక్యం చేసుకోవాలి. నెలన్నర రోజులుగా రాష్ట్రంలో రాజకీయ ప్రత్యర్థులు, బలహీనులపై విద్వేషాలతో అధికార కూటమి గూండాలు వరుస దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. – ఈదర గోపీచంద్, అధ్యక్షుడు, గాంధీ స్మారక సమితి

టీడీపీ హత్యా రాజకీయాలను దేశమంతా చూస్తోంది



రాష్ట్రంలో టీడీపీ సాగిస్తున్న హత్యా రాజకీయాలను దేశమంతా చూస్తోంది. వినుకొండలో వైఎస్సార్‌సీపీ నేత దారుణ హత్య, పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డిపై రాళ్ల దాడి వంటి ఘటనలు టీడీపీ అరాచకాలకు పరాకాష్ట. టీడీపీ అధికారంలోకి వచ్చాక జరుగుతున్న ఘటనల్ని చూస్తుంటే మనం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నామా అని అనిపిస్తోంది.
– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి

రాష్ట్రంలో అరాచక పాలన



రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోంది. ఎక్కడ చూసినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అత్యంత దారుణంగా దాడులు జరుగుతున్నాయి. పల్నాడు జిల్లా వినుకొండలో రషీద్‌ను అత్యంత దారుణంగా నడిరోడ్డుపై హత్య చేయడం చూస్తుంటే చంద్రబాబు పాలన ఎంత దుర్మార్గంలో ఉందో అర్థమవుతోంది. – కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి

శాంతిభద్రతలు నిర్వీర్యం



కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు స్వేచ్ఛగా రోడ్లమీద తిరిగే పరిస్థితి లేదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై కూటమి నాయకులు, కార్యకర్తలు చేస్తున్న దమనకాండ రోజురోజుకూ మితిమీరుతోంది. దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలతో శాంతి భద్రతలు నిర్వీర్యమైపోయాయి. – గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి

టీడీపీ దాడులు, హత్యలు అమానుషం



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ కార్యకర్తలు దాడులు చేయడం, హత్యలకు పాల్పడటం అమానుషం. వినుకొండలో రషీద్ హత్య అత్యంత పాశవికచర్య. పుంగనూరులో ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్పపై దాడి హేయం. దేశంలో ఏ ఎంపీకి ఇలా జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై ఉంది. – మేడా రఘునాథ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు

ప్రజాస్వామ్యం అపహాస్యం



టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వరుసగా జరుగుతున్న హత్యలు, దాడులు, ఆస్తుల ధ్వంసం, కూల్చివేత ఘటనలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు లేవు. ముచ్చుమర్రిలో తొమ్మిదేళ్ల బాలిక అత్యాచారం, హత్యకు గురైతే ఇంతవరకు మృతదేహం కనుగొనకపోవడం దారుణం.
–జి.శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు



టీడీపీ అధికారంలోకి వచ్చాక జరుగుతున్న దాడులను ఎప్పుడూ చూడలేదు. ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలాంటి దుర్మార్గమైన చర్యలు జరగలేదు. టీడీపీ పాలకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. మారణకాండను సృష్టిస్తున్నారు. – ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే

తాలిబన్లను తలపిస్తున్నారు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు తాలిబన్లను తలపిస్తున్నారు. కేవలం నెల రోజుల్లో 1,050 దౌర్జన్యాలు, 300కు పైగా హత్యాయత్నాలు, 31 హత్యలు, వేధింపుల వల్ల 35 ఆత్మహత్యాయత్నాలతో సాగిన పాలనే దీనికి నిదర్శనం.
– తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే

ఎమర్జెన్సీని తలపిస్తోంది



ప్రస్తుత పరిస్థితులన్నీ ఎమర్జెన్సీని తలపిస్తున్నాయి. టీడీపీ రాక్షసకాండకు భయపడి 2,705 కుటుంబాలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయి. 560 చోట్ల ప్రైవేట్ ఆస్తులు, 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఈ దారుణ పరిస్థితులకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ మంత్రులంతా బాధ్యత వహించాలి. – కనుమూరు రవిచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి

రెడ్ బుక్ రాజకీయమే..



రాష్ట్రంలో హింసకు కారణం నారా లోకేశ్ రెడ్‌బుక్ రాజకీయమే. రషీద్‌ను అత్యంత కిరాతకంగా నరికి చంపితే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. ఈ ఘటన వ్యక్తిగత తగాదాల నేపథ్యంలో జరిగినట్టు చిత్రీకరించటం దుర్మార్గం.
– మేరాజోత్ హనుమంతు నాయక్, అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం



వంటిల్లు

చిటుక్కు పుటుక్కు రుచులు

చిటుకు పుటుకుమని వొలిచి తినే పల్లీలు వంటగదిలో మరింత రుచిగల పదార్థాలవుతాయి. అవి ఇవే...

పల్లీ పకోడీ

కావలసినవి: వేరు శనగపప్పు – పావు కిలో (పచ్చివి); శనగపిండి – 2 టేబుల్ స్పూన్‌లు; బియ్యప్పిండి– టేబుల్ స్పూన్; మొక్కజొన్న పిండి (కార్న్‌ఫ్లోర్)– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; చాట్ మసాలా పొడి– టీ స్పూన్; ఇంగువ – పావు టీ స్పూన్; నిమ్మరసం – టీ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; నీరు – పావు లీటరు (అవసరాన్ని బట్టి వేయాలి); నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● వేరుశనగపప్పును మెత్తటి వస్త్రంలో వేసి తుడవాలి. ఆ తర్వాత వాటిని ఒక పాత్రలో వేయాలి. అందులో శనగపిండి, బియ్యప్పిండి, మొక్కజొన్న పిండి, మిరప్పొడి, చాట్ మసాలా, ఇంగువ, ఉప్పు వేసి బాగా కలపాలి. ఇప్పుడు నిమ్మరసం వేసి మరోసారి సమంగా కలపాలి. ఇప్పుడు కొద్ది కొద్దిగా నీటిని వేస్తూ పిండి వేరుశనగపప్పుకు పట్టేటట్లు మిశ్రమాన్ని తడి పొడిగా కలుపుకోవాలి ● బాణలిలో నూనె వేడి చేయాలి. మరగడం మొదలైన తర్వాత మంట తగ్గించి వేరుశనగపప్పుల మిశ్రమాన్ని చేత్తో తీసుకుని వేళ్లను కదుపుతూ గింజలు విడివిడిగా పడేటట్లు జాగ్రత్తగా నూనెలో వదలాలి. నూనెలో కాలుతున్నప్పుడు చిల్లుల గరిటెతో కలియబెడుతూ లోపల గింజలో పచ్చిదనం పోయి దోరగా వేగే వరకు కాలనిచ్చి తీయాలి. ఇలా మొత్తం పప్పులను వేయించి ఒక పాత్రలో వేయాలి ● ఇప్పుడు అదే నూనెలో కరివేపాకులు వేసి చిటపటలాడిన తర్వాత తీసి పకోడీ మీద వేసి కలపాలి. ఈ పల్లీ పకోడీ మరీ వేడి ఉన్నప్పుడు తింటే రుచి తెలియదు. వేడి తగ్గిన తరవాత తినాలి. చల్లారిన తర్వాత గాలి దూరని డబ్బాలో నిల్వ చేస్తే వారం రోజులు తాజాగా ఉంటాయి.



పీ నట్ చాట్



కావలసినవి: వేరు శనగపప్పు – కప్పు (వేయించినవి); ఉల్లిపాయ – 1 (తరగాలి); టొమాటో – 1 (తరిగి గింజలు తొలగించాలి); కొత్తిమీర తరుగు – పావు కప్పు; నిమ్మరసం – టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్; చాట్ మసాలా– టీ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్; నూనె– 2 టీ స్పూన్‌లు.

తయారీ: ● బాణలిలో నూనె వేడి చేసి స్టవ్ ఆపేయాలి. నూనెలో మిరప్పొడి, చాట్ మసాలా, వేరు శనగపప్పు వేసి కలపాలి. పప్పు వేడెక్కిన తర్వాత ఒక పాత్రలోకి తీసుకుని ఉల్లిపాయ, టొమాటో ముక్కలు, కొత్తిమీర వేయాలి. చివరగా నిమ్మరసం చల్లి, ఉప్పు కలపాలి. ఇది అన్ని వయసుల వారికీ మంచి ఆహారం.



* జ్యువెలరీ

పచ్చని వేడుక

ఫ్యాషన్



వివాహ వేడుకలో పచ్చల హారాలు ధరించిన నీతా అంబానీ, ఈషా అంబానీ

వేడుకలలో పచ్చల హారాలు ధరించడం ఇప్పుడు బాగా ట్రెండ్‌లో ఉందని చాటడానికి ఇటీవల అంబానీ ఇంట జరిగిన పెళ్లి వేడుకనే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. నీతా అంబానీ సుమారు 500 కోట్ల ఖరీదైన విక్టోరియా పచ్చల హారం ధరించి అందరి దృష్టిని ఆకర్షించడమే కాదు, కాస్తంత అసూయనూ కలిగించింది. వధూవరుల నుంచి వివాహ వేడుకకు వచ్చిన తారలు ఐశ్వర్యరాయ్, అలియా భట్, ప్రియాంక చోప్రా ... వంటి అతిథులు కూడా పచ్చల హారాల్లో మెరిసిపోయారు. దీంతో 'పచ్చ' అత్యంత విలాసవంతమైన రత్నంగా వేడుకలకు కళను తీసుకు వస్తూనే ఉంటుంది. ఎమరాల్డ్‌గా పిలిచే ఈ రత్నం ఎంత పెద్దగా ఉంటే ధర కూడా అంత ఎక్కువగా ఉంటుంది.

ఇన్‌స్పైరింగ్ జ్యువెలరీ

సెలబ్రిటీలు ధరించిన లాంటి ఆభరణాలను అంతకన్నా చాలా తక్కువ ధరలో మార్కెట్లోకి డిజైనర్లు తీసుకువస్తున్నారు. అందుకని, ఒరిజనల్ పచ్చలతో ఉన్న హారాలను సామాన్యులు ధరించడం అసాధ్యం అని వెనకడుగు వేయనక్కర్లేదు. వాటి స్ఫూర్తితో జ్యువెలరీ రంగంలో ఇమిటేషన్ రత్నాలు పుట్టుకు వచ్చాయి. నాణ్యతను బట్టి ధరలలో మార్పులు ఉంటాయి. కోట్ల విలువైన రత్నాలను పోలి ఉండేవి వేలల్లో లభిస్తున్నాయి. వీటితో డైమండ్స్, కుందన్స్ కాంబినేషన్స్‌తో ఇతర ఇమిటేషన్ జ్యువెలరీ రూపుదిద్దుకుంటోంది.



రిచ్‌గా... దర్పంగా!

పచ్చల వరసల హారాలు కూడా వేడుకలలో దర్పాన్ని, హుందాతనాన్ని, రిచ్‌నెస్‌ను చూపుతుంటాయి. ఎరుపు, క్రీమ్, తెలుపు దుస్తుల మీద మరింత సొబగును తెచ్చే పచ్చల హారాలు వేడుకల్లో ప్రధానంగా ఆకట్టుకుంటాయి. ఇక ఆభరణాల జాబితాలో 'పచ్చ'ల హారం ఒకటి తప్పక చేర్చాల్సిందే, మహారాణి కళతో వెలిగిపోవాల్సిందే అనే ఆలోచన రాకుండా ఉండదు.

> పచ్చలను మొదటిసారిగా ఈజిప్టులో క్రీ.పూ. 330 ల కాలంలో తవ్వకాలలో గుర్తించినట్టు తెలుస్తోంది. ప్రపంచంలోని అత్యంత విలువైన రత్నాలలో పచ్చలు అగ్రస్థానంలో ఉన్నాయి.

ఫ్యాషన్ - ఆర్ట్

ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్ అద్భుతమైన కలయికతో రూపుదిద్దుకున్న వెడ్డింగ్ లెహంగా డ్రెస్ ఇది. అనంత్ అంబానీతో రాధికా మర్చంట్ వివాహం కోసం ఆర్టిస్ట్ జయశ్రీ బర్మన్ డిజైనర్ ద్వయం అబు జానీ సందీప్ ఖోస్లాతో కలిసి ఈ చిత్రకళ లెహంగాను రూపొందించారు.

జయశ్రీ బర్మన్ ఢిల్లీలోని తన స్టూడియోలో 'ఒక నెల మొత్తం ఈ లెహంగా ఫ్యాబ్రిక్‌పై పెయింటింగ్ చేయడానికి వెచ్చించింది. 'అనంత్–రాధికల కలయికకు ప్రతీకగా ఖగోళ మానవ బొమ్మలు, జంతుజాలం, ముఖ్యంగా ఏనుగులపై అనంత్‌కు ఉన్న ప్రేమను చూపేలా ఈ సృజనాత్మక కళ రూపుదిద్దుకుంది' అని వివరించే బర్మన్ రోజుకు 15–16 గంటల సమయాన్ని ఈ ఆర్ట్‌వర్క్‌కు కేటాయించినట్టుగా వివరిస్తోంది.

కోల్‌కతాలో జన్మించిన జయశ్రీ బర్మన్ ఇండియన్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు. పెయింటింగ్‌లో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ, ప్యారిస్‌లో ప్రింట్ మేకింగ్ కోర్సు చేసిన బర్మన్ తన పెయింటింగ్ ద్వారా పౌరాణిక కథలను కళ్లకు కడతారు. ఆర్టిస్ట్‌గానే కాదు, రచయిత్రిగానూ జాతీయ అవార్డులు అందుకున్న ఘనత బర్మన్‌ది.



జయశ్రీ బర్మన్



జయశ్రీ బర్మన్ చిత్రించిన లెహంగాను వివాహ వేడుకలో ధరించిన రాధికా మర్చంట్



భద్రాచలం టెంపుల్ పెయింట్ వేస్తూ...



స్వర్ణగిరి టెంపుల్ పెయింటింగ్ వేస్తున్న లావణ్య

గుడిని గుడికి కానుకగా ఇస్తే ఎంత బాగుంటుంది? తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నామోజు లావణ్య దేశంలోని ఆలయాలకు వెళ్లి అక్కడి ఆధ్యాత్మికతను, గుడి ప్రాంగణాన్ని, ఆలయ గోపురాలను లైవ్ పెయింటింగ్ చేసి ఆ చిత్రాలను గుడికే బహుమానంగా ఇస్తోంది. దీని వల్ల గుడి రూపం చిత్రకళలో నిలుస్తోంది. అలాగే గుడికి వచ్చే భక్తులకు ఆలయ సౌందర్యాన్ని తెలియచేస్తుంది.

ఆలయ చిత్రం

'ప్రతి ముఖ్యమైన గుడిలో నా చిత్రం ఉండాలి. అలాగే మరుగున పడిన గుడి నా చిత్రకళ ద్వారా కాస్తయినా ప్రచారం పొందాలని ఆలయ చిత్రాలను లైవ్ పెయింటింగ్ ద్వారా నిక్షిప్తం చేస్తున్నాను. ఇందుకు వస్తున్న ఆదరణ ఆనందం కలిగిస్తోంది' అంది పాతికేళ్ల నామోజు లావణ్య. 'ఇందుకు నా పెయింటింగ్స్ అమ్మకాల వల్ల వచ్చే డబ్బునే ఉపయోగిస్తున్నాను ఇటీవల భద్రాచల ఆలయంలోని సీతారాముల వారి మూర్తులు, ఆలయం లైవ్ పెయింటింగ్ చేసి దేవస్థానానికి అందజేశాను' అందామె. ఒకరకంగా ఇది ఆధ్యాత్మిక చిత్రకళా సాధన అని కూడా అనుకోవచ్చు.

మన సంస్కృతి కోసం

'మాది యాదాద్రి భువనగిరి. కామర్స్‌తో డిగ్రీ పూర్తి చేశాను. పోటీ పరీక్షలకు హాజరై, ఉద్యోగం తెచ్చుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నాను. కానీ నా ఇష్టం మొత్తం పెయింటింగ్స్ మీదే ఉంది. దీంతో ఏడాది నుంచి పెయింటింగ్‌నే నా వృత్తిగా మార్చుకున్నాను. స్కూల్ ఏజ్ నుంచి నోట్ బుక్స్‌లో పెయింటింగ్స్ వేస్తుండే దాన్ని. పాశ్చాత్య సంస్కృతి పెరుగుతున్న ఈ కాలంలో సోషల్‌మీడియా ద్వారా మన సంస్కృతిని, మంచిని కూడా పరిచయం చేయవచ్చు అనిపించి సంవత్సరం నుంచి ఆలయ శిల్పాన్ని, హైందవ సంస్కృతిని నా ఆర్ట్ ద్వారా చూపుతున్నాను'.



మెదక్ జిల్లాలో మరిపడ దగ్గరలో రాక్ స్టోన్స్‌పై చేసిన పెయింటింగ్స్



రాక్ స్టోన్స్ పై జంతువులు

'మెదక్ జిల్లా మరపడ దగ్గర ఒక వెంచర్ వాళ్లు ఆర్ట్‌కు సంబంధించిన విషయం మాట్లాడటానికి పిలిస్తే నేను, మా అంకుల్ శ్రీనివాస్ వెళ్లాం. అక్కడ ఒక గ్రామ దేవత టెంపుల్ చుట్టూ ఉన్న పెద్ద పెద్ద రాళ్లను చూశాక వాటిని ఆకారాలుగా చూపవచ్చనిపించింది. మొత్తం 42 రకాల పెద్ద పెద్ద రాక్ స్టోన్స్ ఉన్నాయి. వాటిని ఏనుగులు, ఆవులు, కోతులు, తాబేలు, కొలనుగా రంగులద్ది మార్చాను. మొన్నటి మే నెల ఎండలో వేసిన పెయింటింగ్స్. అక్కడికి వచ్చినవాళ్లు 'ఆడపిల్ల అంత పెద్ద రాళ్లు ఎక్కి ఏం పెయింటింగ్స్ వేస్తుంది' అన్నారు. కానీ అవి పూర్తయ్యాక చాలా సంతోషించారు' అంది లావణ్య.

వెడ్డింగ్ లైవ్ ఆర్ట్

'వివాహవేడుక జరుగుతుండగా ఆ సన్నివేశం, సందర్భం చూడటానికి చాలా బాగుంటుంది. లైవ్ ఆర్టిస్టును అని తెలియడంతో గత పెళ్లిళ్ల సీజన్‌లో వివాహం జరుగుతుండగా ఆ సీన్ మొత్తం పెయింటింగ్ చేసే అవకాశం వచ్చింది. చాలా ఆనందంగా ఆ కార్యక్రమాన్ని కళ్లకు కట్టినట్టుగా చిత్రించి, ఇచ్చాను. కాలేజీ రోజుల్లోనే తొమ్మిది నెలల పాటు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నాను. యువతకు మోటివేషనల్ స్పీచ్‌లు ఇస్తుంటాను. షీ టీమ్ వారు 'షీ ఫర్ హర్' అవార్డు ఇచ్చారు. నాన్న సురేందర్ కరోనా సమయంలో చనిపోయారు. అమ్మ గృహిణి. తమ్ముడు శివప్రసాద్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో వర్క్ చేస్తున్నాడు. గ్రామీణ నేపథ్యం గల కుటుంబమే మాది. నా కళకు సపోర్ట్ చేసేవారుంటే మరెన్నో విజయాలు అందుకోవచ్చు' అంటూ తెలిపింది ఈ హార్టిస్ట్.

– నిర్మలారెడ్డి



● డిస్‌మార్ఫియా

అందంగా లేనా? అస్సలేం బాలేనా?

ప్రసిద్ధ దర్శకుడు కరణ్ జోహార్ తాను 'డిస్‌మార్ఫియా డిజార్డర్'తో బాధ పడుతున్నానని తెలిపాడు. శరీరంలోని ఏదో ఒక అవయవం పట్ల వ్యక్తిలో తీవ్రమైన అసంతృప్తి ఉండి అది సరిగా లేదని పదే పదే బాధపడటమే ఈ డిజార్డర్. యువతీ యువకుల్లో టీనేజీ కాలంలో ఇది పొడుకుంటే ముున్ముందు వారు సామాజిక జీవితంలో ఇబ్బందిపడాల్సి ఉంటుంది. తగిన కౌన్సెలింగ్‌తో దీని నుంచి బయటపడొచ్చు.

ఒక సైకియాట్రిస్ట్ దగ్గరకు ఒక టీనేజ్ అమ్మాయి వచ్చింది. ఆ అమ్మాయి చూడటానికి అందరూ భావించేటట్టుగా 'అందం'గా ఉంది. చర్మం రంగు, రూపం, హైట్ అన్నీ బాగున్నాయి. కాని ఆ అమ్మాయికి 'నా ముక్కు బాగా లేదు' అని సందేహం, అనుమానం, అదే నిజం అనిపించే అబ్సెషన్. ఆ ముక్కును ఎలా అందంగా చేయించాలి అనేదే ఆమె సమస్య. 'కాదు నీ ముక్కు చక్కగా ఉంది. నువ్వు అనుకున్నంత లోపం ఏ మాత్రం లేదు' అని వీరికి చెప్తే ఒక నిమిషం తెరిపిన పడతారు. మరో నిమిషంలోనే ఆ అనుమానం పెనుభూతంలా ముందుకొస్తుంది. ఈ రుగ్మతను 'బాడీ డిస్‌మార్ఫియా డిజార్డర్' అంటారు. ఇది అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్‌లో ఒక కోవ కిందకు వస్తుంది. ఇది ఉన్నట్టుగా చాలామందికి తెలియదు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో దర్శకుడు కరణ్ జోహార్ దీని గురించి మాట్లాడి తాను ఆ డిజార్డర్‌తో బాధపడుతున్నట్టు చెప్పాడు. 'అందుకే నేను లూజ్ బట్టలు ధరిస్తాను' అని తెలిపాడు.

మైఖేల్ జాక్సన్ కూడా

డిస్‌మార్ఫియా డిజార్డర్‌తో బాధపడిన వాళ్లలో మైఖేల్ జాక్సన్ ఒకడు. అతనికి తన ముక్కు నచ్చలేదు. దాని వల్ల లెక్కకు మించి ప్లాస్టిక్ సర్జరీలు చేసి చివరకు ప్లాస్టిక్ ముక్కు అంటించాల్సి వచ్చింది. మగవారికి తమ జుట్టు, కళ్లు, భుజాలు, పురుషాంగం, పిరుదులు... వీటిలో ఏదో ఒకటి అస్సలు బాగలేదనే భావన బాల్యంలోనో టీనేజీలోనో స్థిరపడిపోతుంది. ఆడవాళ్లకు తమ కళ్లు, ముక్కు, పెదవులు, ఒంటి రంగు... వీటిలో ఏదో ఒక అవయవం గురించి అసంతృప్తి ఏర్పడుతుంది. నిజానికి లోకంలో ఎవరూ చెక్కినట్టుగా ఉండరు. ప్రతి ఒక్కరూ ఎలా ఉన్నా తమదైన రూపంతో బాగానే ఉంటారు. అయితే డిస్‌మార్ఫియా డిజార్డర్‌లో చూడటానికి మెరుగ్గా ఉన్నా, అంతపెద్ద లోపం ఏదీ లేకపోయినా వారి మైండ్ 'నీ ఫలానా అంగం ఏం బాగ లేదు బాగలేదు' అని చెప్తూ ఉంటుంది.

మిర్రర్ చెకింగ్

ఈ డిజార్డర్‌తో బాధపడేవాళ్లు తమకు లోపం ఉందని భావిస్తూ బట్టలతో, ఆభరణాలతో దానిని కవర్ చేసుకుంటున్నామని అనుకుంటూనే పదే పదే అద్దంలో చూసుకుంటూ ఉంటారు. లేదా ఎదుటివారిని 'బాగున్నానా బాగలేనా?' అని అడుగుతూ విసిగిస్తూ ఉంటారు. 'బాగున్నావ్' అన్నా నమ్మరు. ప్లాస్టిక్ సర్జరీ, కాస్మటిక్ సర్జరీలు చేయించుకున్నా వీరికి సంతృప్తి కలగదు. ఎందుకు? సమస్య మైండ్‌లో ఉంది కాబట్టి. ఈ సమస్య ఉన్నవారు కాలక్రమంలో నలుగురినీ కలవని స్థితికి చేరుకుంటారు.

కౌన్సెలింగ్

డిస్‌మార్ఫియా డిజార్డర్‌తో బాధ పడేవారు ముందు చేయవలసిన పని తమ యథాతథ రూపాన్ని యాక్సెప్ట్ చేయడం. 'నేను నా రూపాన్ని సంపూర్ణంగా అంగీకరిస్తున్నాను' అని పదే పదే చెప్పుకుంటే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. లేదా సైకియాట్రిస్టులను కలిస్తే వారు కౌన్సెలింగ్‌తో సమస్యను దూరం చేస్తారు. లేదా మరీ పదే పదే అందుకు సంబంధించి నెగెటివ్ థాట్స్ వస్తుంటే మందులతో చికిత్స చేస్తారు. ప్రకృతిలో ప్రతి ప్రాణి భిన్నమైన రూపాలతో ఉంటారని తెలుసుకుంటే శారీరక లోపాలకు సంబంధించిన ఇలాంటి రుగ్మతలు దరి చేరవు.



కరణ్ జోహార్

హెల్త్ ఫ్యాక్ట్

మోకాళ్ల నొప్పుల నివారణ ఇలా



ఆర్థరైటిస్ కారణంగా మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు తాము వాకింగ్ చేస్తే తమ మోకాళ్లు మరింతగా అరిగిపోతాయని అపోహపడుతుంటారు. ఇది వాస్తవం కాదు. నిజానికి మోకాళ్ల కదలికలు ఎంత ఎక్కువగా ఉంటే అక్కడ అంత బాగా రక్తప్రసరణ అవుతుంటుంది. దాంతో కీళ్లకు పోషకాలు బాగా అందడమే కాకుండా కండరాలూ, ఎముకలు బాగా బలపడతాయి. ఆర్థరైటిస్‌తో బాధపడేవారే కాకుండా, మధ్యవయసుకు వచ్చిన ఆరోగ్యవంతులందరూ వెంటనే వాకింగ్ మొదలుపెట్టడం మంచిది. సైక్లింగ్ వల్ల మోకాళ్లు మరింత అరుగుతాయనుకుంటారు కానీ ఒంటి బరువు పడకపోవడంతో సైక్లింగ్ కూడా మంచిదే. శరీరం బరువు మోకాళ్ల మీదా, తమ కాళ్ల మీద పడదు కాబట్టి స్విమ్మింగ్ కూడా మంచి ఎక్సర్‌సైజ్. పైగా స్విమ్మింగ్‌లో కేవలం మోకాళ్లకే కాకుండా ఒంటికంతటికీ మంచి వ్యాయామం సమకూరుతుంది.

సరికొత్త రికార్డు


● ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర పాత్రలు పోషించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా జూన్ 27న విడుదలైంది. కాగా 'బుక్ మై షో'లో అత్యధిక టికెట్లు బుక్ అయిన ఇండియన్ సినిమాగా 'కల్కి 2898 ఏడీ' సరికొత్త రికార్డు సృష్టించినట్లు మేకర్స్ పేర్కొన్నారు. ''12.15 మిలియన్+టిక్కెట్ సేల్స్ (దాదాపు కోటీ 20 లక్షలు)తో 'బుక్ మై షో'లో హయ్యస్ట్ సేల్స్ మూవీగా 'కల్కి 2898 ఏడీ' నిలిచింది. షారుక్ ఖాన్ నటించిన 'జవాన్' సినిమా 12.01 మిలియన్ల టిక్కెట్ సేల్స్ రికార్డును సాధించింది. 'కల్కి 2898 ఏడీ' విడుదలైన కేవలం 20 రోజుల్లోనే 'జవాన్' రికార్డును దాటింది. వీకెండ్‌తో పాటు వీక్ డేస్‌లోనూ మా సినిమా వసూళ్లు చాలా స్టడీగా ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



రెడీ... సెట్... గో


● అల్లు అర్జున్

అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'పుష్ప: ది రూల్'. ఈ చిత్రం తాజా షెడ్యూల్ షూటింగ్‌కి రెడీ సెట్ గో అంటున్నారు మేకర్స్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'పుష్ప: ది రైజ్' (2021) వంటి బ్లాక్‌బస్టర్ మూవీకి సీక్వెల్‌గా సేమ్ కాంబినేషన్‌లో 'పుష్ప: ది రూల్' రూపొందుతోంది. షెడ్యూల్ ప్రకారం చిత్రీకరణ పూర్తి అయ్యుంటే ఆగస్టు 15న ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. అయితే షూటింగ్ సకాలంలో పూర్తి కాకపోవడం.. క్వాలిటీ విషయంలో చిత్రయూనిట్ రాజీ పడకపోవడంతో ఈ మూవీని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక తాజా షెడ్యూల్ విషయానికి వస్తే.. ఈ నెల 22 లేదా 25న ప్రారంభం అవుతుందట. ఈ నెల 28 నుంచి అల్లు అర్జున్ కూడా చిత్రీకరణలో పాల్గొంటారని సమాచారం. శరవేగంగా చిత్రీకరణ, పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి, డిసెంబరు 6నే సినిమాని విడుదల చేయాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారని భోగట్టా.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే చిత్రాలు చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ఫ్రీలాన్స్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



యాక్షన్ సినిమా అంటే పూర్తిగా యాక్షనే కాదు కామెడీతో కూడిన యాక్షన్ చిత్రాలు ఇదివరలో మనం చాలానే చూశాం. అదే కోవలో విడుదలైన హాలీవుడ్ చిత్రం 'ఫ్రీలాన్స్' ప్రైమ్ వీడియో ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతోంది. జాన్ సెనా వంటి సీరియస్ యాక్షన్ కథానాయకుడు నటించిన చిత్రం ఈ 'ఫ్రీలాన్స్'. ఈ చిత్రకథలో కథానాయకుడు ఒకప్పుడు ఆర్మీలో పని చేసి ఓ వ్యక్తి చేసిన తప్పిదానికి ఆర్మీ నుండి అనుకోకుండా సస్పెండ్ అవుతాడు. కొంతకాలం తరువాత తన స్నేహితుడి ద్వారా అతనికి ప్రైవేట్ ఆర్మీలో పని చేసే అవకాశం లభిస్తుంది. ఆ ప్రైవేట్ ఆర్మీ మొదటి ఆపరేషన్ ఓ మహిళా జర్నలిస్టుకి బాడీగార్డ్‌గా వ్యవహరించడం. ఆ జర్నలిస్టు ఓ దేశాధిపతిని ఇంటర్వ్యూ చేయడానికి వెళ్ళే తరుణంలో కథానాయకుడిని బాడీగార్డ్‌గా తీసుకువెళుతుంది. అక్కడ ఆ దేశాధిపతి మీద దాడి జరుగుతుంది. ఆ దాడిని కథానాయకుడు ఎలా ఎదుర్కొన్నాడు? జర్నలిస్ట్‌ను ఎలా రక్షించాడు? అనేది ఓటీటీ తెర మీద చూడాల్సిందే. ఈ కథ కాన్సెప్ట్ సీరియస్ అయినా స్క్రీన్‌ప్లే మాత్రం హాస్యభరితంగా ఉంటుంది. పియర్ మొరెల్ దర్శకత్వంలో రూపొందిన ఈ 'ఫ్రీలాన్స్' వీకెండ్ వ్యూవర్స్‌కు మస్ట్ వాచ్ అని చెప్పొచ్చు.

– ఇంటూరి హరికృష్ణ

దీపావళికి రాకీ


● విశ్వక్ సేన్


దీపావళికి థియేటర్స్‌కు వస్తున్నాడు మెకానిక్ రాకీ. విశ్వక్ సేన్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న యాక్షన్ చిత్రం ఇది. ఈ చిత్రాన్ని అక్టోబరు 31న దీపావళి సందర్భంగా విడుదల చేయనున్నట్లుగా గురువారం ప్రకటించి, విశ్వక్ కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు మేకర్స్. కామెడీ, యాక్షన్ అంశాల మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్ స్వరకర్త.

డిసెంబరులో కన్నప్ప


● విష్ణు మంచు

విష్ణు మంచు హీరోగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ప్రభాస్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, మధుబాల, ప్రీతీ ముకుందన్ వంటి వారు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాని డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గురువారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు విష్ణు. అయితే విడుదల తేదీ ఎప్పుడన్నది మాత్రం స్పష్టం చేయలేదు. శివ భక్తుడైన కన్నప్ప కథతో 'కన్నప్ప' రూపొందుతోంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ సినిమా విడుదల కానున్న సంగతి తెలిసిందే.

హం పరమేశ్వరం...


● అశ్విన్ బాబు

'రం రం ఈశ్వరం... హం పరమేశ్వరం... యం యం కింకరం... వం గంగాధరం...' అంటూ మొదలవుతుంది 'రం రం ఈశ్వరం' పాట. అశ్విన్‌బాబు, దిగంగనా సూర్యవంశీ జంటగా నటించిన 'శివం భజే' సినిమాలోనిది ఈ పాట. ఆధ్యాత్మిక అంశాల మేళవింపుతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీని అప్సర్ దర్శకత్వంలో మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించారు. ఈ చిత్రం ఆగస్టు 1న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రం రం ఈశ్వరం' పాట లిరికల్ వీడియోను సంగీత దర్శకుడు తమన్ 'ఎక్స్'లో షేర్ చేశారు. సంగీత దర్శకుడు వికాస్ బడిస సారథ్యంలో పూర్ణాచారి సాహిత్యం అందించిన ఈ పాటను సాయిచరణ్ పాడారు. ''మా సినిమా చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి'' అన్నారు మహేశ్వర్ రెడ్డి.

ఆస్పత్రిలో జాన్వీ కపూర్

హీరోయిన్ జాన్వీ కపూర్ అస్వస్థతకు గురయ్యారు. కల్తీ ఆహారం తినడం వల్ల జాన్వీ అనారోగ్యానికి గురయ్యారని, దీంతో ముంబైలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరారని, రెండు రోజుల చికిత్స అనంతరం డిశ్చార్జ్ అవుతారని జాన్వీ తండ్రి–నిర్మాత బోనీ కపూర్ వెల్లడించినట్లుగా బాలీవుడ్ మీడియా చెబుతోంది. అయితే ముందుగా జాన్వీ కపూర్ ఆస్పత్రిపాలయ్యారని వార్తలు రావడంతో ఆమె అభిమానులు షాక్ అయ్యారు. స్వల్ప అస్వస్థత మాత్రమే అని బోనీ కపూర్ పేర్కొనడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక తెలుగులో ఎన్టీఆర్ 'దేవర', రామ్‌చరణ్ 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్), హిందీలో వరుణ్ ధావన్‌తో 'సన్నీ సంస్కారీకీ తులసీ కుమారి' చిత్రాలతో బిజీగా ఉన్నారు జాన్వీ. అలాగే ఈ బ్యూటీ నటించిన హిందీ చిత్రం 'ఉలజ్' ఆగస్టులో విడుదలకు రెడీ అవుతోంది.

సింగరో సింగ


● శ్రీవిష్ణు

'రాజ రాజ చోర' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'శ్వాగ్'. టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రీతూ వర్మ, మీరా జాస్మిన్, దక్షా నగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలో సింగరేణి అలియాస్ సంగ పాత్రలో శ్రీవిష్ణు నటిస్తున్నట్లుగా వెల్లడించి, 'సింగరో సింగ' అనే పాట లిరికల్ వీడియోను కూడా విడుదల చేశారు. 'సింగరో సింగ.. అబ్బో సింగరో సింగ...' అంటూ మొదలై, 'పక్కక్ జరుగుర్రి... దండల్ గుచ్చుర్రీ... దండాలు గిండాలు పెట్టుర్రి... ఆస్తందు సింగ... సింగరో సింగ..' అంటూ సాగే ఈ పాటకు వివేక్ సాగర్ స్వరాలందించగా నిక్లేష్ సుంకోజీ సాహిత్యం అందించారు. బాబా సెహగల్–వైకోమ్ విజయలక్ష్మి పాడారు.

ముందుగానే ఆపరేషన్ రావణ్


● రక్షిత్

రక్షిత్ అట్లూరి, సంగీర్తనా విపిన్ జంటగా నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాను తొలుత ఆగస్టు 2న విడుదల చేయాలనుకున్నారు. అయితే వారం రోజులు ముందుగానే అంటే ఈ నెల 26న విడుదల చేయనున్నట్లుగా గురువారం చిత్రయూనిట్ ప్రకటించింది. వెంకట సత్య దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మించారు.

పల్లెటూరిలో ఉరుకు


● తేజస్

'హుషారు' వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను అలరించిన తేజస్ కంచర్ల హీరోగా నటించిన తాజా సినిమా 'ఉరుకు పటేల'. 'గెట్ ఉరికి ఫైడ్' అన్నది ట్యాగ్ లైన్. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను నిర్మించారు. ఈ మూవీ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''పల్లెటూరి నేపథ్యంలో భావోద్వేగాల ప్రధానంగా సాగే చిత్రం 'ఉరుకు పటేల'. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సన్నీ కూరపాటి, సంగీతం: ప్రవీణ్ లక్కరాజు.

పొందూరు ఖద్దరుపై వీడియో పోటీలు

సాక్షి, అమరావతి: మహాత్మాగాంధీని ప్రభావితం చేసిన పొందూరు ఖద్దరు తయారీపై ప్రభుత్వం వీడియో చిత్రీకరణ పోటీలను నిర్వహిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. భారతీయ చరిత్రలో చేనేత ప్రాధాన్యతను గుర్తించి ఆగస్టు 7వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. పోటీల్లో పాల్గొనే వారు తాము రూపొందించిన వీడియోలను మంగళగిరిలోని చేనేత, జౌళి శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆగస్టు 1వ తేదీలోగా సమర్పించాలని కోరింది.

పిన్నెల్లి బెయిల్ పిటిషన్ డిస్మిస్

నగరంపాలెం: పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్ డిస్మిస్ అయ్యింది. గురజాల అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తిగా ఉన్న గుంటూరు 4వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శరత్‌బాబు వద్ద గురువారం వాదనలు జరిగాయి. అనంతరం పిన్నెల్లి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయమూర్తి డిస్మిస్ చేశారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లాలోని జైలులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రిమాండ్‌లో ఉన్నారు.

సీఐడీ కస్టడీలో నా హత్యకు కుట్ర

ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

నగరంపాలెం: గతంలో గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయం కస్టడీలో తనను హత్య చేసేందుకు కుట్ర జరిగిందని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం గుంటూరు ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌ను ఆయన కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గతంలో రాజద్రోహం కేసులో తనను ఏపీ సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారని, కస్టడీలో నిర్బంధించి హత్య చేసేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో కేసు విచారణ నిమిత్తం తీసుకొచ్చారని, ఆ సమయంలో తనను హత్య చేసేందుకు సీఐడీ, నిఘా విభాగాధిపతిగా వ్యవహరించిన పీవీ సునీల్‌కుమార్, పీఎస్ఆర్ సీతారామాంజనేయులు, ఏఎస్పీ విజయపాల్, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్, జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ ఎస్.ప్రభావతి కారకులయ్యారని, ఇక్కడికి కూతవేటు దూరంలో ఉన్న గుంటూరు ప్రాంతీయ సీఐడీ కార్యాలయం కస్టడీలో తీవ్రంగా హింసించారని ఆరోపించారు. ప్రస్తుతం తన వద్ద ఉన్న సమాచారాన్ని జిల్లా ఎస్పీకి ఇచ్చి.. దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని కోరినట్టు తెలిపారు.

ఎక్సైజ్ చెక్ పోస్ట్‌ను కబ్జా చేసిన జనసేన నేతలు

అంతా స్థానిక మంత్రి కనుసన్నల్లోనే..


జనసేన నేతల అక్రమ నిర్మాణం వద్ద ఏర్పాటు చేసిన పవన్ కళ్యాణ్, స్థానిక మంత్రి ఫ్లెక్సీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: 30 ఏళ్ల క్రితం ఎక్సైజ్, పోలీస్ అవసరాల కోసం పంచాయతీ కేటాయించిన స్థలాన్ని జనసేన నేతలు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. స్థానిక మంత్రి అండదండలతోనే ఇదంతా జరుగుతుండటంతో అధికారులు, పోలీసు శాఖ ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం కోటిపల్లిలో రావులపాలెం–యానాం రోడ్డును ఆనుకుని ఉన్న పంచాయతీ స్థలాన్ని ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసుకోవడానికి గతంలో తీర్మానం చేసి ఇచ్చారు. యానాం నుంచి ఏపీకి అక్రమంగా రవాణా అయ్యే మద్యం నియంత్రణకు అప్పట్లో ఎక్సైజ్ శాఖ ఈ చెక్ పోస్ట్ ఏర్పాటు చేసింది. అనంతరం దీనిని ఎక్సైజ్ శాఖ తీసివేయడంతో ఇక్కడ పోలీస్ శాఖ అవుట్ పోస్ట్ పెట్టగా..దీన్ని కోటిపల్లిలో ఏటా నిర్వహించే శివరాత్రి పర్వదినాన బెల్లం జీళ్లు తయారు చేసి, అమ్ముకునేందుకుగాను కొంత మంది వ్యక్తులు ఉపయోగిస్తున్నారు. క్రమంగా వీరు తమ పలుకుబడిని అడ్డుపెట్టుకుని, దీనిని ఖాళీ చేయడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జనసేనకు చెందిన కొంత మంది ఈ స్థలాన్ని కబ్జా చేసి షెడ్డు నిర్మించారు. దీంతో పాటు దీని జోలికి ఎవరూ రావద్దంటూ అధికార పార్టీకి చెందిన స్థానిక మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ షెడ్డు వద్ద కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పక్కనే ఉన్న హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఇదే గ్రామంలో కొంతమంది ఒకరి ప్రైవేటు స్థలంలో అక్రమంగా షెడ్డు వేశారని తెలుసుకున్న స్థానిక మంత్రి స్వయంగా అక్కడకు వెళ్లి అక్రమార్కుల భరతం పడతామంటూ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన కూటమి నాయకులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాగార్జున యాదవ్‌ను అరెస్ట్ చేయబోం

- హైకోర్టుకు నివేదించిన పోలీసులు
- విచారణ ఈ నెల 25కి వాయిదా



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి యనమల సాయి నాగార్జున (నాగార్జున యాదవ్)ను తదుపరి విచారణ వరకు అరెస్ట్ చేయబోమని పోలీసులు హైకోర్టుకు నివేదించారు. నాగార్జున యాదవ్‌పై నమోదు చేసిన కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతామన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు పూర్తి వివరాల సమర్పణ నిమిత్తం విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది. టీవీ చర్చా కార్యక్రమంలో నాగార్జున యాదవ్ సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇవి తమ మనోభావాలను దెబ్బతీయడంతోపాటు వైషమ్యాలను రెచ్చగొట్టేలా ఉన్నాయంటూ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ ఈ నెల 10న కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నాగార్జున యాదవ్‌పై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ యాదవ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై గురువారం జస్టిస్ వెంకట జ్యోతిర్మయి విచారణ జరిపారు. పిటిషనర్ తరపు న్యాయవాది శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. యాదవ్ మాట్లాడిన మాటల్ని పరిశీలిస్తే వర్గాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే ఉద్దేశం లేదన్న విషయం స్పష్టమవుతోందన్నారు. యాదవ్‌పై పెట్టిన సెక్షన్లు కూడా ఏడేళ్ల కంటే తక్కువ శిక్షపడేవని తెలిపారు. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా పోలీసులు పిటిషనర్‌ను అరెస్ట్ చేయడానికి వీల్లేదన్నారు. అడ్వొకేట్ జనరల్ తరపు న్యాయవాది పి.సాయిసూర్యతేజ స్పందిస్తూ.. తదుపరి విచారణ వరకు పిటిషనర్‌ను అరెస్ట్ చేయబోమన్నారు. పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతామని తెలిపారు. ఈ వాదనలను రికార్డ్ చేసిన న్యాయమూర్తి తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేశారు. పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ దాడి

- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిక
- అనంత జిల్లాలో ఘటన


అనిల్‌కు ఉమామహేశ్వరనాయుడు పరామర్శ

బ్రహ్మసముద్రం: వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచాడన్న కక్షతో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురంలో బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వడ్డే అనిల్ వైఎస్సార్‌సీపీ అభిమాని. అతడిపై టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు కక్ష గట్టారు. గురువారం వడ్డే అనిల్ తన చిన్నాన్న గోవింద్‌తో మాట్లాడుతుండగా శ్రీరాములు, పాతిరెడ్డి, వీరేష్, వినాయక్ తదితరులు అతడిపై కలిసి దాడి చేశాడు. దాడిలో అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడిని వైఎస్సార్‌సీపీ నేత ఉమామహేశ్వరనాయుడు పరామర్శించి ధైర్యం చెప్పారు. అనిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

107, 108 జీవోలను రద్దుచేయాలి

విద్యార్థి సంఘాల నేతల డిమాండ్

సాక్షి, అమరావతి/మడకశిర/చిత్తూరు కలెక్టరేట్/లబ్బీపేట (విజయవాడ తూర్పు)/గుంటూరు మెడికల్: రాష్ట్రంలో గతేడాది ప్రారంభమైన ఐదు వైద్య కళాశాలలకు సంబంధించి 107, 108 జీవోలను రద్దు చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల్లో పాత ఫీజు విధానాన్ని కొనసాగిస్తామనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కాగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి చిత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మాట మార్చడం సరైన పద్ధతి కాదన్నారు.

చంద్రబాబుకు లేఖ రాసినా స్పందన లేదు

తాము అధికారంలోకి వస్తే 107, 108 జీవోలను రద్దు చేస్తామని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పలుమార్లు హామీ ఇచ్చారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి గుర్తు చేశారు. కానీ ఇప్పటికీ జీవోలను రద్దు చేయలేదని మండిపడ్డారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు గట్టిచర్యలు

కేంద్ర హోంమంత్రితో సమావేశంలో ఏపీ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఆపరేషన్ పరివర్తన పేరిట గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన గురువారం ఢిల్లీలో నార్కో కోఆర్డినేషన్ సెంటర్ 7వ అపెక్స్ లెవెల్ సమావేశం జరిగింది. అన్ని రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీలు, ఇతర అధికారులు వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో గిరిజనులు గంజాయి సాగు చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, గిరిజన ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూముల్లో గంజాయి సాగు చేయకుండా వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధికి ఇతర పంటలు పండించే విధంగా చైతన్యం తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌తో పాటు పెద్దఎత్తున చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్టు వివరించారు. మత్తు పదార్థాల నిషేధానికి సంబంధించి వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మత్తు పదార్థాల నియంత్రణ చర్యల పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో సీఎస్, జిల్లా స్థాయిలో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు.

పరివర్తన తీసుకురండి: అమిత్ షా

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఢిల్లీ నుంచి వీడియో సమావేశం ద్వారా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా వివిధ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థుల్లో వ్యక్తిగత పరివర్తన తీసుకురావాలని సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో వివిధ సంఘాలు, సంస్థలను భాగస్వాములను చేయాలని చెప్పారు. కాగా, 14446 నంబర్‌తో నేషనల్ డీఅడిక్షన్ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని అమిత్ షా లాంఛనంగా ప్రారంభించారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రజల్లో విస్తృత అవగాహనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇందుకుగాను బ్రహ్మకుమారీలు, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఇస్కాన్ వంటి పలు ఆధ్యాత్మిక సంస్థలతో అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నామని వివరించారు. ఈ వీడియో సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి, సీఐడీ అదనపు డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సెబ్ డీఐజీ యం.రవి ప్రకాశ్, డీఎంఈ నర్సింహం పాల్గొన్నారు.

డ్రగ్స్ నిరోధానికి అవగాహన సదస్సులు: బాలల హక్కుల కమిషన్

ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు 26 జిల్లాల్లో సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో డ్రగ్స్ నిరోధానికి పెద్ద ఎత్తున కార్యాచరణ చేపట్టాలని జాతీయ బాలల హక్కుల కమిషన్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సంయుక్తంగా ఢిల్లీలో గత నెల 30న జరిగిన కీలక సమావేశంలో నిర్ణయించాయని పేర్కొన్నారు. పోలీసు, విద్య, వైద్య ఆరోగ్య, ఎక్సైజ్, సాంఘిక సంక్షేమ, పంచాయతీ రాజ్, మున్సిపల్, మహిళా శిశు సంక్షేమ, రైల్వే, రవాణా తదితర శాఖలు అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతినిధులతో ఈ సమావేశాలు, సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలు, సాధించిన పురోగతిపై చర్చిస్తామని వివరించారు.

20న ఐఐపీఈలో తొలి పీహెచ్‌డీ ప్రదానం

ఐఐపీఈ డైరెక్టర్ శాలివాహన్ వెల్లడి



సాక్షి, విశాఖపట్నం : వైజాగ్ నోవోటెల్‌లో ఈ నెల 20న నిర్వహించే నాలుగో స్నాతకోత్సవంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)లో తొలిసారిగా పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నామని సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ తెలిపారు. వ్యర్థాలు, బయోమాస్ నుంచి అధునాతన నానోకార్బన్స్, పునరుత్పాదక ఇంధన వనరులు తదితర అంశాలపై పరిశోధన చేసిన గౌరీశంకర్ దాస్‌కు ఈ పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఏయూ ఆవరణలోని ఐఐపీఈ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో డైరెక్టర్ పలు అంశాల్ని వివరించారు. ఆయన మాట్లాడుతూ.. ఐఐపీఈ నాలుగో స్నాతకోత్సవానికి సీఎస్ఐఆర్–ఎన్‌జీఆర్ఐ సీనియర్ సైంటిస్ట్ వీపీ దిమ్రి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. 2024-25 సంవత్సరం నుంచి వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం డేటా సైన్స్ మెషిన్ లెర్నింగ్‌లో వెబ్ ఆధారిత ఎంటెక్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల విద్యార్థుల కోసం జిజ్ఞాస కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 96 శాతం మంది ఐఐపీఈ విద్యార్థులకు మంచి సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ లభించాయన్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి విదేశీయుల కోసం పీహెచ్‌డీ కార్యక్రమాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఆర్అండ్‌డీ డీన్ విజయ్ కుమార్, అసోసియేట్ డీన్‌దీపక్ అంబస్‌మిశ్రా, రిజిస్ట్రార్ రామ్‌పాల్ ద్వివేది పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
19-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
627	188
81,343	24,801

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,917	▽	80
డోజోన్స్	40,936	▽	262
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,205	▲	17
డాక్స్	18,355	▽	83
షాంఘై	2,977	▲	14
నికాయ్	40,126	▽	971

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	73,979
బంగారం (99.5 స్వచ్ఛత)	73,683
వెండి (కేజీ)	91,555

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.18	84.20
£	బ్రిటన్ పౌండ్	107.22	109.81
€	యూరో	89.94	92.32
¥	జపాన్ ఎన్ (100)	52.38	53.53
AU$	ఆస్ట్రేలియా డాలర్	55.72	57.67
S$	సింగపూర్ డాలర్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	21.40	22.95
UAE D	యూఏఈ దిర్హామ్	21.87	23.66
¥	చైనా యువాన్	10.39	12.46

81,000 దాటిన సెన్సెక్స్

- 24,800కి నిఫ్టీ
- 4వ రోజూ రికార్డుల ర్యాలీ



ముంబై: దేశీయ స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీ నాలుగోరోజూ కొనసాగింది. అధిక వెయిటేజీ టీసీఎస్(3%), ఇన్ఫోసిస్(2%), రిలయన్స్(1%), ఐసీఐసీఐ బ్యాంక్(1%) చొప్పున రాణించి సూచీల రికార్డు ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలు సెప్టెంబర్ నుంచి ప్రారంభం కావచ్చొనే అంచనాలూ సానుకూల ప్రభావం చూపాయి. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 627 పాయింట్ల లాభంతో 81,343 వద్ద ముగిసింది. నిఫ్టీ 188 పాయింట్లు పెరిగి 24,801 వద్ద నిలిచింది. ముగింపు స్థాయిలు సూచీలకు సరికొత్త రికార్డులు కావడం విశేషం. ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు ప్రథమార్ధమంతా బలహీనంగా ట్రేడయ్యాయి. మిడ్ సెషన్ నుంచి మార్కెట్ లాభాల బాట పట్టింది. ఒక దశలో సెన్సెక్స్ 806 పాయింట్లు బలపడి 81,523 వద్ద, నిఫ్టీ 225 పాయింట్లు ఎగసి 24,838 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి.

- ఐటీ కంపెనీలు ప్రకటిస్తున్న జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మెప్పిస్తున్నాయి. సెప్టెంబర్‌లో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలు ఈ రంగ షేర్లకు మరింత డిమాండ్ పెంచాయి. ఎల్‌టీఐఎం 3.50%, టీసీఎస్ 3%, విప్రో 2.50%, ఇన్ఫోసిస్, పెర్సిస్టెంట్, కోఫోర్జ్, టెక్ మహీంద్రా 2% రాణించాయి. ఎంఫసీస్‌లు ఒకశాతం లాభపడ్డాయి.

రూపాయి రికార్డ్ కనిష్టం @ 83.63

దేశీ కరెన్సీ డాలరుతో మారకంలో చరిత్రాత్మక కనిష్టానికి చేరింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో 5 పైసలు నీరసించి 83.63 వద్ద ముగిసింది. రూపాయి 83.57 వద్ద ప్రారంభమై ఇంట్రాడేలో 83.66 వరకూ క్షీణించింది.

ఇన్ఫోసిస్.. గుడ్

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్‌–జూన్(క్యూ1)లో నికర లాభం 7 శాతం పుంజుకుని రూ. 6,368 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 5,945 కోట్లు ఆర్జించింది. అయితే త్రైమాసిక(క్యూ4)వారీగా చూస్తే నికర లాభం రూ. 7,969 కోట్ల నుంచి 20 శాతం క్షీణించింది. మొత్తం ఆదాయం 3.6 శాతం మెరుగుపడి రూ. 39,315 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 37,933 కోట్ల టర్నోవర్ సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని ప్రోత్సాహకరంగా ప్రారంభించినట్లు ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ పేర్కొన్నారు. మెరుగైన మార్జిన్లు, భారీ డీల్స్, రికార్డ్ నగదు ఆర్జనను సాధించినట్లు తెలియజేశారు.

ఈ షేరు బీఎస్‌ఈలో 2% ఎగసి రూ. 1,759 వద్ద ముగిసింది.

- క్యూ1లో నికర లాభం రూ. 6,368 కోట్లు
- ఆదాయ అంచనాపెంపు
- 15,000–20,000 మంది ఫ్రెషర్స్‌కు చాన్స్
- కంపెనీ చరిత్రలోనే రికార్డ్ ఫ్రీ క్యాష్ ఫ్లో



మీడియాతో సీఈఓ సలీల్ పరేఖ్, సీఎఫ్‌వో జయేష్ ఎస్

3-4 శాతం వృద్ధి

తాజా త్రైమాసికంలో ఇన్ఫోసిస్ నిర్వహణ లాభ మార్జిన్లు 0.3 శాతం బలపడి 21.1 శాతంగా నమోదయ్యాయి. పూర్తి ఏడాదికి 20–22 శాతం మార్జిన్లు సాధించగలమని అంచనా వేస్తోంది. పూర్తి ఏడాదికి ఆదాయంలో నిలకడైన కరెన్సీ ప్రాతిపదికన 3–4 శాతం వృద్ధిని సాధించగలమని కంపెనీ తాజాగా అంచనా వేసింది. గతంలో విడుదల చేసిన 1–3 శాతం వృద్ధి అంచనాల (గైడెన్స్)ను ఎగువముఖంగా సవరించింది.

ఇతర విశేషాలు

- క్యూ1లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 9,155 కోట్ల ఫ్రీ క్యాష్ ఫ్లో సాధించింది. ఇది 59 శాతం వృద్ధి.
- ఈ ఏడాది సాధించగల వృద్ధి ఆధారంగా 15,000 నుంచి 20,000మంది వరకూ ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించే వీలున్నట్లు ఇన్ఫోసిస్ సీఎఫ్‌వో జయేష్ ఎస్. తెలియజేశారు.
- క్యూ1లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 4.1 బిలియన్ డాలర్ల విలువైన 34 భారీ డీల్స్‌ను కుదుర్చుకుంది. ఇవి 78 శాతం అధికంకాగా.. వీటిలో కొత్త కాంట్రాక్టుల వాటా 58 శాతం.
- ఉద్యోగుల సంఖ్య 6 శాతం తగ్గి 3,15,332కు పరిమితమైంది. గతేడాది క్యూ1లో మొత్తం సిబ్బంది సంఖ్య 3,36,294కాగా.. జనవరి–మార్చి(క్యూ4)లో 3,17,240గా నమోదైంది.
- స్వచ్ఛంద ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 12.7 శాతంగా నమోదైంది. గత క్యూ1లో ఇది 17.3 శాతంకాగా.. క్యూ4లో 12.6 శాతంగా నమోదైంది.

ముద్రా రుణాల పరిమితి రెట్టింపు చేయాలి

రుణ హామీ కవరేజీనీ పెంచాలి • ఎంఎస్‌ఎంఈల వినతి



రాబోయే బడ్జెట్‌లో ముద్రా యోజన కింద ఇచ్చే రుణాల పరిమితిని రెట్టింపు చేయాలని, రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచాలని చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్‌ఎంఈ) కేంద్రాన్ని కోరుతున్నాయి. అలాగే అన్‌సెక్యూర్డ్ రుణాలకు రుణ హామీ కవరేజీని రూ. 2 కోట్ల నుంచి రూ. 5 కోట్లకు పెంచాలని ఆశిస్తున్నాయి. అటు అంతర్జాతీయంగా తమ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి తగు మద్దతు కూడా కల్పించాలని కోరుకుంటున్నాయి. ఎంఎస్‌ఎంఈల వృద్ధికి ఊతమిచ్చేలా ప్రభుత్వం తన ఎజెండాను కొనసాగించే అవకాశం ఉందని బడ్జెట్‌పై నెలకొన్న అంచనాలను అర్క ఫిన్‌క్యాప్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నవీన్ సైనీ తెలిపారు. ముద్రా రుణాల పరిమితిని పెంచడం తదితర అంశాలతో ఎంఎస్‌ఎంఈలకు మరిన్ని ఆర్థిక వనరులు అందుబాటులోకి రాగలవని, వాటి ఎదుగుదలతో పాటు ఎకానమీ వృద్ధికి కూడా దోహదపడగలవని వివరించారు.

రియల్టీ ఆశలు..

బడ్జెట్‌పై రియల్ ఎస్టేట్ రంగానికి చాలా ఆశలు ఉన్నట్లు క్రిసుమి కార్పొరేషన్ ఎండీ మోహిత్ జైన్ తెలిపారు. ప్రత్యక్ష పన్ను వసూళ్లు రికార్డు స్థాయికి చేరడంతో వేతన జీవులు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో గృహ రుణాలపై చెల్లించే అసలు, వడ్డీపై పన్ను మినహాయింపు పరిమితిని పెంచాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. గత కొన్నాళ్లుగా ప్రాపర్టీల విలువ భారీగా పెరిగినందున గృహ రుణ వడ్డీపై పన్ను రిబేటును ప్రస్తుతమున్న రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచాలని పేర్కొన్నారు. మరోవైపు స్టార్టప్‌ల కోసం పన్నుల విధానాన్ని సరళతరం చేస్తే అంకుర సంస్థలకు ఊరట లభించగలదని సీఆర్‌ఐబీ సహ వ్యవస్థాపకుడు సన్నీ గర్గ్ తెలిపారు. ఏంజెల్ ట్యాక్స్‌ను తొలగించడం లేదా క్రమబద్ధీకరించడమో చేస్తే దేశీయంగా నిధుల లభ్యత మెరుగుపడుతుందని, ప్రారంభ దశలోని అంకుర సంస్థలకు ఫండింగ్‌పరమైన వెసులుబాటు లభించగలదని పేర్కొన్నారు.



– సాక్షి, బిజినెస్ డెస్క్



వజీర్‌ఎక్స్‌లో విత్‌డ్రాయల్స్ నిలిపివేత

230 మిలియన్ డాలర్ల కరెన్సీ అనుమానాస్పద లావాదేవీలు

న్యూఢిల్లీ: క్రిప్టో ఎక్స్ఛేంజీ వజీర్‌ఎక్స్‌కి చెందిన మల్టీసిగ్ వాలెట్ల నుంచి 230 మిలియన్ డాలర్ల విలువ చేసే కరెన్సీ అనుమానాస్పద రీతిలో బదిలీ కావడం కలకలం రేపింది. దీనితో ఈ ఉదంతంపై విచారణ జరుపుతున్నట్లు సంస్థ తెలిపింది. క్రిప్టో, రూపాయి మారక విత్‌డ్రాయల్స్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపింది. రెండు లేదా అంతకు మించి ప్రైవేట్ 'కీ'స్ అవసరమయ్యే పటిష్టమైన మల్టీసిగ్ వాలెట్ల నుంచి 230 మిలియన్ డాలర్ల క్రిప్టో కరెన్సీ అనుమానాస్పదంగా బదిలీ విషయాన్ని సంస్థ ధృవీకరించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులో 102 మిలియన్ డాలర్ల విలువ చేసే షిబా ఇను, 52.5 మిలియన్ డాలర్ల ఎథీరియం, 11.24 మిలియన్ డాలర్ల మ్యాటిక్, 7.6 మిలియన్ డాలర్ల పెపె కాయిన్, 135 మిలియన్ డాలర్ల టెతర్, 3.5 మిలియన్ డాలర్ల గాలా క్రిప్టో కరెన్సీలు ఉన్నట్లు సమాచారం.

భారత్‌లో రూ. 500 కోట్ల పెట్టుబడులు : తోషిబా గ్రూప్

న్యూఢిల్లీ: భారత్‌లో కార్యకలాపాల విస్తరణపై 10 బిలియన్ జపాన్ యెన్‌లు (సుమారు రూ. 500 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు తోషిబా గ్రూప్ వెల్లడించింది. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ సామర్థ్యాన్ని 1.5 రెట్లు పెంచుకునేందుకు తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టీటీడీఐ) ఈ నిధులను వెచ్చించనున్నట్లు వివరించింది. 2024–2026 ఆర్థిక సంవత్సరాల మధ్య ఈ మేరకు ఇన్వెస్ట్ చేయనున్నట్లు టీటీడీఐ చైర్‌పర్సన్ హిరోషి ఫురుటా తెలిపారు. భారత్‌లో తయారీ, భారత్ నుంచి ఎగుమతుల నినాదానికి అనుగుణంగా చేసే ఈ పెట్టుబడులతో నిర్వహణ సామర్థ్యాలను గణనీయంగా మెరుగుపర్చుకోనున్నట్లు వివరించారు. భారత మార్కెట్లో ట్రాన్స్‌ఫార్మర్ల డిమాండ్‌ను తీర్చడానికి, ఎగుమతులను పెంచుకోవడానికి పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల విస్తరణ తోడ్పడగలదని హిరోషి పేర్కొన్నారు.



అరబిందో ఫార్మా రూ.750 కోట్ల షేర్ల బైబ్యాక్

ఒక్కో షేరు ధర రూ. 1,460

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా తాజాగా రూ. 750 కోట్ల వరకు విలువ చేసే షేర్లను బైబ్యాక్ చేయనుంది. ఇందుకోసం షేరు ఒక్కింటికి రూ. 1,460 ధరను నిర్ణయించింది. దీనికి సంబంధించిన 51,36,986 షేర్ల కొనుగోలు ప్రతిపాదనకు బోర్డు ఆమోదముద్ర వేసినట్లు కంపెనీ వెల్లడించింది. బైబ్యాక్ స్కీము కోసం జూలై 30ని రికార్డు తేదీగా నిర్ణయించినట్లు వివరించింది. జూన్ 30 ఆఖరు నాటి గణాంకాల ప్రకారం కంపెనీలో ప్రమోటర్లకు 51.8%, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లకు (ఎఫ్ఐఐ) 16.73%, మ్యూచువల్ ఫండ్స్‌కు 19.17 శాతం వాటాలు ఉన్నాయి.

ఎన్ఎస్ఈలో అరబిందో ఫార్మా షేరు రెండున్నర శాతం క్షీణించి రూ. 1,338 వద్ద క్లోజయ్యింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

- మెప్పించిన కరూర్ వైశ్యా బ్యాంక్
- ఇళ్లకు పటిష్ట డిమాండ్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-7-2024	
విశాఖ	575–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

సాక్షి స్పోర్ట్స్



టాప్ సీడ్ జోడీని ఓడించిన అనిరుధ్-అర్జున్ ద్వయం

హాల్ ఆఫ్ ఫేమ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీ తొలి రౌండ్ మ్యాచ్‌లో అనిరుధ్-అర్జున్ ఖడే (భారత్) ద్వయం 6-3, 3-6, 10-7తో టాప్ సీడ్ 28వ ర్యాంక్ జోడీ లామోన్స్ -విత్రో (అమెరికా)ను బోల్తా కొట్టించింది. ప్రస్తుతం అనిరుధ్ 128వ ర్యాంక్‌లో, అర్జున్ 111వ ర్యాంక్‌లో ఉన్నారు.

పోప్ సెంచరీ: ఇంగ్లండ్ 416 ఆలౌట్

వెస్టిండీస్‌తో గురువారం నాటింగ్‌హమ్‌లో మొదలైన రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 88.3 ఓవర్లలో 416 పరుగులకు ఆలౌటైంది. ఓలీ పోప్ (121; 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ చేశాడు. డకెట్ (71; 14 ఫోర్లు), స్టోక్స్ (69; 8 ఫోర్లు) రాణించారు. ఇంగ్లండ్ 4.2 ఓవర్లలో 50 పరుగులు చేసి టెస్టుల్లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ చేసిన జట్టుగా తమ పేరిటే ఉన్న రికార్డును బద్దలు కొట్టింది. 1994లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో ఇంగ్లండ్ 4.3 ఓవర్లలో 50 పరుగులు సాధించింది.

భారత టి20 జట్టు కెప్టెన్‌గా సూర్యకుమార్

- శుబ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్సీ
- వన్డే సిరీస్ ఆడనున్న రోహిత్, కోహ్లి
- శ్రీలంకతో పోరుకు భారత జట్ల ప్రకటన



న్యూఢిల్లీ: భారత టి20 జట్టు రెగ్యులర్ కెప్టెన్‌గా స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ నియమితుడయ్యాడు. ఈ నెలలో శ్రీలంక గడ్డపై జరిగే టి20 సిరీస్ నుంచి టీమిండియా పూర్తి స్థాయి జట్టులోకి బరిలోకి దిగనుంది. ఈ ఫార్మాట్ నుంచి సీనియర్లు రోహిత్, కోహ్లి, జడేజాల రిటైర్ కావడంతో 2026 టి20 వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త బృందాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శ్రీలంకతో జరిగే టి20, వన్డే సిరీస్ కోసం జట్లను ప్రకటించింది. ఆశ్చర్యకరంగా వరల్డ్ కప్ విజేతగా నిలిచిన జట్టుకు టి20 వైస్ కెప్టెన్‌గా ఉన్న హార్దిక్ పాండ్యాను ఆ బాధ్యతల నుంచి తప్పించి కొత్త వైస్ కెప్టెన్‌గా గిల్‌ను నియమించారు. ఫిట్‌నెస్ సమస్యలతో పాటు పని భారం తగ్గించే క్రమంలో అన్ని మ్యాచ్‌లకు ఆడే అవకాశం లేకపోవడంతో పాండ్యా కు కాకుండా గిల్‌కు వైస్ కెప్టెన్సీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

శ్రేయస్ పునరాగమనం...

శ్రీలంకతో వన్డే సిరీస్ ఆడేందుకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఆసక్తిని ప్రదర్శించారు. దాంతో రోహిత్ నేతృత్వంలోనే జట్టు వన్డే సిరీస్ బరిలోకి దిగనుంది. గిల్‌కు వన్డేల్లోనూ వైస్ కెప్టెన్సీ బాధ్యతలు దక్కడం విశేషం. బుమ్రాకు వన్డే సిరీస్ నుంచి కూడా విశ్రాంతి దక్కింది. టి20 కెప్టెన్ సూర్యకుమార్, పాండ్యా, జడేజా కూడా వన్డే జట్టులో లేరు. బీసీసీఐ కాంట్రాక్ట్ కోల్పోయిన శ్రేయస్ అయ్యర్ తిరిగి భారత జట్టులోకి రావడం విశేషం కాగా... ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ సమయంలో గాయపడిన కేఎల్ రాహుల్ పునరాగమనం చేశాడు. విజయ్ హజారే ట్రోఫీలో రాణించినందుకు పరాగ్‌కు వన్డేల్లోనూ తొలిసారి అవకాశం రాగా, హర్షిత్ రాణాకూ పిలుపు లభించింది. ఈ టూర్‌లో భాగంగా భారత్, శ్రీలంక మధ్య జూలై 27, 28, 30 తేదీల్లో టి20లు...ఆగస్టు 2, 4, 7 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.

భారత టి20 జట్టు: సూర్యకుమార్ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), జైస్వాల్, రింకూ సింగ్, పరాగ్, పంత్, సామ్సన్, పాండ్యా, దూబే, అక్షర్, సుందర్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, ఖలీల్, సిరాజ్. **భారత వన్డే జట్టు:** రోహిత్ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), కోహ్లి, శ్రేయస్, పరాగ్, పంత్, రాహుల్, హర్షిత్, దూబే, అక్షర్, సుందర్, కుల్దీప్, అర్ష్‌దీప్, ఖలీల్, సిరాజ్.



వినేశ్ ఫొగాట్

PARIS 2024

మరో 7 రోజుల్లో...

'పట్టు' కొనసాగించాలి

ఒలింపిక్స్‌లో నిలకడగా భారత రెజ్లర్ల ప్రదర్శన | **2008 నుంచి పతకాలతో తిరిగి వస్తున్న కుస్తీ వీరులు**

ఆశలు రేకెత్తిస్తున్న భారత మహిళా రెజ్లర్లు | **అంతిమ్, వినేశ్‌లపై భారీ అంచనాలు**

ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో వ్యక్తిగత క్రీడాంశాల్లో భారత్‌కు అత్యధిక పతకాలు అందించిన క్రీడ రెజ్లింగ్. ఇప్పటి వరకు ఈ క్రీడాంశంలో భారత్‌కు ఏడు పతకాలు లభించాయి. 1952 హెల్సింకి ఒలింపిక్స్‌లో ఖాషాబా జాదవ్ కాంస్య పతకాన్ని అందించాడు. ఆ తర్వాత 56 ఏళ్లపాటు ఒలింపిక్స్ నుంచి మన కుస్తీ వీరులు రిక్తహస్తాలతో తిరిగి వచ్చారు. 2008లో సుశీల్ కుమార్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కాంస్య పతకాన్ని సాధించాడు. సుశీల్ పతకంతో అంతర్జాతీయ స్థాయిలో భారత రెజ్లింగ్ ముఖచిత్రం మారిపోయింది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో సుశీల్ మరోసారి పట్టు సడలించకుండా పోరాడి రజత పతకాన్ని సొంతం చేసుకోగా... యోగేశ్వర్ దత్ కాంస్య పతకం గెలిచాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో మహిళా రెజ్లర్ సాక్షి మలిక్ కాంస్య పతకంతో ప్రతిష్టను పెంచింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో రవి కుమార్ దహియా రజత పతకంతో, బజరంగ్ పూనియా కాంస్య పతకంతో మెరిశారు. గత నాలుగు ఒలింపిక్స్ క్రీడల నుంచి వరుసగా పతకాలు తెస్తున్న భారత రెజ్లర్లు ఇదే ఆనవాయితీని పారిస్ లోనూ కొనసాగించాలని పట్టుదలతో ఉన్నారు. భారత్ నుంచి పారిస్ గేమ్స్‌లో ఆరుగురు రెజ్లర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో అమన్ సెహ్రావత్ (57 కేజీలు)... మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో అంతిమ్ పంఘాల్ (53 కేజీలు), వినేశ్ ఫొగాట్ (50 కేజీలు), అన్షు మలిక్ (57 కేజీలు), నిషా దహియా (68 కేజీలు), రీతిక హుడా (76 కేజీలు) బరిలోకి దిగనున్నారు. రెజ్లింగ్ పోటీలు ఆగస్టు 5 నుంచి 11 వరకు జరుగుతాయి.

రవి దహియాను ఓడించి...

గత టోక్యో ఒలింపిక్స్‌లో పురుషుల విభాగంలో భారత్ నుంచి ముగ్గురు రెజ్లర్లు రవికుమార్, బజరంగ్, దీపక్ పూనియా పోటీపడ్డారు. అయితే ఈసారి ఈ ముగ్గురూ పారిస్ బెర్త్‌లు దక్కించుకోలేకపోయారు. పారిస్ గేమ్స్ క్వాలిఫయింగ్ టోర్నీల కోసం భారత రెజ్లింగ్ జట్టును ఎంపిక చేసేందుకు నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో రవి, బజరంగ్ ఓడిపోగా... దీపక్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీల్లో గట్టెక్కలేకపోయాడు. జాతీయ ట్రయల్స్‌లో టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత రవి దహియాను ఓడించిన అమన్ వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఫైనల్ చేరడం ద్వారా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ప్రస్తుత ఆసియా చాంపియన్ అయిన 21 ఏళ్ల అమన్ పారిస్ నుంచి పతకంతో రావాలంటే పక్కా ప్రణాళికలతో, భిన్నమైన వ్యూహాలతో సిద్ధంకావాలి.

సుశీల్, యోగేశ్వర్ సరసన...

మహిళల విభాగంలో అందరి దృష్టి వినేశ్ ఫొగాట్ పైనే ఉండనుంది. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో తడబడ్డ వినేశ్ వరుసగా మూడో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనుంది. తద్వారా సుశీల్, యోగేశ్వర్ దత్ తర్వాత వరుసగా మూడు ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొంటున్న తొలి మహిళా రెజ్లర్‌గా, ఓవరాల్‌గా మూడో భారతీయ రెజ్లర్‌గా వినేశ్ గుర్తింపు పొందనుంది. అంతర్జాతీయ స్థాయిలో అపార అనుభవం ఉన్న వినేశ్ ఖాతాలో కేవలం ఒలింపిక్ పతకం మాత్రమే లోటుగా ఉంది. జూనియర్ వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన అంతిమ్ పంఘాల్ ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించి పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను దక్కించుకుంది. హరియాణాకు చెందిన 19 ఏళ్ల అంతిమ్ గత ఏడాది ఆసియా క్రీడల తర్వాత మరే టోర్నీలోనూ ఆడలేదు. అయినప్పటికీ అనుకూలమైన 'డ్రా' లభించడంతో అంతిమ్ కీలక బౌట్‌లలో రాణిస్తే తప్పకుండా ఒలింపిక్ పతకంతో తిరిగి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఒలింపిక్స్ మినహా మిగతా పెద్ద ఈవెంట్స్‌లో పతకాలు నెగ్గిన అన్షు మలిక్ రెండోసారి ఒలింపిక్స్‌లో పోటీపడనుంది. టోక్యో ఒలింపిక్స్‌లో చేసిన తప్పిదాలు పునరావృతం చేయకుంటే అన్షు మలిక్ పారిస్‌లో సంచలన ఫలితాలు నమోదు చేసే చాన్స్ ఉంది. తొలిసారి ఒలింపిక్స్‌లో ఆడనున్న నిషా దహియా, రీతిక హుడాలకు చివరి సెకన్లలో పాయింట్లు కోల్పోయే బలహీనత ఉంది. తీవ్రమైన పోటీతత్వం ఉండే ఒలింపిక్స్‌లో వారు ఈ బలహీనతను అధిగమిస్తే అద్భుతం చేసే అవకాశముంది.

–సాక్షి క్రీడా విభాగం


అమన్ | అంతిమ్ పంఘాల్ | నిషా దహియా | అన్షు మలిక్ | రీతిక హుడా

'అవును... మేం విడిపోయాం'

హార్దిక్ పాండ్యా విడాకుల ప్రకటన



న్యూఢిల్లీ: భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి కీలక విషయాన్ని వెల్లడించాడు. తన భార్య నటాషా స్టన్‌కోవిచ్‌తో వివాహ బంధం ముగిసినట్లు అతను అధికారికంగా ప్రకటించాడు. తామిద్దరం పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నట్లు పాండ్యా పేర్కొన్నాడు. వీరిద్దరికి 2020లో వివాహం కాగా...అగస్త్య అనే నాలుగేళ్ల కొడుకు ఉన్నాడు. సెర్బియాకు చెందిన స్టన్‌కోవిచ్ మోడలింగ్, సినిమాల్లో నటిస్తూ ముంబైలో స్థిరపడిన సమయంలో పాండ్యాతో పరిచయం ప్రేమగా మారి పెళ్లి వరకు వెళ్లింది. గత కొంత కాలంగా పాండ్యా, స్టన్‌కోవిచ్ మధ్య విభేదాల గురించి వార్తలు వస్తూనే ఉన్నాయి. అయితే ఇద్దరూ దీనిపై ఎప్పుడూ స్పందించలేదు. మరోవైపు విడాకుల తర్వాత కూడా కొడుకుతో మాత్రం తల్లిదండ్రులుగా తమ ఇద్దరి బంధం కొనసాగుతుందని, అతని కోసం అన్ని బాధ్యతలు తీసుకుంటామని పాండ్యా స్పష్టం చేశాడు.

ఆసియా కప్ ట్రోఫీతో నేపాల్, థాయ్‌లాండ్, పాకిస్తాన్, భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, యూఏఈ, మలేసియా జట్ల కెప్టెన్లు



భారత్ X పాకిస్తాన్

- నేడు ఆసియా కప్ పోరులో మహిళా జట్ల 'ఢీ'
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

దంబుల్లా: మహిళల ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్‌కు ఘనమైన రికార్డు ఉంది. వన్డే ఫార్మాట్‌లో నాలుగు సార్లు టోర్నీ జరగ్గా... ప్రతీ సారి విజేతగా భారత్ నిలిచింది. టి20 ఫార్మాట్‌లో నాలుగు సార్లు టోర్నీ నిర్వహిస్తే ఒక్కసారి మినహా మూడు సార్లు భారతే చాంపియన్. ఒక్క 2018లో మాత్రమే ఫైనల్లో భారత్‌ను ఓడించి బంగ్లాదేశ్ ట్రోఫీ అందుకుంది. ఈ నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారత జట్టు మరోసారి ఫేవరెట్ ఆసియా కప్ టి20 టోర్నీలో బరిలోకి దిగుతోంది. నేటి నుంచి జరిగే ఈ పోరులో పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో పాటు అసోసియేట్ టీమ్‌లు యూఏఈ, నేపాల్, థాయ్‌లాండ్, మలేసియా కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాయి. ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. లీగ్ దశ అనంతరం టాప్–2 టీమ్‌లు సెమీస్ చేరతాయి. ఈ నెల 28న ఫైనల్ నిర్వహిస్తారు. శుక్రవారం భారత్ తమ తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను ఎదుర్కొంటోంది. ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు 14 మ్యాచ్‌లు జరిగాయి. భారత్ 11 గెలిచి, 3 మాత్రమే ఓడింది. టోర్నీలో భాగంగా ఈ నెల 21 యూఏఈతో, 23న నేపాల్‌తో భారత్ తలపడుతుంది. ఫామ్‌లో ఉన్న హర్మన్ బృందం ఇటీవల సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన టి20 సిరీస్‌ను 1–1తో సమంగా ముగించగా... అంతకుముందు బంగ్లాదేశ్‌ను 5–0తో చిత్తు చేసింది.

క్లుప్తంగా...

28 నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ ఈనెల 28 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించే మే–2024 సెషన్ డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు 16 జిల్లా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్టు సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 33,603 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని, శుక్రవారం నుంచి https://psc.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విజ్ఞప్తి చేశారు.

వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ ఏర్పాటు చేయండి

కరణం మల్లీశ్వరిని కోరిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీకాకుళంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వెయిట్ లిఫ్టింగ్ అకాడమీని ఏర్పాటు చేయాలని ఒలింపిక్ పతక విజేత కరణం మల్లీశ్వరిని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కోరారు. గురువారం ఢిల్లీలో రామ్మోహన్ నాయుడిని మల్లీశ్వరి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా శ్రీకాకుళంలో అకాడమీ ఏర్పాటుకు కావాల్సిన భూమితోపాటు సదుపాయాలు సమకూర్చుతామని మల్లీశ్వరికి కేంద్రమంత్రి సూచించారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆమె.. క్రీడలు, క్రీడాభివృద్ధి పట్ల రామ్మోహన్ నాయుడుకున్న ఆసక్తి, ఆలోచనలు హర్షణీయమన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల ఒప్పందాన్ని పునరుద్ధరించండి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు రెన్యువల్ ఉత్తర్వులు విడుదల చేయాలని ప్రభుత్వ జూనియర్ కాలేజెస్ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ ప్రభుత్వానికి గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరింది. 24 ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లుగా 3,618 మంది పనిచేస్తున్నారని, కళాశాలలు ప్రారంభానికి ముందే రెన్యువల్ చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే గత ప్రభుత్వంలో నిలిచిపోయిన కాంట్రాక్టు సర్వీసు క్రమబద్ధీకరణకు చర్యలు కూడా చేపట్టాలని విజ్ఞప్తి చేసింది.

కుర్చీకి అతుక్కుపోతే అంతే సంగతులు

ఎంత బిజీగా ఉన్నా శరీరాన్ని కాస్త అటూఇటూ కదల్చండి






- తరచూ లేచి నడవండి
- టీవీ చూస్తున్నప్పుడు కొన్ని నిమిషాలు లేచి తిరగండి
- పెద్దలు రోజుకు కనీసం 30 నుంచి 60 నిమిషాలు వ్యాయామం, వాకింగ్ తప్పనిసరి
- శారీరక, మానసిక ఆరోగ్యానికి ఐసీఎంఆర్ సూచనలు

30 నుంచి 60 నిమిషాల వ్యాయామం

- ✔ 19 నుంచి 60 ఏళ్ల వయసు వారు రోజుకు 30 నుంచి 60 నిమిషాల పాటు మితమైన, తీవ్రమైన వ్యాయామం చేయాలి.
- ✔ వారంలో ఐదు రోజులు వ్యాయామం తప్పనిసరి.
- ✔ వయసు, ఆరోగ్య స్థితిగతులను పరిగణనలో ఉంచుకుని ఏరోబిక్ ఫిజికల్ ఎక్సర్‌సైజ్, వాకింగ్ వంటి ఇతర శారీరక శ్రమ చేయాలి.
- ✔ ఇదే తరహాలో 60 ఏళ్లకు పైబడిన వృద్ధులకు కూడా వారం మూడు, అంతకంటే ఎక్కువ రోజులు శారీరక శ్రమను ఐసీఎంఆర్ సూచించింది.
- ✔ 5-19 ఏళ్ల పిల్లలు, యుక్త వయస్కులకు రోజుకు కనీసం 60 నిమిషాల ఇంటెన్సిటీ యాక్టివిటీని సూచించింది.



ఏ వయసు వారైనా రోజుకు తగినంత శారీరక శ్రమ చేయడం శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మంచిది. చదువు, పనిలో ఎంత బిజీగా ఉన్నా శారీరక శ్రమను మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని.. శరీరాన్ని కాస్త అటూఇటూ కదల్చాలని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) సూచిస్తోంది. జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్), ఐసీఎంఆర్ కలిసి డైట్రీ గైడెన్స్ ఫర్ ఇండియా పేరిట మెరుగైన ఆరోగ్యం కోసం 17 మార్గదర్శకాలను ఇటీవల వెల్లడించాయి. సంపూర్ణ ఆరోగ్యం కోసం శారీరక శ్రమ, యోగా, వ్యాయామంపై పలు సిఫార్సులు చేశాయి.

\- సాక్షి, అమరావతి

ప్రతి కొద్ది గంటలకు కదలిక ఉత్తమం

ఎంత బిజీగా ఉన్నా పనిచేసే ప్రదేశాల్లో, ఇతర సందర్భాల్లో కుర్చీకే అతుక్కోపోవడం సరికాదు. ప్రతి కొన్ని గంటలకు ఒకసారి శరీరాన్ని కదల్చాలని ఐసీఎంఆర్ సూచించింది. పని చేసే ప్రదేశాల్లో స్టాండింగ్ డెస్క్ ఉపయోగించాలి. లేదంటే ప్రతి అరగంటకు ఒకసారి లేచి నిలబడాలి. అదే విధంగా ప్రతి కొన్ని గంటలకు లేచి 5 నుంచి 10 నిమిషాలు అటూఇటూ నడవాలని పేర్కొంది. ఇంట్లో, పని ప్రదేశాల్లో ఫోన్ మాట్లాడేప్పుడు నడుస్తూ ఉండాలి. లిఫ్ట్, ఎలివేటర్‌కు బదులు మెట్లను వినియోగించాలి. టీవీ చూస్తున్నప్పుడు కుర్చీకే పరిమితం కాకూడదు. టీవీల్లో వచ్చే కమర్షియల్ బ్రేక్ సమయంలో లేచి తిరగాలి.

సంపూర్ణ ఆరోగ్యం కోసం దైనందిన జీవనంలో వివిధ కార్యకలాపాలపై సిఫార్సులు ఇలా..

■ కార్యకలాపం ■ కేటాయించాల్సిన సమయం (నిమిషాల్లో)

కార్యకలాపం	సమయం (నిమిషాల్లో)
నిద్ర	480
పని	480
ఇంటి పనులు	220
వ్యక్తిగత సంరక్షణ/తినడం/టీవీ చూడటం, ఇతర పనులు	180
ఫిజికల్ యాక్టివిటీ (యోగా, వాకింగ్, గార్డెనింగ్, డ్యాన్సింగ్, ఇతరత్రా పనులు)	60
ఏరోబిక్ ఎక్సర్‌సైజెస్ (సైక్లింగ్, స్విమ్మింగ్, రన్నింగ్)	20



లాన్సెట్ అధ్యయనం ఏం చెబుతోందంటే..

భారత్‌లోని 57 శాతం మహిళలు, 42 శాతం మంది పురుషులు ఫిజికల్ ఇనాక్టివ్‌గా ఉంటున్నట్టు తాజాగా ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్ అధ్యయనంలో వెల్లడైంది. ప్రపంచ వ్యాప్తంగా 195 దేశాల్లోని డేటాను అధ్యయనం చేయగా భారత్ 12వ స్థానంలో ఉన్నట్టు స్పష్టమైంది. ప్రపంచ వ్యాప్తంగా 31 శాతం మంది పెద్దలు అంటే.. దాదాపు 1.8 బిలియన్ల మంది 2022లో ఇనాక్టివ్‌గా ఉంటున్నారు. 2010 నుంచి 2022 మధ్య 5 శాతం మేర ఈ స్థాయి పెరిగినట్టు తేలింది.

వారానికి కనీసం 150 నిమిషాలు..

ప్రపంచ వ్యాప్తంగానే కాకుండా భారతీయుల్లో కూడా శారీరక శ్రమ తగ్గిపోతోంది. జీవన శైలి జబ్బుల బారినపడకుండా ఉండాలంటే వారానికి కనీసం 150 నిమిషాలు శారీరక శ్రమ చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సూచిస్తోంది.

ఆర్ఐఎంసీలో ప్రవేశాలకు నోటిఫికేషన్

8వ తరగతిలో ప్రవేశాలకు డిసెంబర్‌లో ప్రవేశ పరీక్ష

సాక్షి, అమరావతి: డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజీలో 8వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. జూలై–2025 టెర్మ్‌కుగాను వచ్చే జూలై ఒకటో తేదీ నాటికి 13 ఏళ్ల వయసు నిండిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీపీఎస్సీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఏడో తరగతి చదువుతున్నవారు లేదా పాసైన విద్యార్థులు అర్హులని, వీరికి ఈ ఏడాది డిసెంబర్ ఒకటో తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రకటించింది. జనరల్ అభ్యర్థులు రూ.600, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.555 www.rimc.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు ఫారం, పాత ప్రశ్నపత్రాలు, బుక్‌లెట్ పొందవచ్చన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను సెప్టెంబర్ 30వ తేదీ లోగా విజయవాడలోని సర్వీస్ కమిషన్ కార్యాలయంలో అందజేయాలని కార్యదర్శి ప్రదీప్ కుమార్ వెల్లడించారు.

ఎంటెక్ కోర్సులకు ఫీజులు ఖరారు

గరిష్టం రూ.90 వేలు, కనిష్టంగా రూ.50 వేలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎంటెక్ కోర్సులకు ఫీజులను ఖరారు చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 2024–25 విద్యా సంవత్సరానికి ఎంటెక్ కోర్సుల్లో కనీస ఫీజును రూ.50 వేలుగా పేర్కొంది. మొత్తం 178 ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలకు కన్వీనర్ కోటాలో ఎంటెక్ కోర్సులకు ఫీజులు నిర్ణయించింది. ఇందులో కోర్సు ఫీజు రూ.50 వేలు ఉన్న కళాశాలలు సుమారు 125 ఉన్నాయి. గరిష్టంగా రూ.90 వేలు ఉన్న కళాశాలలు 13 వరకూ ఉన్నాయి. వీటిల్లో ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మెనేజ్‌మెంట్(టెక్కలి), ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల(పెద్దాపురం), శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల, జీపీఆర్ ఇంజనీరింగ్ కళాశాల(కర్నూలు), డీఎన్ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(భీమవరం), నారాయణ ఇంజనీరింగ్ కళాశాల(గూడూరు), పేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(ఒంగోలు), పీవీపీ సిద్ధార్థ(విజయవాడ), ఆర్వీఆర్ అండ్ జేసీ(గుంటూరు), ఆదిశంకర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(గూడూరు), ఎస్ఆర్‌కేఆర్(భీమవరం), శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(చిత్తూరు), వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్(విజయవాడ)కళాశాలలకు గరిష్ఠ ఫీజులు నిర్ణయించారు. ఇదిలా ఉంటే 2024–25 విద్యా సంవత్సరానికి బీటెక్ కోర్సుల్లో కనీస ఫీజును రూ.40 వేలుగా నిర్ణయించగా.. దానిని రూ.43 వేలకు పెంచుతూ మరో జీవో విడుదల చేశారు.

జగనన్న మహిళా మార్టులకు జాతీయ గుర్తింపు

- మెప్మాకు రెండు జాతీయ అవార్డులు
- ఒకేసారి 'స్పార్క్, ప్రయిస్' పురస్కారాలు ప్రదానం

సాక్షి, అమరావతి: పట్టణాల్లోని మహిళలకు ఉపాధి చూపడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణలకు మరోసారి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. 'దీన్ దయాళ్ అంత్యోదయ యోజన–జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్' కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేసినందుకుగాను పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)ను అవార్డులు వరించాయి. 2023–24 సంవత్సరానికి గాను సిస్టమాటిక్ ప్రోగ్రెసివ్ అనలిటికల్ రియల్ టైమ్ ర్యాంకింగ్ (స్పార్క్) అవార్డు, పెర్ఫార్మెన్స్ రికగ్నేషన్ ఫర్ యాక్సెస్ టు ఫైనాన్సియల్ ఇంక్లూజన్ అండ్ స్ట్రీట్ వెండార్స్ ఎంపవర్‌మెంట్ (ప్రయిస్) పురస్కారం వచ్చాయి. ఈ అవార్డులు మెప్మాకు రావడం వరుసగా ఇది నాలుగోసారి కావడం విశేషం. గురువారం న్యూఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, సహాయమంత్రి తోఖాన్ సాహు చేతుల మీదుగా మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి అవార్డులను అందుకున్నారు. స్టేట్ మిషన్ మేనేజర్లు ఆది నారాయణ, రంగాచార్యులు, ఎస్ఎస్ఆర్ శ్రీనివాస్, ప్రభావతి పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వం కృషితో..

సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందించే నగదుతో మహిళలను స్వయం ఉపాధి వైపు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రోత్సహించింది. మెప్మా ఆధ్వర్యంలో పట్టణ ప్రాంత మహిళలను ప్రోత్సహించి 2 లక్షల మంది ఎస్‌హెచ్‌జీ సభ్యుల భాగస్వామ్యంతో జగనన్న మహిళా మార్టులను 15 మునిసిపాలిటీల్లో ఏర్పాటు చేసింది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలే పెట్టుబడిదారులు, ఉద్యోగులు, నిర్వాహకులు, వాటాదార్లుగా ఉన్న ఈ మార్టులు దేశవ్యాప్తంగా గుర్తింపు పొంది లాభాలను ఆర్జిస్తున్నాయి. మార్టులు ఏర్పాటు చేసిన అతితక్కువ కాలంలోనే రూ.60 కోట్లకు పైగా వ్యాపారం చేయడం గమనార్హం. వీటి నిర్వహణ పనితీరును పరిశీలించిన కేంద్రం స్పార్క్ అవార్డు ప్రదానం చేసింది. ఆర్థిక చేయూత, సాధికారత సాధించడంలో మెప్మా విభాగం అత్యుత్తమ పనితీరు కనబర్చింది. వీధి వ్యాపారులకు సరైన సమయంలో ఆర్థిక సాయం అందించడంతో పాటు వారు సరైన మార్గంలో వ్యాపారాలు చేసేలా ప్రోత్సహించినందుకుగాను ప్రయిస్ అవార్డును ప్రదానం చేశారు.



కేంద్ర మంత్రుల నుంచి అవార్డు అందుకున్న మెప్మా ఎండీ విజయలక్ష్మి, ఇతర అధికారులు

17 వర్సిటీలకు ఇన్‌చార్జ్ వీసీలు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- కూటమి ప్రభుత్వం రాగానే వైస్ చాన్సలర్లపై రాజకీయ ఒత్తిళ్లు
- రాజీనామాలు చేయాలంటూ బెదిరింపులు.. వైదొలిగిన వీసీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 17 యూనివర్సిటీలకు ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ల(వీసీల)ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని యూనివర్సిటీల వీసీలపై తీవ్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు వచ్చాయి. బలవంతంగా రాజీనామాలు చేయించారనే ఆరోపణలు బలంగా వినిపించాయి. యూనివర్సిటీల్లో టీఎన్ఎస్ఎఫ్, కూటమి అనుకూల ఉద్యోగులు వీసీలను బెదిరిస్తూ.. రాజీనామాలు చేసి వెళ్లిపోవాలంటూ హుకుం జారీ చేశారు. దీంతో జూలై 2 నాటికే వీసీలంతా రాజీనామాలు చేశారు. ఈ రాజీనామాలను గవర్నర్ ఆమోదించడంతో తాజాగా ఆయా వర్సిటీలకు ఇన్‌చార్జ్ వీసీలను నియమిస్తూ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వులిచ్చారు.

యూనివర్సిటీ	ఇన్‌చార్జ్ వీసీ (ప్రస్తుతం పనిచేస్తున్న డిపార్ట్‌మెంట్, వర్సిటీ)
శ్రీ వేంకటేశ్వర	సీహెచ్.అప్పారావు (బయోకెమిస్ట్రీ, శ్రీవేంకటేశ్వర)
శ్రీకృష్ణదేవరాయ	బి.అనిత (మేనేజ్‌మెంట్ స్టడీస్, శ్రీకృష్ణదేవరాయ)
ఆంధ్ర వర్సిటీ	జి.శశిభూషణ్‌రావు (ఈసీఈ, ఆంధ్ర వర్సిటీ)
ఆచార్య నాగార్జున	కె.గంగాధర్ (కంప్యూటర్ సైన్స్, ఏఎన్‌యూ)
జేఎన్‌టీయూ అనంతపురం	హెచ్.సుదర్శన్‌రావు (సివిల్ ఇంజనీరింగ్, జేఎన్‌టీయూ-ఏ)
శ్రీపద్మావతి మహిళా వర్సిటీ	వి.ఉమ (సోషియాలజీ, శ్రీపద్మావతి మహిళా వర్సిటీ)
జేఎన్‌టీయూ-గురజాడ	డి.రాజ్యలక్ష్మి (కంప్యూటర్ సైన్స్, జేఎన్‌టీయూ-గురజాడ)
జేఎన్‌టీయూ-కాకినాడ	కేవీఎస్‌జీ మురళీకృష్ణ (సివిల్ ఇంజనీరింగ్, జేఎన్‌టీయూ-కే)
ఆదికవి నన్నయ్య	వై.శ్రీనివాసరావు (జియాలజీ, ఆదికవి నన్నయ్య)
విక్రమసింహపురి	ఎస్.విజయభాస్కరరావు (ఫిజిక్స్, శ్రీ వేంకటేశ్వర వర్సిటీ)
కృష్ణా వర్సిటీ	ఆర్.శ్రీనివాసరావు (ఈఈఈ, జేఎన్‌టీయూ-కే)
రాయలసీమ వర్సిటీ	ఎన్‌టీకే నాయక్ (ఎకనామిక్స్, రాయలసీమ వర్సిటీ)
ద్రవిడియన్	ఎం.దొరస్వామి (లైబ్రరీ-ఇన్ఫర్మేషన్ సైన్స్, ద్రవిడియన్ వర్సిటీ)
వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఫైన్‌ఆర్ట్స్	జి.విశ్వనాథకుమార్ (ఆర్కిటెక్చర్, ఏయూ)
ఆంధ్ర కేసరి	డీవీఆర్ మూర్తి (జర్నలిజం, ఏయూ)
అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ	పఠాన్ షేక్ షావల్లిఖాన్ (బోటనీ, యోగి వేమన వర్సిటీ)
యోగి వేమన	కె.కృష్ణారెడ్డి (ఫిజిక్స్, యోగి వేమన వర్సిటీ)

ఆగమ పరీక్షలకు వేళాయే

- 40 ఏళ్లు నిండిన వారికి రాత పరీక్షల నుంచి మినహాయింపు
- దరఖాస్తులకు సెప్టెంబర్ 20 వరకు గడువు

సాక్షి, అమరావతి: వైదిక, స్మార్త, పాంచరాత్ర, వైఖానస, తంత్రసార, వీరశైవ, చాత్తాద శ్రీ వైష్ణవ, గ్రామ దేవత ఆగమములో ప్రవేశ, వర, ప్రవరస్థాయిలకు దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆగమ పరీక్షల కంట్రోలర్, దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆగమ పరీక్షలు–2024కు సంబంధించిన వివరాలతో గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రకటన తేదీ నాటికి అభ్యర్థుల వయసు 16 ఏళ్లు నిండి ఉండాలని, కనీసం 5వ తరగతి ఉత్తీర్ణత గానీ, తత్సమాన విద్యా పరిజ్ఞానంగానీ ఉన్నట్లు సంబంధిత సంస్థ నుంచి లేదా గురువు వద్ద నుండి ధృవీకరణ పత్రం జతపరచాలని పేర్కొన్నారు. పరీక్ష రుసుము రూ.100 చెల్లించాల్సి ఉంటుందని, 40 ఏళ్ల వయసు నిండిన అభ్యర్థులకు మాత్రమే రాత పరీక్షకు మినహాయిస్తామన్నారు. వారు గెజిటెడ్ అధికారిచే ధృవీకరించిన పుట్టిన తేదీ సర్టిఫికెట్‌ను జతపర్చాల్సి ఉంటుందన్నారు. 40 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉంటే తప్పనిసరిగా ఓరల్, రాత పరీక్ష రాయాలని స్పష్టం చేశారు. వర, ప్రవర రాసే అభ్యర్థులు గెజిటెడ్ అధికారిచే ధృవీకరించిన ప్రవేశ, వర పరీక్షల యోగ్యతా పత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించాలన్నారు. దరఖాస్తులను ఈ ఏడాది సెప్టెంబర్ 20లోగా ఆన్‌లైన్‌లో apendts.archakaexaminations.comలో సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 08645 273139, 9491000607, 9440682996 నంబర్లను సంప్రదించాలని కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.